Jaan Baaz Saathi
(Telugu)

ప్రవక్త (సఅసం) వారి
ప్రాణమిత్రులు

మూలం:

మాయల్ ఖైర్ ఆబాది

అనువాదం:

అబ్బాదుల్లా

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడయిన అల్లాహ్ పేరుతో

పరిచయం

ప్రియప్రవక్త (సఅసం) సహచరులు త్యాగమూర్తులు. ఇస్లాం కోసం తమ ప్రాణాలను త్యాగం చేశారు. ప్రపంచంలో ప్రవక్తల (అలై) తరువాత మహా పురుషులుగ పేరు పొందారు. ప్రజలకు ఆదర్శప్రాయులయ్యారు. ఆ మహా పురుషులు చూపిన చొరవ, సాధించిన పనులు అల్లాహ్‌ను, ఆయన ప్రవక్త (సఅసం)ను సంతోషపరిచాయి. వారంటే అల్లాహ్‌కు సంతోషం. ప్రవక్తకు ప్రీతి.

ప్రియప్రవక్త (సఅసం) సన్నిహితుల జీవితగాధలు చదువుతుంటే వారి అడుగుజాడల్లో నడిచే మహాభాగ్యం మనకూ కలుగాలనే తలంపు కలుగుతుంది. హృదయారవిందంగా ఉంటాయి వారి పనులు. మనం కూడ ధర్మానికి కట్టుబడి ఉండాలని, ధర్మసంస్థాపనకు జీవితం అంకితం చేయాలని కోరుకొంటాం. ఈ మహనీయులే ప్రపంచంలో జన్మించి ఉండనట్లయితే సత్యధర్మం మన వరకు చేరి ఉండేదికాదని మనకు తోస్తుంది. కాని అల్లాహ్ కృప వల్ల వారి జననం ప్రపంచానికి ధార్మిక మేలు చేకూర్చింది. దైవధర్మం చిరస్థాపితం కావడం ప్రియప్రవక్త (సఅసం) సహచరుల వల్ల సాధ్యపడింది. ప్రవక్తల జీవితాల తరువాత మహాప్రవక్త (సఅసం) సహచరులు తమ జీవిత విధానాన్ని ఆదర్శవంతం చేశారు. వారికి మనమెంతో రుణపడ్డాం.

ప్రియప్రవక్త (సఅసం) సహచరులు ఇస్లామి ఉద్యమాన్ని పురోగమింప జేశారు. ప్రియప్రవక్త (సఅసం)ను సమర్థిస్తూ త్యాగాలు చేశారు. ధార్మిక జీవితానికి కట్టుబడి, నమ్మిన జీవిత విధానాన్ని సర్వవ్యాపకం చేశారు. మానవాళికి ఆదర్శ ప్రాయులయ్యారు. ముస్లిములను దక్షతగల సుశిక్షితులుగా చేశారు. నిరంతర చైతన్యం వ్యాప్తిలోకి రావడానికి వారు స్ఫూర్తినిచ్చారు. వారి జీవిత చరిత్రల పఠనం మన కోసం గుణపాఠం కావాలని, దైవప్రసన్నత ప్రసాదించేట్లు మారాలని విశ్వప్రభువును అర్థిస్తున్నాం.

– మాయల్ ఖైర్ ఆబాది

హజరత్ ముసైబ్ ఇబ్నె ఉమైర్
(రజిఅల్లాహు అన్హు)

హజరత్ ముసైబ్ ఇబ్నె ఉమైర్ (రజి) చాలా అందమైనవారు. ఆయనగుపించారంటే సంతోషం కలిగేది. అంగ సౌష్టవం కలవారు. తండ్రి పేరు ఉమైర్. కుటుంబం ఐశ్వర్యంతో తులతూగేది. తల్లిదండ్రుల ఏకైక సంతానం కావడం వల్ల హజరత్ ఇబ్నె ఉమైర్ ఎంతో గారాబంగా పెంచబడ్డారు. ఎలాంటి కొరతలు లేని జీవితం. మంచి మంచి దుస్తులు ధరించేవారు. తలకు నూనె, ఒంటికి పరిమళం రాసుకునేవారు. ఎప్పుడైనా దర్జాగా ఏ దారిన వెళ్ళినా సరే ఆ దారిన నడిచే ప్రజలు ఆయన దుస్తుల్ని చూస్తూ నిలిచిపోయేవారు. తలంటి స్నానం చేసి నూనె రాచుకొని, పరిమళాలను పూసుకొని వెళ్తుంటే ఆ మార్గం నువాసనతో ఘుమఘుమలాడేది. ఆయన ఆకర్షణ, సౌందర్యం గురించి ఇంటింటా చర్చించుకొనేవారు. ముసైబ్ ఇబ్నె ఉమైర్ (రజి) తల్లిదండ్రులు ఆయన్ను కంటికి రెప్పలా చూసుకొనేవారు. ముద్దు మోముగల అబ్బాయిని చూస్తూ తల్లిదండ్రులు మురిసిపోయేవారు. ప్రేమతో పెంచుతూ వచ్చారు. ఒకప్పుడు ప్రియప్రవక్త (సఅసం) ముసైబ్ (రజి)ను జ్ఞాపకం చేసికొంటూ ఇలా అన్నారు:

"మక్కా పట్టణంలో ముసైబ్ సేవించే పదార్థాలకంటే అధిక రుచిగల అన్నపానీయాలు సేవించేవారు, సుఖసౌఖ్యాలను అనుభవించేవారు, ఖరీదైన దుస్తులు ధరించేవారు మరో వ్యక్తి లేడు. ఆయన్ను మించి అధిక గారాబంతో పెంచబడిన మనిషి కూడ లేడు."

సౌందర్యం గల వ్యక్తి. తల్లిదండ్రుల అపార ప్రేమను నోచుకొన్నారు. ప్రతి చిన్నా పెద్ద ముసైబ్(రజి)ను గౌరవ దృష్టితో చూసేవారు. ఆయన ఇస్లాం స్వీకరించారు. ముస్లిం సమాజంలో కూడ అల్లాహ్ ఆయన గౌరవమర్యాదలను అధికం చేశాడు. కాని ఇస్లామి ప్రపంచంలో అందచందాలు, ఆకర్షణీయమైన దుస్తులు, అలంకారాలు, సిరిసంపదలు ఆయనను రాణించలేదు. దైవవాక్యం

'ఇన్న అక్రమకుమ్ ఇందల్లాహి అత్ఖాకుమ్' అని చెబుతుంది. 'మీలో గౌరవోన్నతల దృష్ట్యా దైవ సమక్షంలో సర్వశ్రేష్ఠుడు ఎవరయ్యా అంటే, దైవ భయంతో ధార్మిక జీవితం గడిపే వ్యక్తి మాత్రమే.' ఇస్లాం స్వీకరించాక ఆపదలు ఆయనపై విరుచుకొని పడ్డాయి. బాధలు అనుభవించవలసివచ్చింది. కష్టాల కడలిని చూడాల్సివచ్చింది. ఇంకేముంది కష్టాల కొలిమిలో శరీరం కృశించి పోయింది. తల్లిదండ్రులు చూపించిన ప్రేమ వాత్సల్యాలకు ఆయన దూరమయ్యారు. ఇస్లాంలో ఆయనకు వరించిన ఉన్నత స్థానం ప్రాపంచిక వ్యవహారాల వల్ల కాదు. అల్లాహ్, అల్లాహ్ ప్రవక్త(సఅసం) ఏ సుగుణ సంపదలు మనిషిలో ఉండాలని కోరారో ఆ గుణగణాలన్నీ హజరత్ ముసైబ్ (రజి)కు అబ్బివచ్చాయి. ఎప్పుడూ ఆయనలో ఒకటే ఆలోచన. అల్లాహ్, ప్రియప్రవక్త(సఅసం)ల సంతోషాన్ని పొందడం ఎలా అన్నదే ఆయన దృక్పథం. ఈ సంకల్ప సాధనలో ఉత్కృష్ట భోజనం వదలడమయింది, ఖరీదైన దుస్తులు ఆయనకు దూరమయ్యాయి. ఇక పరిమళాలు పూసుకోవడం లేదు, దేహానికి నూనె రాసుకోవడం లేదు. వీటి వాడకం వల్ల ఒకప్పుడు ఆయనకు భోగభాగ్యాల విషయంలో ఒక విశిష్ట స్థానం ఉండేది. ఇప్పుడవి లేవు. ఆయన పని తీరు మారిపోయింది. అలంకరణ అసలు లేదు. రేయింబవళ్ళు ఒకే పని- ధర్మప్రచారం. దైవ సందేశ ప్రచారకులకు ఆయన జీవితం గొప్ప గుణపాఠం నేర్పుతుంది.

హజరత్ ముసైబ్ ఇబ్నె ఉమైర్ (రజి) ఇస్లాం స్వీకరించిన సమయం ఒక పరీక్షా సమయం. ఎవరైనా ఇస్లాం పేరు ఎత్తితేచాలు, సమాజం ఆ వ్యక్తి నిండుప్రాణాలు తీసేది. జీవితం గడపడం దుర్భరమయ్యేది. ఇంటి నుండి గెంటి వేయబడేవారు. ఇటు ఇంటివారు, అటు బయటివారు వారితో మాటముచ్చట మానేసేవారు. సమాజం నుండి వెలివేయబడేవారు. అలవికాని ఆపదలపాలు చేసేవారు. వేధింపు చర్యలకు బలిచేసేవారు. ముసైబ్ ఇబ్నె ఉమైర్ (రజి) లాంటి భోగభాగ్యాలతో సంతృప్తికరంగ జీవితం గడిపిన వ్యక్తి, కడు కఠోర సమయంలో ఇస్లాంను స్వీకరించారు. ముస్లిం కావడం నేరంగ ఉండిన ఆ రోజుల్లో, ఆయనకు తినడానికి తిండి, త్రాగేందుకు నీరు లేకుండా చేశారు అవిశ్వాసులు. ఖైదీగా చేసి అంధకార బంధురమైన గదులలో కట్టిపడేసేవారు.

కఠిన చిత్తం గల కొందరు విశ్వాసవంతులను బంధించి ఇష్టమొచ్చినట్లు కొట్టేవారు. అప్పటికీ విద్వేషాగ్ని చల్లబడకపోతే నిప్పులు క్రక్కుతూ వారి ప్రాణాలు కూడ తీసేవారు. ఇంకా కొందరు వినూత్న బాధలు పెట్టే పద్ధతులు సృష్టించేవారు, ఆ బాధలకు విశ్వాసవంతులు బలవుతుంటే, అది చూసి సంతోషపడేవారు అవిశ్వాసులు. మండుటెడారి ప్రాంతంలో విశ్వాసవంతుల్ని ఇసుక తిన్నెలపై పడేసేవారు. పారిపోకుండా బండలు మీద పెట్టేవారు. వారి దేహం కాలుతుంటే తమాషాగా తప్పెట్లు కొట్టేవారు, సీటీలు వేస్తూ ఆనందపడేవారు. దీనావస్థపాలై బాధపడడం విశ్వాసవంతుల అనుదిన అనుభవం.

హజరత్ ముసైబ్ (రజి) ఇలాంటి విపరీత పరిస్థితుల్లోనే ఇస్లాం స్వీకరించి విశ్వాసవంతులయ్యారు. ఒక రోజు- హజరత్ ముసైబ్ (రజి) నమాజు చదువుతున్నారు. ఒక దైవ ధిక్కారి అది చూశాడు. వెంటనే వెళ్ళి ముసైబ్ (రజి) తల్లిదండ్రులకు ఆ విషయం తెలియపరిచాడు. తనయుని పట్ల వారి మనస్తత్వం ఒక్కమారు మారిపోయింది. తల్లికున్న మమత అంతమయింది. తండ్రి మండి పడ్డాడు. తనయుని పట్ల ఉన్న ప్రేమ, ఆప్యాయత కోపోద్రేకాలుగా మారి పోయాయి. కుమారుని మందలించారు. హెచ్చరించారు కూడ. లాభం లేకపోయింది. ముసైబ్ (రజి) ధృడ విశ్వాసి; బెదరింపులు నిష్ప్రయోజన మయ్యాయి. ఇక వారు ముసైబ్ కాళ్ళుచేతులు కట్టేశారు. ఒక గదిలో పడేశారు. చాలాకాలం అక్కడే పడి ఉండేట్లు చేశారు. కాని ఆ దైవదాసుని నొసటపై కనీసం ఆవేదనపడే సూచనలు కూడ కనబడలేదు. భోగభాగ్య జీవితం గతించిపోయి నప్పటికీ విశ్వాస భాగ్యం కలిగిందని తృప్తిపొందారాయన. తుదకు ముస్లింలకు హిజరత్ (వలస) వెళ్ళాలనే ఆజ్ఞ ఇవ్వబడింది. అల్లారుముద్దుగా పెంచబడిన ముసైబ్ నాణ్యమైన, నాజూకు వస్త్రాలు ధరించే నవయువకుడు, పరిమళాల సువాసనలతో మందహాసంతో జీవించిన వ్యక్తి, ఇతర విశ్వాసులతో పాటు ఇల్లువాకిలి, తల్లిదండ్రులు, స్వదేశాన్ని వదలి అబిసీనియాకు వెళ్ళారు. ఆ పిమ్మట అబిసీనియా నుండి వాపసు వచ్చారు. కాని గుర్తుపట్ట వీలులేకుండా క్షీణించిపోయారు. ముసైబ్ (రజి) అనుభవించిన పరీక్షలు బహు కఠోరమైనవి.

వాటివల్ల ఆయన రూపురేఖలు మారిపోయాయి. దేహం చిక్కిపోయింది. అన్నపానీయాల్లో కాస్త మన్నిక తగ్గిందంటే, ధరించే దుస్తులలో నాణ్యత లోపించిందంటే మండిపోయే ముసైబ్ (రజి)కు ఇప్పుడు ఒంటి మీద ఒక లావుపాటి పాత గొంగళి ఉంది. చూపరులకు ఆయన దీనస్థితి కంటతడి పెట్టింది. తల్లి హృదయం దయతో కరిగి కన్నీళ్ళ పాలైంది. ఇక తనయుణ్ణి వేధించడం మానివేసింది తల్లి.

అదే కాలంలో హజరత్ ముసైబ్ (రజి) ప్రియప్రవక్త (సఅసం) సమక్షంలో హాజరయ్యారు. భౌతిక మార్పు అతని హుందాతనంలో తేడా తేలేకపోయింది. రాచ ఠీవితో వచ్చి ప్రియప్రవక్త (సఅసం) ముందు నిలబడ్డారు. ఒళ్ళునిండ కప్పుకోవటానికి బట్టలు లేవు. కేవలం ఒకే చర్మపు ముక్క ఉంది. అందులో ఎన్నో అతుకులున్నాయి. ప్రియప్రవక్త (సఅసం) సహచరులున్నారక్కడ. ఆయన్ను చూశారు. అతనిలో ఉన్న ఆత్మ గౌరవాన్ని గుర్తిస్తూ తలవంచుకొన్నారు. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా అన్నారు: **అల్‌హమ్దులిల్లాహ్** (దైవానికే సకల స్తోత్రాలు) ఇక ప్రపంచం, ప్రపంచవాసుల పరిస్థితి మారాలి. ఈ యువకుణ్ణి మించి నాజూకుగా పెంచబడినవారు మక్కా పట్టణంలోనే లేరు. కాని పుణ్యం కట్టుకొనే తపనతో, అల్లాహ్, ఆయన ప్రియప్రవక్త(సఅసం)ల సంతోషం నోచుకోవడానికి ఈయన సర్వం త్యాగం చేశారు.

ఈ మధ్యకాలంలో మదీన పట్టణవాసులెందరో ఇస్లాం స్వీకరించి విశ్వాసవంతులయ్యారు. వారందరు ఇస్లాం ధార్మిక విషయాల అవగాహన కోరుతూ ఒక ప్రచారకుణ్ణి పంపమని ప్రియప్రవక్త(సఅసం)ను అభ్యర్థించారు. ఆ పని కోసం ప్రియప్రవక్త (సఅసం) హజరత్ ముసైబ్ (రజి)ను ఎన్నుకున్నారు. ఆయనకు కొన్ని హితవులు ఇచ్చి మదీనకు పంపారు. ఆ పిమ్మట వచ్చిన ఫలితాలు హజరత్ ముసైబ్ (రజి) తనకు అప్పగించిన పనిని ఎంత గొప్పగా నెరవేర్చారో నిరూపించాయి.

మదీన పట్టణం చేరుకొన్నారు హజరత్ ముసైబ్ (రజి). కర్తవ్య నిర్వహణలో యుక్తి, దక్షతలు చూపించారు, ఇస్లామ్ ప్రచారం ప్రారంభించారు.

ఇస్లామి ఉద్యమ కార్యకర్తల్లో ఉండాల్సిన గుణగణాలు ఆయనలో సంపూర్ణంగా ఉండేవి. ఇంటింటికి వెళ్ళేవారు, వ్యక్తిగతంగా ప్రజలను కలుసుకొనేవారు. ఎదుటి మనిషి మనస్తత్వం గ్రహించేవారు. అతని ఆలోచనలను పసిగట్టేవారు. సమయోచితంగ ధర్మప్రబోధన చేసేవారు. దివ్యఖుర్ఆన్ వాక్యాలను ఎన్నుకొని పఠించేవారు. శ్రోతల మనస్సులను ఆకట్టుకొనే వారు. పరులను పలుకరించే సమయంలో ఆత్మీయత ఉట్టిపడేటట్లు మెలిగేవారు. మృదు భాషలో ముచ్చటించేవారు. ఆయన మాటలు మనిషిని ప్రభావితం చేసేవి. ఉదాహరణకు ఒక సంఘటన పేర్కొంటున్నాం. చదవండి.

ఒక రోజు హజరత్ ముసైబ్ (రజి) కొంతమంది ముస్లింలను సమీకరించారు. ధార్మిక విషయాలు ప్రబోధిస్తున్నారు. మదీన పట్టణపు సాఅద్ ఇబ్నె ఉమైర్ అనే ఒక భాగ్యవంతుడు, జరుగుతున్న ధర్మప్రచారం సంగతి తెలుసుకొన్నాడు. కోప్పడ్డాడు. సమాజంలో ప్రతిభాశాలిగ పేరుగన్న ఉసైద్ ఇబ్నె హుజైర్ అనే వ్యక్తితో ఇలా అన్నాడు. "ఈ ఇస్లాం ప్రచారకుణ్ణి మన వీధి నుండి తొలగించు. అతను ఇక్కడకు వచ్చి మన వారిలో చాలా మందిని తప్పుత్రోవ పట్టించాడు. ఈయన (నాకు దగ్గరి బంధువైన) అస్అద్ ఇంటిలో బస చేస్తున్నాడు. ఆ బంధుత్వమే లేకున్నట్లయితే ఈ విషయం నీకు చెప్పేవాణ్ణి కాను." చెప్పుడు మాటలకు ప్రభావితుడైన ఉసైద్ బల్లెం చేతబూనాడు. నేరుగ అస్అద్ ఇల్లు చేరాడు. ఆ ఇద్దరిని పిలిచాడు. ఆగ్రహావేశాలతో అన్నాడు: "నిన్నెవరు ఇక్కడికి రమ్మన్నారు? మా వారందరిని మార్గభ్రష్టులుగా చేస్తున్నావే? నీకు నీ ప్రాణాలపై ప్రీతి ఉంటే వెంటనే ఇక్కడి నుండి వెళ్ళిపో."

కర్ణకఠోరమైన మాటలు విన్న హజరత్ ముసైబ్ (రజి) మృదుమధుర శైలితో, "నాయనా! కూర్చో, మా మాటలేమిటో నీవు విను. నచ్చితే అంగీకరించు. లేకపోతే స్వయంగ మేము మా మార్గాన వెళ్ళిపోతాం" అని అన్నారు. ఉసైద్ తెచ్చిన బల్లెం నేలలో పాతాడు. కూర్చొని శ్రద్ధతో వినడం మొదలెట్టాడు. హజరత్ ముసైబ్ (రజి) కొన్ని దివ్యఖుర్ఆన్ వాక్యాలను వినిపించి, అల్లాహ్ సృష్టికర్త, పాలకుడు, ప్రభువు అంటూ మనోజ్ఞంగా వివరించి చెప్పాడు. ఏకేశ్వరోపాసనం

వల్ల కలిగే మేళ్ళను ఒక్కొక్కటిగా విశ్లేషించి చెప్పారు. ధర్మసందేశం హజరత్ ముసైబ్ (రజి) నోట విన్న ఉసైద్ విశ్వాస వివరాలు తెలుసుకొన్నారు. అదే సత్యమని సాక్ష్యమిచ్చారు. ఎంతటి మంచి ధర్మమిది, ఎంతటి విలువైన హితవులు ఇందులో ఉన్నాయి. ఈ ధర్మం అంగీకరించాలంటే మార్గమేమిటి? అని అడిగారు, ఉసైద్ ఇస్లాంను మనసార స్వీకరించి, ముస్లిం అయ్యారు.

ఈ సంఘటన అనంతరం సాఅద్ ఇబ్నె మాఅజ్ (రజి) కూడ దిక్కుతోచని స్థితిలో హజరత్ ముసైబ్ (రజి) దగ్గరకు వచ్చారు. తేనె కంటే తియ్యటి ముసైబ్ (రజి) పలుకులు విని సాఅద్ ఇబ్నె మాఅజ్ (రజి) హృదయం వెన్నలా కరిగిపోయింది. ధర్మప్రబోధన అవగాహనం చేసుకున్నారు. వెంటనే విశ్వాస వచనం పఠించారు. ఆయన ముస్లిం కావడం ఆలస్యం, ఏ కొందరో తప్ప మదీన వాసులందరు విశ్వాసవంతులయ్యారు, ఇస్లాం ధర్మంలో చేరిపోయారు. ముస్లింలయ్యారు.

మదీన పట్టణంలో ముసైబ్ (రజి) చేసి చూపించిన మరో మహోన్నత కార్యక్రమం వల్ల ఆయనకున్న వివేకం, దైవం వైపునకు ఆహ్వానించడంలో చూపిన ప్రజ్ఞాపాటవాలు, ఇస్లామీయ ఉద్యమ విజయసాధనకు ప్రదర్శించిన విజ్ఞత మనకు అర్థమవుతాయి. మదీనాలో ముస్లింల సంఖ్య బాగా పెరిగిన పిమ్మట వారందరిని ఒక జమాఅత్ (సమాజం)గా ఏర్పరచగలిగారు. ప్రతి శుక్రవారం సామూహిక నమాజు సంస్థాపిస్తూ దాని నిర్వహణ కోసం ప్రియప్రవక్త(సఅసం) వారి అనుమతి కోరారు. అనుమతి పొందాక ప్రప్రథమంగ అందరికీ ఎదురు నిలబడి ఒక ప్రభావపూరిత ఖుత్బా (జుమా ప్రసంగం) ఇచ్చారు. ఆ పిమ్మట ఎంతో వినయవిధేయతలతో నిర్మల హృదయంతో దైవభయం ఉట్టిపడే విధంగా జుమా నమాజును చేయించారు. జుమా నమాజును **"ఈదుల్ మోమినీన్"** అని అంటారు. (అంటే విశ్వాసవంతుల పండుగ అన్నమాట). ఈ నమాజును సంస్థాపించే మహాభాగ్యం హజరత్ ముసైబ్ (రజి)కు దక్కింది. వాస్తవం ఏమిటంటే ఎవరయితే అల్లాహ్ ప్రసన్నత పొందుతారో, వారితో ఆయన ఇలాంటి ధార్మిక మహత్కార్యాలను చేయిస్తారు.

మదీన పట్టణంలో హజరత్ ముసైబ్ (రజి) సాధించిన విజయాల వివరాలు మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు చేరేవి. అన్ని విధాల సంతృప్తి కలిగాక, మదీన పట్టణ ముస్లింలు ప్రియప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను మదీన తీసికొని రాదలిచారు. కొంత మందితో కలసి ఒక ముస్లింల బృందం మక్కా పట్టణం వచ్చింది. ఆ ముస్లిం సముదాయంలో వారి ఉపాధ్యాయుడు, ధార్మిక ప్రచారకుడు హజరత్ ముసైబ్ (రజి) కూడా ఉన్నారు. మక్కా నగరాన్ని చేరగానే ప్రప్రథమంగా మహాప్రవక్త (సఅసం) దగ్గరకు వచ్చారు, మదీనాలో యుక్తి పాటవంతో చేసిన ధార్మిక ప్రబోధనలను గురించి పూసగ్రుచ్చినట్లు విన్నవించారు. ప్రియప్రవక్త, విశ్వనాయకుడు (సఅసం) తనకు నివేదించిన విషయాలను ఆలకిస్తూ ఆనందపడ్డారు. అల్లాహ్ ప్రవక్త (సఅసం) సంతోషానికంటే ఎక్కువ ఓ విశ్వాసికి ఇంకేం కావాలి?

హజరత్ ముసైబ్ (రజి) తల్లి తన కుమారుడు ఎంతో కాలం గడిచాక మక్కా వచ్చాడని తెలిసికొంది. కాని వచ్చి ఇంటికి రాకుండా మరో స్థలంలో బస చేయడం వల్ల ఆమెకు అసంతృప్తి కలిగింది. వెంటనే ఒక కబురంపింది. "నీవు ఎటువంటి కుమారుడవు, నాయనా! నేను బ్రతికి ఉన్న ఊరికి వచ్చావు. నాతో మొదట కలువడానికి రాలేదు?" హజరత్ ముసైబ్ (రజి) ఆమెకొక జవాబు పంపుతూ ఇలా అన్నారు. "నేను ప్రియప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను కలుసుకోక ముందు మరెవ్వరినీ కలువను." హజరత్ ముసైబ్ (రజి)కు ప్రియప్రవక్త(సఅసం) పట్ల ఎంత ప్రగాఢమైన ప్రేమ ఉన్నదో దీనివల్ల మనకు తెలుస్తోంది.

హజరత్ ముసైబ్ (రజి) జీవిత చరిత్రలోని కొన్ని విషయాలు తెలియపరిచాం. వాటివల్ల ఆయనకు ఇస్లాం పట్ల ఉన్న అనన్య ప్రేమ, ఇస్లాం ప్రచారానికి చేసిన ఆదర్శ కృషి తెలుస్తోంది. ఇస్లాం ధర్మం కోసం ఆయన తన సౌందర్యం, ఐశ్వర్య సంపదలు, అలంకరణ ఆడంబరాలు, తల్లిదండ్రుల ప్రేమ, ఆత్మీయుల అభిమానాలను త్యాగం చేశారు. దైవధర్మం ఎదుట ఆయన ఏ వస్తువునూ అమూల్యమని తలచలేదు. మరో విషయం వినండి. ఆయన అసువులు ఏ విధంగ కోల్పోయారో చూడండి. అది తెలియకపోయినట్లయితే ఆయన జీవిత చరిత్ర పరిపూర్తి కాదు.

హజరత్ ముసైబ్ (రజి)కు అల్లాహ్ ఎన్నో అనుగ్రహాలనిచ్చాడు. రూపురేఖల్లో అనన్య సౌందర్యమివ్వడమే కాదు, శ్రోతల హృదయాలను గెలుచుకునే మాటల తీపిదనమే కాదు, దూరదృష్టి గల ఇంగిత జ్ఞానమే కాదు, వాటికి తోడు ఆయనకు అనన్య సామాన్యమైన ధైర్యసాహసాలను ఇచ్చాడు. సైనికుడిగా పోరాడే శక్తి, ఒక జనరల్‌గా యుద్ధవ్యూహం రచించే ప్రజ్ఞత దైవం ఆయనకు ఇచ్చాడు. బదర్ యుద్ధంలో ముహాజిర్ల సైన్యాన్ని నడిపే వీరపతాకం ప్రియప్రవక్త (సఅసం) ఈయన చేతికిచ్చారు. ఒహద్ సమర పతాకం పట్టే అదృష్టం ఈ వీరకిశోరానికే దక్కింది. సమర సన్నాహాలు ఏ విధంగా చేశారు, వాటి నిర్వహణ ఎలా జరిగిందో ఒహద్ యుద్ధ సంఘటనలు తెలియజేస్తున్నాయి.

ఒహద్ యుద్ధం దాదాపు విజయంతో అంతమవుతుంది. కాని కొద్దిమంది సిపాయిల ఆజ్ఞోల్లంఘన వల్ల ఆ యుద్ధంలో కొద్దిసేపటి వరకు పరాజయాన్ని చవిచూడాల్సి వచ్చింది. మక్కా అవిశ్వాసులు వెనుక నుండి ముస్లింల పైబడి ముస్లిం సైన్యాన్ని చిందరవందర చేశారు. ఆ సమయం పరీక్షా సమయం. సైన్య పతకాన్ని చేతపట్టిన హజరత్ ముసైబ్ (రజి) ఎకాకి అయినప్పటికీ శత్రు సంహారం చేస్తూ దక్కిన విజయం చేజారనివ్వకుండా పోరాడుతున్నారు. ప్రియప్రవక్త (సఅసం) తన చేతికిచ్చిన యుద్ధ పతాకాన్ని వెనుకకు మళ్ళించడమనేది ఆయనకు నచ్చింది కాదు. ఈ సమయంలో మక్కా శత్రువులు ఆయన్ను చుట్టుముట్టేశారు. కరవాలాలు ఒక వైపు నుండి పైబడవస్తున్నాయి. బాణాల వర్షం మరో వైపు నుండి కురుస్తుంది. బల్లెం పోట్లు మరోవైపు నుండి దూసుకొస్తున్నాయి. అన్నీ ఒకేసారి ముట్టడి చేస్తున్నాయి. వీర సైనికుడు ఎన్నో ప్రాణాపాయ పరిస్థితుల నుండి గెంటుకొస్తున్నాడు. ఎదపై కొన్ని దెబ్బలు పడ్డాయి. అయినప్పటికీ చేబూనిన పతాకాన్ని వదలక ధైర్యసాహసాలతో నిలబడ్డారు. ఈ భీకర పోరాటంలో ఒక శత్రువు కరవాలంతో ఒక్కమారు కుడి చేతిపై కొట్టాడు, రెండు ముక్కలయింది చెయ్యి. వాలుతున్న పతాకం ఎడమ చేతితో పట్టారు హజరత్ ముసైబ్ (రజి). అదను చూచి విరోధి మరో దెబ్బ ఎడమ చెయ్యిపై వేశాడు. ఆ చెయ్యి కూడ తెగి నేలపడింది. కాని విశ్వాస పౌరుషంగల ఆ

యువకుడు జండాను నేలవాలకుండా రెండు బాహువులతో బిగిసిపట్టారు. ఈ సాహసోపేత దృశ్యం చూసి ప్రత్యర్థి, కరవాలం పడేసి బల్లెంతో ముసైబ్ (రజి) ఎదపై తీవ్రంగ పొడిచాడు. బల్లెం కొన తెగి ఆయన ఎదలోనే ఉండిపోయింది. అల్లాహ్‌పై నిండు విశ్వాసం గల ఈ అమర వీరుడు దివ్యగ్రంథపు ఈ వాక్యాలను పఠిస్తూ నేలకొరిగారు.

ముహమ్మద్ (సఅసం) కేవలం అల్లాహ్ ప్రవక్త మాత్రమే. ఆయన (సఅసం)కు ముందు కూడ ప్రవక్తలు వచ్చారు. (ఆలి ఇమ్రాన్ :1)

జండా పట్టిన వీరుడు నేలవాలగ, ఇస్లామి పతాకం రెపరెపలాడుతూ విజయభేరి మ్రోగించింది. అమరవీరుని సోదరుడు దూరాన్నుండి ఈ దృశ్యం చూసి ఒక్కుదుటున అక్కడకు చేరి పడబోతున్న సోదరుని వద్ద నుండి యుద్ధ బావుటా పట్టారు, సమర మైదానంలో నిలిచారు. చివరి వరకు గెలుపు జండాను నేలవాలనివ్వలేదు.

యుద్ధం విజయంతో అంతమయింది. ప్రియప్రవక్త (సఅసం) ఈ అమరవీరుని మృతదేహం దగ్గర నిలిచారు. దివ్యగ్రంథపు ఈ వాక్యం చదివారు.

విశ్వాసవంతుల్లో కొందరు అల్లాహ్‌తో ఏ వాగ్దానం చేశారో దానిని రుజువు చేసి చూపించారు. (అల్ హాజ్)

ఆ పిమ్మట ఆయన శవాన్ని చూచి ఇలా అన్నారు:

"నేను నిన్ను మక్కాలో చూశాను. అక్కడ నీలాంటి అందగాడు, అలంకార ప్రియుడు మరొకడు లేడు. కాని ఈ రోజు చూస్తుంటే నీ తల వెంట్రుకలు చిందరవందరగా ఉన్నాయి. దేహం మీద ఒకే ఒక దుప్పటుంది."

ఆ కాలంలో బీదరికం వల్ల, దుర్భిక్ష స్థితి వల్ల ఒహద్ యుద్ధ అమరవీరులను ఖననం చేయడానికి కఫన్ (శవాలను కప్పు బట్టలు) లేకపోయేవి. హజరత్ ముసైబ్ ఇబ్నె ఉమైర్ (రజి) దేహంపై ఒకే ఒక దుప్పటి ఉంది. అది కూడ ఎలా ఉంది? తల భాగాన్ని కప్పితే కాళ్ళు అగుపించేవి, కాళ్ళ భాగం

కప్పితే తల అగుపించేది. చివరకు ఉన్న దుప్పటితో తల కప్పారు. కాళ్ళను గడ్డితో కప్పి ఖననం చేశారు. ఇది ఆ వీర పరాక్రమశాలి, త్యాగమూర్తి, ముస్లిం సమాజ అమరవీరుడు నోచుకొన్న శవం కప్పే వస్త్రం.

ఇది హజరత్ ముసైబ్ ఇబ్నె ఉమైర్ (రజి) జీవిత గాథ విన్నారు. అల్లాహ్ ఆయనంటే సంతోషపడుగాక.

అమర వీరుల సర్దారు హజరత్ హమ్జా (రజిఅల్లాహు అన్హు)

హజరత్ హమ్జా (రజి) ప్రియప్రవక్త (సఅసం)కు బంధువు. పిన తండ్రి అవుతారు. ఈ రక్త సంబంధంతోపాటు హజరత్ హమ్జా (రజి) పెంపుడు తల్లి పాలు త్రాగినందున సోదరుడవుతాడు. అబూ లహబ్ బానిస సౌబియా ఆయనకు శైశవంలో పాలిచ్చారు. ప్రియప్రవక్త (సఅసం)కు, ఆయనకు వయస్సులో కూడ అంత తేడా లేదు. కేవలం రెండేండ్లు పెద్ద. ఇస్లాంలో పుట్టుకను బట్టి, వంశాన్నిబట్టి, తెగ, జాతిని బట్టి, స్వస్థలాన్నిబట్టి ఎవరికీ ఏ మాత్రం ప్రాధాన్యత ఉండదు. ఇస్లాంలో ఎవరికైన ఔన్నత్యం ఉందంటే అది కేవలం అల్లాహ్ మనిషికిచ్చిన అర్హత స్థోమతలను దైవమార్గంలో వినియోగించడం వల్ల ఉంటుంది. దానిని బట్టే వారు రాణిస్తారు, మహనీయులుగా గౌరవించబడుతారు కూడ. హజరత్ హమ్జా (రజి)కు అల్లాహ్ రెండు రంగాలలో నైపుణ్యం ప్రసాదించాడు. ఒక సిపాయిగ ఆయనకు అద్వితీయ సాహసాన్ని ఇచ్చాడు, మల్లయుద్ధంలో అసాధారణ పరాక్రమం ప్రసాదించాడు. హజరత్ హమ్జా (రజి) ఈ రెండు నైపుణ్యతలతో దైవ హక్కులను నెరవేర్చారు. జీవితం అసాధారణంగా గడిపారు. మహాప్రవక్త (సఅసం) ఈయనను **సయ్యదుష్షుహదా** (అమరవీరుల సర్దారు) అనే బిరుదునిచ్చి సత్కరించారు.

హజరత్ హమ్జా(రజి) బాల్యం నుండే మల్లయుద్ధంలో, వేటాడడంలో ఎక్కువ మక్కువ కలిగి ఉండేవారు. బాణాలు కురిపించడంలో, కరవాలం

త్రిప్పడంలో ఆయన అద్వితీయ సామర్థ్యం కలవారు. రేయింబవళ్ళు ఈ రెండింటిలో ప్రావీణ్యతల్ని సంపాదించడంలో జీవితం గడిపేవారు. దేవుడొక్కడే అన్న ఉద్యమం ఆయన ఇంటి నుండే ఎలుగెత్తింది. మక్కా పుర వీధుల్లో మారుమ్రోగింది. ముప్పది ఎనిమిది మంది ఇస్లాం స్వీకరించారు. ముస్లిం లయ్యారు. హజరత్ హమ్జా (రజి)కు వేట వినోదాలతో, యుద్ధ ఆయుధాల ప్రయోగంలో నైపుణ్యత సాధించడంలో తీరిక లేకపోయేది. ఇస్లామి విప్లవం వైపు చెవి ఒగ్గి వినడానికి వీలులేకపోయింది. కాని ఇస్లాం వైపు రావడానికి ఒక సన్నివేశం ఈయనకు తోడ్పడింది. దీనివల్ల ఆయన దైవహితవు పొంద వీలయింది.

ఒకానొక దినం షికారు వెళ్ళి తిరిగి వస్తూ హజరత్ హమ్జా (రజి) పట్టణంలో ప్రవేశించారు. దారిలో దాసి కనబడింది. ఆమె ఆయనతో, "ఓహ్! కాస్త ముందు మీరు గనక వచ్చి ఉంటే మీ సోదర కుమారుడు ముహమ్మద్ (సఅసం) పరిస్థితిని చూసి ఉండేవారు. ఆయన (సఅసం) ఇస్లాం గురించి కాబాలో ప్రచార ప్రసంగం చేస్తున్నారు. అబూ జహల్ అక్కడికి వచ్చాడు, ఆయన (సఅసం)ను కఠినంగ తిట్టాడు, చాలా బాధకరంగా వేదించాడు. కాని ముహమ్మద్ (సఅసం) ఏ మాత్రం జవాబివ్వక అబూ జహల్ చేసిన అవమానం మౌనంతో భరించారు, పరాభవంతో వెళ్ళిపోయారు."

దాసి ఇచ్చిన రిపోర్టు విన్నారు హమ్జా(రజి). కోపోద్రేకాలతో మండి పోయారు. గబగబ 'కాబా' వైపు అడుగులు వేశారు. పట్టరాని ఆవేశంతో వెళ్తున్నారు. మార్గంలో ఎవరు కనబడినా చూడడం లేదు. రోజు కలిసే వారితో కూడ మాట్లాడడం లేదు. కాబాలో ప్రవేశించారు. అబూ జహల్ కంట పడ్డాడు. వందిమాగధులు ఆయన చుట్టూ చేరి అబూ జహల్‌ను పొగడ్తున్నారు. వింటిని తీసికొన్నారు, దానితో అబూ జహల్ తలబ్రద్దలయ్యేట్టు ఒక్కమారు మోదారు. రక్కసిలా ప్రవర్తించిన అబూ జహల్ తీవ్రంగా గాయపడ్డాడు. ఒళ్ళంతా రక్తసిక్తమయింది. అతని చంచాలు విభ్రాంతులయ్యారు. "ఓ హమ్జా! నీవూ మార్గభ్రష్టుడవైనట్లుందే!" అన్నారు. హజరత్ హమ్జా (రజి) ఇలా జవాబిచ్చారు:

"నాకు సత్యం తెలిశాక దాన్నుండి నన్నెవరూ దూరం చెయ్యలేరు. నిజం! ముహమ్మద్ (సఅసం) అల్లాహ్ ప్రవక్త. ఆయన చెప్పేదంతా నిజం. దైవసాక్షి! నేనిక దాని నుండి మరలలేను. మీరే గనుక సత్యవంతులైతే ముహమ్మద్ (సఅసం)ను ఆయన చేసే ప్రచారం నుండి ఆపండి, చూద్దాం." హమ్జా కనబరచిన పౌరుషం చూస్తూ అబూ జహల్ తన పరివారాన్ని తీసుకొని వెనక్కి తగ్గాడు.

ఆ కాలం బహు కఠినంగా ఉంది విశ్వాసులకు. వారిపై మక్కా వాసులు విరుచుకొని పడేవారు. బలహీనులుగా ఉన్న ముస్లింలపై దౌర్జన్యం చేసేవారు. వారి నుండి రక్షణ కోరుతూ ప్రియప్రవక్త ముహమ్మద్ (సఅసం) అర్ఖం ఇబ్నె అబీ అర్ఖం ఇంటిలో శరణు తీసికొన్నారు. ఇస్లాం పేరు తీసికోవడానికే భయభ్రాంతు లయ్యే వారు ప్రజలు. ఆలాంటి సమయంలో హజరత్ హమ్జా (రజి) తన విశ్వాస ప్రకటన చేస్తూ ఆ కాలపు అవిశ్వాస ప్రజలకు ఒక ఛాలెంజినిచ్చారు. ఈ సంఘటన హజరత్ హమ్జా (రజి) వీర పరాక్రమాలకు ఒక నిదర్శనం. హజరత్ హమ్జా (రజి) ఇస్లాం స్వీకరించాక మక్కాలో పరిస్థితులు మారిపోయాయి. మక్కా వాసులు ముస్లింలను వేధించడానికి ముందు బాగుగ ఆలోచించుకొనే సమయం వచ్చింది. దైవమార్గంలో హజరత్ హమ్జా (రజి) చూపిన చొరవ, సమయస్ఫూర్తి, అగ్రశ్రేణి విరోధిని ఎదిరించడంలో చూపిన సాహసం, దైవమార్గంలో అల్లాహ్ ఇచ్చిన శక్తి సామర్థ్యాలను ఉపయోగించడం ఆయన ప్రదర్శించిన విశ్వాస పటిమకు నిదర్శనాలు.

హజరత్ హమ్జా (రజి) ముస్లిం కావడం మక్కాలోని ఇస్లాం శత్రువులకు చాలా చీకాకు కల్గించింది. ఇక ముమ్ముందు పాటించాల్సిన రణనీతి నిర్దేశించుకోవలసి వచ్చింది. సత్యధర్మ ప్రచారాన్ని మొగ్గలో త్రుంచివేయడం ఎలా సాధ్యమవు తుందని సంప్రదించుకోవడం ప్రారంభించారు. తికమకపడుతూ చివరకు ఒక నిర్ణయానికి వచ్చారు. అది ఇస్లాం సందేశ రథసారథిని అంతం చేయడం.

ఈ హత్య చేయడం సులభం కాదు. హంతకునికి బహుమానంగ ఒక పెద్ద మొత్తం సమకూర్చబడింది. మక్కాలో మరో వీరుడు ఉన్నాడు. అతడే

ఉమర్. ప్రియప్రవక్త (సఅసం) సంహారకునికి ఇచ్చే పారితోషికం విని ఈయన చేతకరవాలం పట్టి అర్ఖమ్ ఇబ్నె అబీ అర్ఖమ్ ఇంటివైపు దారి తీసారు ఉమర్(రజి). అక్కడ ప్రియప్రవక్త (సఅసం) చుట్టూ 'సహబ' (ప్రవక్త సహచరులు) ఉన్నారు. ఉమర్ వస్తున్నారని తెలిసింది. అందరు కింకర్తవ్యం అని ఆలోచిస్తున్నారు. కాని హజరత్ హమ్జా (రజి) ధీమాగ అన్నారు: "ఏమీ పరువాలేదు. ఆయన్ను రానీయండి. సదుద్దేశ్యంతో వస్తున్నారా సరే. లేకుంటే ఆయన కరవాలంతోనే ఆయన శిరచ్ఛేదం చేస్తాను."

ఇది హజరత్ హమ్జా(రజి) పరాక్రమానికి మరో నిదర్శనం. అల్లాహ్ ప్రసాదించిన బాహుబలంపై ఆయనకున్న విశ్వాసం. అలాంటిదే మరో సంఘటన వినండి:

పుట్టుక, వంశాల దృష్ట్యా గర్వపడే జాతి అరబ్బు జాతి. వివేకం గల అనేకులు కేవలం తమ పొగరుబోతుతనం వల్ల ఇస్లాం భాగ్యానికి దూరంగా ఉంటూ వచ్చారు. బదర్ యుద్ధమైదానంలో అబుల్ బక్తరీ అనే వ్యక్తి అబూ జహల్‌నుద్దేశిస్తూ, ముహమ్మద్ (సఅసం)ను చూపారు, ఇలా ప్రశ్నించారు. నిజం చెప్పవయ్యా? ఈయన విషయంలో నీ అభిప్రాయమేమిటి? అబూ జహల్ ఇలా అన్నాడు:

ఆయన సత్యవంతుడు అనడంలో నాకు లేశమంత సంశయం లేదు. కాని మేము బిలాల్ (నీగ్రో బానిస)తో సమానంగా ఎలా కూర్చోగలమో చెప్పండి. హజరత్ బిలాల్ (రజి) గులాం (బానిస)గా ఉండి ముస్లిం అయ్యాడు. ఆ కాలంలో బానిసలపై జరిగే దౌర్జన్యాలు ఈ కాలంలో ఊహించలేము కూడ. ఆఫ్రికా దేశపు నల్లవారిని మనుషులుగా కూడా లెక్కించే వారు కారు అరబ్బులు. వారి స్థితి అధ్వాన్నంగా ఉండేది. కాని దైవప్రవక్త (సఅసం) అనుచరులకు అల్లాహ్ విజ్ఞత ఇచ్చాడు. వారిలో తెల్లవారు నల్లవారని, అధికులు అల్పులని, బీదలు ధనవంతులని, ఇంకా కులం గోత్రం మొదలగువాటి ప్రాతిపదికలపై విచక్షణ చూపేవారు కారు. హజరత్ హమ్జా (రజి) దృష్టాంతమే తీసికోండి. ప్రియప్రవక్త (సఅసం) తన సుప్రసిద్ధ బానిస జైదు ఇబ్నె హారిస్ (రజి)ను తన స్వంత పిన తండ్రి హజరత్ హమ్జా (రజి)కు ఇస్లామి సోదరునిగా చేయడం జరిగింది.

హజరత్ హమ్జా(రజి)కు హజరత్ జైదు(రజి) పట్ల ఎనలేని అభిమానం. హజరత్ హమ్జా (రజి) ఎక్కడికైనా వెళ్ళితే తన ఇస్లామి సోదరుడు హజరత్ జైదు(రజి)ను తన వారసునిగ నియమిస్తూ అన్ని విధాల అధికారాల వీలునామాను ఆయనకే ఇచ్చి వెళ్ళేవారు. ఎందరో రక్త బంధుత్వం కలవారున్నారు, స్నేహితులున్నారు, కాని వారందరితో ప్రస్తావన లేకుండా ఇస్లామి సోదరుడైన హజరత్ జైదు(రజి)కు అంత విలువ నిచ్చేవారు హజరత్ హమ్జా(రజి). ఇస్లాంలో ప్రవేశం అల్లాహ్‌తో ఎడతెగని బంధం కల్గించింది. ఆయన ఒక సైనికుడు, మల్ల యుద్ధవీరుడు అంతకు ముందు తనకున్న పరాక్రమాలను వినోద విలాసాలలో గడిపేవాడు. ఈ నైపుణ్యాలు వేటలో ఉపయోగపడేవి, ఇప్పుడవి ఇస్లామి మార్గంలో ఉపయోగించసాగారు. ఆ గుణగణాలు ఏ విధంగా ఉపయోగపడ్డాయో చూడండి.

హజరత్ హమ్జా (రజి) ఇస్లాం అవతరించిన 13 సంవత్సరాల తరువాత ప్రియప్రవక్త (సఅసం) అనుచరులతో బాటు హిజరత్ చేశారు. మదీన పట్టణం చేరారు. దైవం ప్రసాదించిన తెలివితేటలు, బాహుబల పరాక్రమాలు ఇస్లామి మార్గంలో వినియోగించడానికి ఆయనకు మంచి అవకాశం లభించింది. అన్నింటి కంటే ముందు మక్కా నుండి వస్తున్న అవిశ్వాస బృందాలను ఆపడానికి ప్రియప్రవక్త ముహమ్మద్ (సఅసం) ముప్పదిమంది 'సహబ'లను హజరత్ హమ్జా(రజి) నాయకత్వంలో పంపడమయింది. ఈ విధంగా ఇస్లామి సైన్యపు ప్రప్రథమ యుద్ధపతాకం హజరత్ హమ్జా (రజి)కు ఇవ్వడమయింది, ఆ అదృష్టాన్ని ఆయన నోచుకొన్నారు.

ఈ ముప్పది మంది సైన్యం ముందుకు వెళ్తూ వెళ్తూ అకస్మాత్తుగ అబూ జహల్ వెంటవస్తున్న జట్టును ఎదుర్కోవలసి వచ్చింది. వారి మధ్య యుద్ధం జరిగింది. వచ్చిన విరోధుల జట్టులో మూడు వందల మంది ఉన్నారు. హజరత్ హమ్జా (రజి)తో ఉన్న ముప్పది మంది మూడు వందల మంది శత్రువుల దాడిని ఎదుర్కోడానికి సిద్ధంగా ఉన్నారు. శత్రు సేనలో ముజద్ది ఇబ్నె ఉమరు అల్ ఘని అనే వ్యక్తి ఉన్నాడు. హజరత్ హమ్జా(రజి)ను చూశారు. వెంటనే ఇరువర్గాల మధ్యకు వచ్చి వారిని తగవు నుండి ఆపారు. ఇరు పక్షాలు ఏ యుద్ధం చేయకుండా దూరమయ్యాయి. ఈ విధంగ ప్రియప్రవక్త (సఅసం)

కొద్ది మందితో హజరత్ హమ్జా(రజి)ను శత్రువులపై దాడి చేయడానికి పంపారు. ఆయన విజయోన్ముఖులై వాపసు వచ్చారు.

బదర్ సంగ్రామం రానే వచ్చింది. ఆ యుద్ధంలో ఖురైషు వర్గంలో పేరు మోసిన వ్యక్తి ఉతుబ, తన సోదరునితో, కుమారునితోబాటు రణ అట్టహాసంతో ముందుకు వచ్చారు. ఇస్లామి సైన్యం నుండి కొందరు అన్సారీలు వారినెదుర్కోవడానికి వచ్చారు. కాని ఉతుబ గర్విష్టి. తన బలాధిక్యతపై అహంకారం కలవాడు. అతనికంటే తక్కువ హోదా కలవారితో పోరాడడానికి ఇష్టపడలేదు. సరి ఉజ్జీ ఉంటే ముందుకు రావాల్సిందని పిలుపునిచ్చాడు. "ఓ ముహమ్మద్ (సఅసం)! మాతో సరిపడే వారిని పంపు"అని కోరాడు. ఈ ఛాలెంజి విని హజరత్ ముహమ్మద్ (సఅసం) హజరత్ హమ్జా (రజి), హజరత్ అలీ (రజి), హజరత్ ఉబేద (రజి)లను పంపారు. హజరత్ హమ్జా (రజి) ఉతుబను ఎదుర్కొన్నారు. ఒక్క వేటువేసి అతన్ని కుప్పకూలేటట్లు చేశారు. ఇది చూచిన మక్కా అవిశ్వాసులు మరో బలవంతుణ్ణి రంగంలోకి దింపారు. అతని పేరు తయామ ఇబ్నె అది. ఉతుబను చంపినవానిపై ప్రతీకారం తీసుకొంటానని ఒక్కగంతు వేసి ముందుకు వచ్చాడు. కాని హమ్జా(రజి) వేసిన ఒక్క దెబ్బతో ఆ శత్రువు నరకాన్ని చేరాడు. ఇదంతా చూస్తున్న శత్రుసేన ఒక్కమారు ఇస్లామి సైన్యాన్ని ముట్టడించింది. సమరయోధులు శత్రువులలో చిక్కుకొనడం చూచి ప్రియప్రవక్త (సఅసం) ముజాహిదులను ముందుకు వెళ్ళి అవిశ్వాసుల సైన్యాన్ని హతమార్చమని ఆజ్ఞ ఇచ్చారు. యుద్ధం భీకరంగ సాగింది. హజరత్ హమ్జా (రజి) తలపాగపై (సుతుర్) తురాయి ఉంది. ఎర్రటి తురాయి ఎక్కడ ఉన్న హజరత్ హమ్జా (రజి) అక్కడ ఉన్నట్టే. ఆయన రెండు చేతులతో కరవాలం త్రిప్పే నిపుణుడు. ఎటు వెళ్ళితే అటు శత్రుసేనలను సునాయాసంగ చీల్చిచెండాడు తున్నారు. ఆయన చేతుల్లో గొప్ప గొప్ప వైరివీరులు పరలోకగతులయ్యారు. కొద్ది సేపటిలోనే విద్రోహులు పలాయనం చిత్తగించారు. ముస్లిం సేన అనేక శత్రువులను బందీలుగ తీసికొంది. ఆ ఖైదీలలో మక్కా పట్టణపు గొప్పవారు ఉన్నారు. ఖైదీలలో కొందరు, "ఎర్రటి తురాయి తలపాగపై పెట్టుకొని సమరం

చేసిన వ్యక్తి ఎవరూ?" అని అడిగారు. 'హమ్జా' అని చెప్పగా వారన్నారు, "ఈ రోజు అందరికన్నా అధికంగ ఆయనే మమ్మల్ని నష్టపరిచారు."

ఈ పరాజయంతో మక్కా అవిశ్వాసులకు పెద్ద ఎత్తున ప్రాణ నష్టం, ధన నష్టం సంభవించింది. ఈ వ్యసనంతో వారు కృంగిపోయారు. ఎలాగైనా ప్రతీకారం తీసికోవాలని గొప్ప సైన్యాన్ని సమీకరించారు. మదీన వైపు బయలుదేరారు. ప్రియప్రవక్త (సఅసం) కూడ తన ఆప్తమిత్రులను, ప్రాణత్యాగ శీలురను తీసికొన్నారు. ఒహద్ అనే ప్రాంతం చేరి శత్రువులను ఆపారు. శత్రు సేనల నుండి 'సబా' అనే పహిల్వాను తొడను కొట్టి "రండి, నాతో పోరాడడానికి" అని అన్నాడు. హాజరత్ హమ్జా (రజి) కరవాలం పట్టి మైదానంలోకి దిగారు, ఉరుములా గర్జించారు. "అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త(సఅసం)తో పోరాడడానికి వచ్చావా?" అంటూ ఒక్క దెబ్బవేశారు. ఆ దెబ్బతో ఆ పహిల్వాను కుర్రో మొర్రో అంటూ ప్రాణాలు తీసాడు.

ఆ పిమ్మట భీకర పోరాటం ప్రారంభమయింది. బదర్ యుద్ధంలో మక్కా శత్రువులలోని పెద్ద పెద్ద పేరుమోసిన మొనగాళ్ళు హాజరత్ హమ్జా (రజి) చేతుల్లో చంపబడ్డారు. ఖురైషులు ఆయన రక్త దాహంతో ఎదురు చూస్తున్నారు. వరుసలు తీర్చి విరోధి సైన్యం హాజరత్ హమ్జా (రజి)పై పడుతోంది. హాజరత్ హమ్జా (రజి) వారి వరుసల్ని తుత్తునియలు చేస్తున్నారు. ఒంటరిగా ముప్పది మంది శత్రువులను హతమార్చారు.

జుబైర్ ఇబ్నె ముత్అమ్ అనే వ్యక్తి, తన పిన తండ్రి, తయిదు ఇబ్నె అదిను, హాజరత్ హమ్జా (రజి) చంపడం వల్ల, హాజరత్ హమ్జా(రజి) ప్రాణాలు తీయడానికి తన బానిస వహషిని ప్రత్యేకంగ నియమించాడు. హమ్జా (రజి)ను చంపినట్లయితే తగిన బహుమానంతోపాటు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలనిస్తానని వహషికి ప్రలోభపెట్టాడు. ఈ ప్రేరేపణకు లోనైన వహషి ఒక పెద్ద బండ రాతి వెనుక పొంచి అవకాశం కోసం ఎదురు చూస్తున్నాడు. అనుకోకుండ హాజరత్ హమ్జా (రజి) ఆ దారిన రానే వచ్చారు. వెంటనే వహషి వెనుక నుండి ఒక్క దెబ్బ గురి తప్పకుండా హాజరత్ హమ్జా(రజి) పై వేశాడు. ఆ దెబ్బ బలమైంది.

హజరత్ హమ్జా (రజి) గిర్రున తిరుగుతూ నేలవాలారు, ప్రాణాలు వీడారు. (ఇన్నాలిల్లాహి వఇన్నా ఇలైహి రాజివూన్)

హజరత్ హమ్జా (రజి) మరణవార్త మక్కాలో వ్యాపించింది. అవిశ్వాసుల మహిళలు ఆ వార్త విని సంతసించారు, కలిగిన ఆహ్లాదంతో గాన సభలు ఏర్పరచుకొని రాగాలాపన చేశారు. అబూసుఫియాన్ భార్యపేరు హింద. బదర్ యుద్ధంలో ఆమె తండ్రి హజరత్ హమ్జా (రజి) చేతుల్లో చంపబడ్డారు. ప్రతీకార విద్వేషం ఆమెలో అలుముకొంది. హజరత్ హమ్జా మృతదేహం నుండి కాలేయాన్ని లాగి కరకర నమిలి మ్రింగ చూచింది. కాని మ్రింగలేకపోయింది. ఉమ్మివేసింది. ప్రియప్రవక్త (సఅసం) పిన తండ్రి పట్ల ఆమెకున్న విషజ్వాల కఠోరమైంది. అంతటితో ఊరకొనక హజరత్ హమ్జా (రజి) ముక్కు చెవులను కోసి ఆభరణంలా వేసికొంది. ఈ విషయం ప్రియప్రవక్త(సఅసం)కు తెలియగా ఆయన (సఅసం) 'ఆమె కాలేయాన్ని మ్రింగిందా?' అని అడిగారు. అక్కడున్న వారు లేదని చెప్పారు. ప్రియప్రవక్త (సఅసం)అన్నారు: "హజరత్ హమ్జా దేహాంగాలలో ఏ భాగం కూడ అల్లాహ్ నరకం చేరనివ్వడు."

ఆ పిమ్మట పిన తండ్రి శవం దగ్గరకు వెళ్ళారు. శవం ముక్కు చెవులు కోసి, హింద మృతదేహాన్ని భయానకంగ చేసింది. అది చూచి ఆయన హృదయం చలించింది. ఇలా అన్నారు: "మీపై అల్లాహ్ కృపకలుగుగాక! మీరు బంధుత్వపు హక్కును అందరికంటే అధికంగ నిర్వహించేవారు. పుణ్యకార్యాలలో ముందడుగు వేసి పాల్గొనేవారు."

హజరత్ సఫియా (రజి) హజరత్ హమ్జాగారి సోదరి. అన్న మరణ వార్త విని శవపేటిక వరకు వచ్చారు. కాని శవం చూడకుండా మహాప్రవక్త (సఅసం) ఆమెను వారించారు. ఓదార్చి చల్లబరచి వెనుకకు పంపివేశారు. వెళుతూ తన కుమారుడు అయిన హజరత్ జుబేర్ (రజి)కు రెండు దుప్పట్లనిచ్చి పోయారు. వాటితో హజరత్ హమ్జా(రజి) శవాన్ని కప్పమన్నారు. కాని ప్రక్కనే ఒక అన్సారి మృతదేహం ఉంది. ఏదీ నోచుకోని స్థితిలో ఉంది. అందుచేత

హజరత్ జుబైర్ (రజి) తలా ఒక దుప్పటి ఇస్తూ శవాలను కప్పి ఖననం చేయమన్నారు. కాని ఒక దుప్పటితో శవం వాటిని తలపై కప్పితే కాళ్ళు కనబడతాయి, కాళ్ళపై కప్పితే తల భాగం కనబడుతుంది. ప్రియప్రవక్త (సఅసం) ఇలా సెలవిచ్చారు. "చాలీచాలని దుప్పటితో ముఖ భాగం కప్పండి, కాళ్ళ మీద ఆకులు, గడ్డి వేయండి."

గుణపాఠం నేర్పే ఈ మృతదేహం ఖననం కోసం సిద్ధమయింది. ప్రియప్రవక్త (సఅసం) జనాజ నమాజు చదివించారు. ఆ పిమ్మట ఒహద్ యుద్ధంలో స్వర్గీయ ముస్లిం సైనికులు ఒక్కొక్కరి జనాజ నమాజు చేయించారు ప్రియప్రవక్త (సఅసం). హజరత్ హమ్జా (రజి) మృతదేహం ప్రక్కన అమరవీరుల శవాలన్నీ ఖననం చేయడమయింది. ఈ విధంగ దాదాపు డెబ్బది జనాజ నమాజులు చేశారు, డెబ్బది అమర వీరులను వారి సర్దారు హజరత్ హమ్జా(రజి)ను ఆ రణరంగ ప్రదేశంలోనే వీడ్కోలిచ్చారు.

హజరత్ హమ్జా (రజి) అంటే ప్రియప్రవక్త (సఅసం)కు ఎంతో ప్రేమాభిమానాలుండేవి. ఒక సంఘటన వినండి. హజరత్ హమ్జా(రజి) హంతకుడు 'వహషి' ఇస్లాం స్వీకరించి విశ్వాసి అయ్యాడు. ముస్లింలలో చేరిపోయాడు. ప్రియప్రవక్త (సఅసం) సమక్షంలో వచ్చాడు. "మీరేనా ఆ వహషి?" అని అడిగారు ప్రియప్రవక్త (సఅసం). "అవును" అని జవాబిచ్చారు వహషి. "మీరేనా హజరత్ హమ్జా (రజి)ను చంపింది?", "ప్రియప్రవక్త (సఅసం)కు తెలిసినది వాస్తవమే" అని అన్నారు వహషి (రజి). "మీ ముఖం నాకు కనబడకుండా మీరు ఉండగలరా?" అని చెప్పారు ప్రియప్రవక్త (సఅసం). వెంటనే వహషి (రజి) ప్రవక్త (సఅసం) ఎదుట నుండి వెళ్ళిపోయారు, జీవితాంతం వరకు ఆయన (సఅసం) ఎదుట మళ్ళీ రాలేదు.

ఈ సంఘటనానంతరం వహషి (రజి) లోలోన కుమిలిపోతున్నారు. చేసిన పనికి ప్రాయశ్చిత్తమేమిటి అని తలపోసేవారు. ప్రియప్రవక్త (సఅసం) ప్రపంచం వీడిన తరువాత, హజరత్ అబూ బకర్ (రజి) ఖలీఫాగా ఉన్న కాలంలో

ముసైలమ కజ్జాబ్‌కు వ్యతిరేకంగ సైన్యం పంపబడింది. హజరత్ వహ్షి (రజి) కూడా ఆ సైన్యంలో ఉన్నారు. ఆ యుద్ధంలో వహ్షి (రజి) ముసైలమ కజ్జాబ్‌ను చంపి శ్వాస తీసికొన్నారు. ముస్లిం సైన్యానికి తాను చేసిన కీడుకు ప్రాయశ్చిత్తమయినట్లు భావించారు. ఇంతటి కల్లోలిత కజ్జాబ్‌ను చంపి సేవ చేయడం ఆయనను తృప్తి పరిచింది.)

హజరత్ హమ్జా(రజి) జీవితం ప్రాణత్యాగం చేసిన అమర జీవితం. అందుకే ఆయన అమర వీరులకు ఇవ్వబడే సర్దారు అన్న బిరుదు పొందారు. ఇస్లాం స్వీకరించిన మొదటి దినం నుండి దైవం ప్రసాదించిన బలపరాక్రమాలను, ధైర్యసాహసాలను, కరవాల విద్యను, మల్ల యుద్ధ ప్రతిభను దైవమార్గంలో వినియోగిస్తూ కఠిన కాలంలో ప్రాణాలర్పించి ఇస్లామ్‌కు సేవ చేసిన దిట్ట హజరత్ హమ్జా (రజి).

హజరత్ హమ్జా (రజి) అనేక వివాహాలు చేసుకొన్నారు. ఆయనకు పుట్టెడు సంతానం. కాని ఒక్కరు మినహా అందరూ శైశవంలోనే మరణించారు. మిగిలింది కుమార్తె. పేరు అమామ (రజి) హిజరత్ చేసే సమయంలో మక్కాలోనే ఉన్నారు. ప్రియప్రవక్త (సఅసం) మక్కాను జయించి, తిరిగి మదీన వస్తుండగా, ఆమె పరుగెత్తుకుంటూ వచ్చింది. హజరత్ అలీ (రజి) ఆమెను ఒడిలో ఎత్తు కున్నారు. ఆమెపై తనకున్న హక్కును తెలియపరుస్తూ ప్రియప్రవక్త (సఅసం)తో, "ఈమె నా పిన తండ్రి కుమార్తె. శిక్షణ కోసం ఈమెను నాకివ్వండి" అని అన్నారు. హజరత్ జైదు ఇబ్నె హారిస (రజి) ఆమెపై తనకున్న హక్కును ప్రస్తావించారు. నేను హజరత్ హమ్జా(రజి) వారస సోదరుణ్ణి. ఈమె నా సోదర పుత్రిక. ఈమెపై నాకు హక్కుందని తెలిపారు. హజరత్ జాఫర్ తయ్యార్ (రజి) తన హక్కును వ్యక్తపరిచారు. ఈమె నా పిన తండ్రి కుమార్తె. ఈమె పిన్ని నా సతీమణి కూడ. ప్రియప్రవక్త (సఅసం) హజరత్ జాఫర్ (రజి) హక్కును సమర్థించారు. ఎందుచేతనంటే పినతల్లి స్థానం తల్లి తర్వాత విశిష్టమయింది.

హజరత్ అబ్బాస్ ఇబ్నె అబ్దుల్ ముతల్లిబ్ (రజిఅల్లాహు అన్హు)

ప్రియప్రవక్త (సఅసం)కు పదకొండు మంది పినతండ్రులుండేవారు. అందులో నలుగురు సుప్రసిద్ధులు. అబ్దుల్ ముతల్లిబ్ తరువాత తన సోదర కుమారుడైన హజరత్ ముహమ్మద్ (సఅసం)ను అబూ తాలిబ్ ఎంతో గారాబంతో కంటి రెప్పలా చూసుకుంటూ పెంచారు. ప్రతి కష్ట సమయంలో ప్రియప్రవక్త (సఅసం)ను సమర్థిస్తూ వచ్చారు. రెండవ పిన తండ్రి అబూ లహబ్. ఈయన అల్లాహ్, ఆయన ప్రియప్రవక్త (సఅసం)కు బద్ధ శత్రువుగా ప్రసిద్ధికెక్కాడు. అతగాడి పని సాధ్యమైనంత వరకు ఇస్లామి ఉద్యమాన్ని తుదముట్టించడమే. మరో ఇద్దరు పినతండ్రులు హజరత్ హమ్జా (రజి), హజరత్ అబ్బాస్ (రజి). వీరిరువురు మహాప్రవక్త (సఅసం) పట్ల విశ్వాసం ప్రకటించారు, ముస్లిం సమాజంలో చేరారు. జీవితం అల్లాహ్ ప్రసన్నత పొందడానికి అంకితం చేశారు. వేయేల మాటలతో, పనులతో, సిరిసంపదలను దైవ మార్గంలో వినియోగించడంలో, తుదకు అమూల్యమైన ప్రాణాలను కూడా దైవానికి సమర్పించడంలో వెనుదీయక ముస్లింలకు ఆదర్శవంతులయ్యారు.

హజరత్ అబ్బాస్ (రజి) ప్రియప్రవక్త(సఅసం)కు పినతండ్రి. కాని వయస్సులో వారిరువురికి అంత తేడా లేదు. రెండు, రెండున్నర సంవత్సరాల వ్యత్యాసం ఉంది. బాల్యం నుండే హజరత్ అబ్బాస్ సోదర కుమారుడంటే అమిత ప్రీతి కలిగి ఉండేవారు. వారిద్దరు ఏదైనా పని చేస్తున్నప్పుడు సోదర కుమారునికి ఏదైన కష్టం కలిగితే, వెంటనే హజరత్ అబ్బాస్ (రజి) ఆయనకు సహాయపడేవారు, సానుభూతి చూపించేవారు. ఒకప్పుడు 'కాబా' గృహ మరమ్మతు చేస్తున్నారు. వయోవృద్ధులు, యువకులు, బాలురు అందరూ ఆ పనిలో పాలుపంచుకొంటున్నారు. పిల్లవాండ్లలో హజరత్ అబ్బాస్ (రజి), ముహమ్మద్ (సఅసం) కూడా ఉన్నారు. భుజాల మీద బరువైన రాళ్ళు మోయడం వల్ల ప్రియప్రవక్త (సఅసం) భుజం కందిపోయింది. వెంటనే హజరత్ అబ్బాస్ (రజి) చీకాకుపడి, తన మొలగుడ్డను తీసి ప్రియప్రవక్త (సఅసం) భుజాలపై వేశారు.

వారి పరస్పర వాత్సల్యం కేవలం బాల్యంలోనే కాదు, వయస్సు పెరిగినకొద్దీ హెచ్చుతూ వచ్చింది. హజరత్ అబ్బాస్ (రజి) ముస్లిం కావడానికి ముందు, ఆ తర్వాత కూడా వారి ఆత్మీయత ఎడతెగని బంధంగా మారింది. ప్రియప్రవక్త (సఅసం) మక్కా నగరంలో ఇస్లామి ఉద్యమం ప్రారంభించారు. దైవ ఏకత్వం వైపు ప్రజలనాహ్వానిస్తున్నారు. మొదట్లో హజరత్ అబ్బాస్ (రజి) ఇస్లాం స్వీకరించకపోయినప్పటికీ ఇస్లామి ఉద్యమం పట్ల క్షుణ్ణమైన అవగాహన కలిగి ఉన్నారు. హృదయపూర్వకంగా దానికి చేదోడుగా నిలిచారు. మదీన పట్టణం నుండి 72 మంది అన్సారీలు హజ్ చేయడానికి వస్తూ 'మినా' లోయలో ప్రియప్రవక్త (సఅసం)తో కలిసి ఆయన (సఅసం)ను మదీన రావాల్సిందిగా కోరినప్పుడు, ఈ రహస్య కలయిక సందర్భంలో హజరత్ అబ్బాస్ (రజి) ప్రియప్రవక్త (సఅసం) వెంట ఉన్నారు. ఈ సందర్భంగా హజరత్ అబ్బాస్ (రజి) చేసిన ప్రసంగం ఆయనలో ఈ ఉద్యమం పట్ల ఉన్న ఆప్యాయత, అవగాహనలను వ్యక్తపరుస్తున్నాయి. ఈ ఉపన్యాసం ఆయనకున్న అనుభవాన్ని తెలుపుతూ, కార్యకర్తలు ఎదుర్కోవలసిన విపరీత పరిస్థితులను గురించి కూడ తెలుపుతుంది. అన్సారీలతో హజరత్ అబ్బాస్ (రజి) ఇలా అన్నారు:

"మహాశయులారా! మీకు బాగా తెలుసు. ప్రియప్రవక్త ముహమ్మద్ (సఅసం) తన వంశంలోని గౌరవనీయ వ్యక్తి, ఆ వంశంలో అందరికి ఆప్తుడు కూడా. శత్రువుల వల్ల ఏర్పడ్డ సంకట స్థితిలో మేము ఆయన (సఅసం)ను రక్షించగలిగాము. ఇప్పుడు ఆయన (సఅసం) మీతో ఉండాలని కోరుకుంటున్నారు. బ్రతికి ఉన్నంత వరకు ఆయన(సఅసం)ను కాపాడుకొంటాం అనే దీక్ష ఉంటే చెప్పండి, లేకపోతే మీ విషయం ఏమిటో నిర్మొహమాటంగ వ్యక్త పరచండి."

ఉపన్యాసం విన్నారు అన్సారీలు. ప్రాణాలు తాకట్టుపెట్టి ప్రియప్రవక్త (సఅసం)కు అండదండగా నిలుస్తామని చెప్పారు. ఆయన రక్షణ తమ ఆహ్వాన ప్రతిజ్ఞ అని అన్నారు. హజరత్ అబ్బాస్ (రజి)కు సంతృప్తి కలిగింది. ఆ పిమ్మట కొన్ని దినముల తరువాత ప్రియప్రవక్త (సఅసం) మదీన వలసపోయారు. హజరత్ అబ్బాస్ (రజి) మక్కాలోనే ఉన్నారు. కాని ఆయన మనసంతా ప్రియప్రవక్త

(సఅసం) పైనే ఉంది. అక్కడ ఉంటూ ప్రియప్రవక్త (సఅసం) ఖైబరును జయించారు. కాని ఎవరో దుండుగుడు ఖైబరులో ముస్లింలకు ఘోర పరాజయం కల్గిందని ఒక వదంతి వ్యాపింపజేశాడు. అంతేకాదు ముహమ్మద్ (సఅసం) పట్టుకోబడ్డారని, ఆయన అనుచరులెందరో చంపబడ్డారని వార్త సృష్టించాడు.

ఈ విషయం మక్కాలోని ముష్రికులకు సంతోషం కల్గించింది. హజరత్ అబ్బాస్ (రజి) ఇంటిలో మాత్రం దుఃఖం అలుముకొంది. ఆ తరువాత ఆ వార్త అబద్ధం అని తెలిసింది. మహాప్రవక్త (సఅసం)కు ఖైబరులో దిగ్విజయం కల్గిందని తెలుసుకొని హజరత్ అబ్బాస్(రజి)కు ఆనందం కల్గింది. స్నానం చేశారు. మంచి దుస్తులు ధరించారు, చేత కత్తి పట్టారు. 'కాబా' ప్రవేశించారు. ఉల్లాసం ఉట్టిపడేలాగున 'కాబా' ప్రదక్షిణ చేస్తున్నారు. అక్కడి ప్రజలు ఆయన్ను ఆపారు, అప్పుడాయన ఇలా అన్నారు:

"దైవసాక్షిగా చెబుతున్నా! ఈ విపరీత పరిణామాన్ని, చూస్తూ ఓర్పుతో ఊరుకో వలసిందేనా!"

హజరత్ అబ్బాస్ (రజి) వారి పోకిరి మాటలు విన్నారు. జవాబుగా ఇలా అన్నారు: "ఓ ప్రజలారా! మీరు ఏ దైవంపై ఒట్టు పెట్టుకొన్నారో అదే ప్రభువుపై ప్రమాణం చేసి చెబుతున్నా వినండి. (మీరు విన్న వార్త) నిజం కానేకాదు, అబద్ధం, అబద్ధం. (మీరు తెలుసుకోండి). ఖైబరుపై ప్రియప్రవక్త (సఅసం)కు విజయం కలిగింది. ఆ భూభాగంలోని ప్రతి అంగుళం ప్రియప్రవక్త (సఅసం), ఆయన అనుచరుల హస్తగతమయ్యింది."

ప్రజలు వెంటనే విచారణ జరిపించారు. హజరత్ అబ్బాస్ (రజి) మాట ముమ్మాటికి సత్యం అని తేలింది. చేసేదిలేక ముఖం చిన్నపుచ్చుకొన్నారు. ఎండిన పెదవులను నాలుకతో తడి చేసికొంటూ విభ్రాంతిచెందారు. ఇలా హజరత్ అబ్బాస్(రజి) ప్రియప్రవక్త (సఅసం)కు దుఃఖం కలిగిందని వింటే బాధపడేవారు. ఆయన (సఅసం) గెలుపు మీద సంతోషపడేవారు మక్కాలో ఉంటూ, అక్కడి పరిస్థితులను గురించి పూసగుచ్చినట్లు మదీనాలో ఉన్న మహాప్రవక్త (సఅసం)కు

చేర్చేవారు. మదీన వలన వెళ్ళలేక మక్కాలోనే ఉన్న బీద ముస్లింలకు సహాయపడేవారు హజరత్ అబ్బాస్ (రజి).

హజరత్ అబ్బాస్ (రజి) మక్కా నుండి మదీన పోవడానికి నిర్ణయించుకోగా ప్రియప్రవక్త (సఅసం) ఆయన్ను నివారించేవారు. ఇలా అనేవారు: "ఇంకా మీరు మక్కాలో ఉండడమే శ్రేయస్కరం. ప్రవక్త కావడంలో నేను చివరివాణ్ణని ఎలా చెప్పడమయిందో అదే విధంగా మీరు మక్కా నుండి వలస వెళ్ళే వారిలో చివరి వారవుతారు."

మక్కా ఖురైషులు ఒక గొప్ప అపోహలో ఉన్నారు. హజరత్ అబ్బాస్ (రజి) మక్కా వదలకుండా ఉండడంతో వారు ఇలా ఊహించారు. ఆయనకు ప్రియప్రవక్త (సఅసం)తో రక్త సంబంధం వల్ల ఆత్మీయత ఉంది. అంతే. ఆయన ఖురైషుల పక్షాన్నే ఉన్నారు. ఎంచేతనంటే బదర్ యుద్ధసమయంలో ఆయన బలవంతాన యుద్ధ మైదానానికి వచ్చారు. ఏమీ తోచని స్థితిలో ఆయన ఖురైషులతోనే ఉంటూ యుద్ధంలో పాల్గొన్నారు. ఆ సమయంలో హజరత్ అబ్బాస్ (రజి) ఏం నిర్ణయించుకొన్నారన్నది ప్రియప్రవక్త (సఅసం)కు బాగుగా తెలుసు. అందువల్లనే మహాప్రవక్త (సఅసం) ముస్లింలకు ఒక సూచన కూడా ఇచ్చారు. "యుద్ధ మైదానంలో హజరత్ అబ్బాస్ (రజి) ఎదురయ్యారంటే ఆయన్ను చంపరాదు. ఆయన్ను బలవంతంగా యుద్ధమైదానంలోకి తెచ్చారు."

బదర్ యుద్ధంలో అల్లాహ్ ముస్లింలకు విజయం ప్రసాదించాడు. హజరత్ అబ్బాస్ (రజి) బందీ చేయబడ్డారు. చేతులకు కట్టిన త్రాడు బిగువుగా ఉన్నందువల్ల బాధ కల్గింది. మూలగడం కూడా అయింది. ఆయన పడుతున్న బాధ వల్ల, ప్రియప్రవక్త (సఅసం)కు నిద్రపట్టలేదు. ప్రియప్రవక్త (సఅసం) అనుచరులకు విషయం తెలియగ వారు కట్టిన తాటి బంధనాలను వదులు చేశారు.

ప్రియప్రవక్త (సఅసం)కు ఈ విధంగా హజరత్ అబ్బాస్ (రజి) పట్ల దయాదాక్షిణ్యంతోపాటు ప్రేమపూరిత మైత్రి ఉంది. ఫిదియా తీసికొని ఖైదీలను విడుదల చేసే సమయం వస్తే హజరత్ అబ్బాస్ (రజి) నుండి కూడా ఒక భారీ మొత్తం డిమాండు చేయడమయింది. ఆ విషయానికొచ్చి హజరత్ అబ్బాస్

(రజి) తన తరఫున నుండి ఓ కారణం చెప్పారు. “నేను మనసార మొదటి నుండే ఇస్లాం స్వీకరించాను. మక్కా ముష్రికులు నన్ను బలవంతంగా ఈ యుద్ధంలోకి లాక్కొని వచ్చారు.” ఆ మాటలు విని ప్రియప్రవక్త (సఅసం) ఇలా అన్నారు: “మనస్సులోని విషయం ఆ దైవానికే తెలియాలి. మీ వాదన సరైనదయితే దానికి దైవం ప్రతిఫలం ఇస్తాడు. కాని మీపై మోపబడిన డిమాండులో ఏమాత్రం మినహాయింపు లేదు.”

ఆ పిమ్మట తన వద్ద ధనం లేదని, స్తోమతలేని బందీగా ఉన్నానని చెప్పారు. ఈ మాటను కూడా ఒప్పుకోలేదు. మహాప్రవక్త (సఅసం) ఇలా అన్నారు: 'మీరు మీ సతీమణి దగ్గర ఒక పెద్ద మొత్తం పెట్టి వచ్చారని మాకు తెలుసు.” హజరత్ అబ్బాస్ (రజి) అబ్బురపడ్డారు. “దైవసాక్షిగా చెబుతున్నా, ఈ ధనం విషయం నాకు మరియు నా సతీమణికి తప్ప మరెవ్వరికీ తెలియదు.” ఇంకా అన్నారు: “నిశ్చయంగా మీరు దైవప్రవక్త (సఅసం)” అని డిక్లేర్ చేశారు. స్వచ్ఛందంగా తన కోసం, తన సోదర కుమారులు అఖీల్, నౌఫల్ ఇబ్నె హారిస్ కోసం ఫిదియాగ ఎంతో పెద్ద రొక్కం చెల్లించి బందీ నుండి విముక్తి పొంద గలిగారు.

ఇదే విధంగా బయటికి పొక్కకుండా గుప్తంగా ఎంతో కాలం మక్కాలోనే ఉన్నారు. మక్కా విజయానికి కొద్ది దినముల ముందు మదీనాకు వలస చేయవలసిందని ఆజ్ఞ అయింది. అప్పుడాయన ఆలుబిడ్డలతోబాటు మదీన వచ్చారు. బహిరంగ ప్రకటన చేస్తూ తాను ముస్లిం అయ్యానని చెప్పారు. ముస్లిముల సాధక బాధలను పంచుకొన్నారు కూడా.

హజరత్ అబ్బాస్ (రజి) ముస్లింకాక ముందు చాలా సిరిసంపదలు కల భాగ్యవంతులు. తండ్రి మరణానంతరం కాబా గృహ పనుల నిర్వహణ ఈయన చేతుల్లోకే వచ్చింది. హాజీలకు నీరు త్రాపే బాధ్యత ఈయనే చేపట్టారు. మక్కా నుండి మదీన వలస వెళ్ళేంత వరకు ఈ విధుల నిర్వహణ చక్కగ చేశారు. వ్యాపారం ఈయన వృత్తి. వడ్డీ వ్యాపారం కూడా ఉండింది. మక్కా కైవసమయ్యాక

10వ హిజరీలో ప్రియప్రవక్త (సఅసం) తన చివరి హజ్ ప్రసంగంలో వడ్డీ నిషేధాజ్ఞను జారీ చేశారు. ఆ నిషేదాజ్ఞ ఇలా ఉంది: "ఈ దినం అరబ్బుల్లో వడ్డీ వ్యాపారం బందు చేయబడింది. అన్నిటికంటే ముందు నేను అబ్బాస్ ఇబ్నె అబ్దుల్ ముతల్లిబ్ వడ్డీ వ్యాపారాన్ని నిలిపివేస్తున్నా."

ఈ నిషేధాజ్ఞ అనంతరం హజరత్ అబ్బాస్ (రజి)కు వడ్డీ వ్యాపారం నుండి సంక్రమించే ఆదాయం అంతమయింది. మక్కాలో అంతకు ముందు చేస్తున్న వ్యాపారం హిజరత్ చేయడంతో అంతమయింది. అందుచేత మహాప్రవక్త (సఅసం) మాల్-యె-గనీమత్ యుద్ధ విజయం వల్ల చేకూరే ధనం నుండి, ఆయన (సఅసం) స్వంత తోట నుండి వచ్చే ఆదాయం నుండి హజరత్ అబ్బాస్ (రజి)కు మద్దతునిచ్చేవారు. ఈ విధంగ సమకూరే సంపద నుండి హజరత్ అబ్బాస్ (రజి) ఉదార స్వభావంతో ఖర్చు చేసేవారు. ఆతిథి సత్కారాలంటే ఆయనకు బహు ఇష్టం. దయాహృదయం కలవారు. అల్లాహ్‌ను అర్ధిస్తూ చేతులెత్తి చేసే ప్రార్థనలు చూసినవారు పరవశులయ్యేవారు. ఆయన ప్రార్థనలకు ప్రత్యేకత ఉండేది. అవి పరమ ప్రయోజనకరంగా ఉండేవి. హజరత్ ఉమర్(రజి) ఖలీఫాగ ఉన్నారు. వర్షాలు లేనందున క్షామ పరిస్థితులు ఏర్పడ్డాయి. నీటి కోసం అల్లాహ్‌ను ప్రార్థించాలని హజరత్ అబ్బాస్ (రజి)ను కోరారు ఖలీఫా. హజరత్ అబ్బాస్ (రజి) ప్రార్థనల మహత్యం చూస్తుండిపోయారు దుర్భిక్ష ప్రాంతవాసులు. మేఘాలులేని ఆకాశం నల్లటి మబ్బులమయమయింది. ఏకధారగ వర్షం కురిసింది. నేల నీటిమయమయింది. క్షామం తొలగిపోయింది.

హజరత్ అబ్బాస్ (రజి)లో ఉన్న గుణగణాలు ప్రియప్రవక్త (సఅసం)కు చాలా నచ్చేవి. ప్రియప్రవక్త (సఅసం)పట్ల ఆయనకు ఉన్న ప్రేమ ఎనలేనిది. ఆయనకు ఎవరైనా కష్టపెట్టారంటే ప్రియప్రవక్త(సఅసం)కు బాధకలిగేది, కోపపడేవారు కూడ. వారితో ఇలా చెప్పేవారు ముహమ్మద్ (సఅసం): "అబ్బాస్ (రజి) ప్రవక్త (సఅసం)గారి పిన తండ్రి. పినతండ్రి హోదాలో తండ్రితో సమానం." మరో సందర్భంలో ఇలా అన్నారు: "అబ్బాస్ (రజి) దైవప్రవక్త (సఅసం)గారి

పినతండ్రి. ఖురైషులలో అందరికంటే మించిన ఉదార స్వభావం కలవారు. ఆయన బంధువుల విషయంలో చాలా ఆసక్తి కనబరుస్తారు." మరొకప్పుడు హజరత్ అబ్బాస్ (రజి)తో ఇలా అన్నారు: "ఎవరైతే దైవం మరియు దైవప్రవక్త (సఅసం) ప్రసన్నత కోసం మీతో ప్రేమ కలిగి ఉండరో వారి హృదయంలో విశ్వాస జ్యోతి ఉండదు." ప్రియప్రవక్త (సఅసం) ప్రపంచం వీడాక, పరామర్శించడాని కోసం ప్రజలు హజరత్ అబ్బాస్ (రజి) దగ్గరకు వచ్చేవారు.

హజరత్ అబ్బాస్(రజి) కంఠస్వరం గంభీరంగా ఉండేది. యుద్ధ మైదానంలో ఆయుధాల ధ్వని, సిపాయీల అరుపులు క్షతగాత్రుల హాహాకారాలు ఎంతైనా ఉండనీయండి, హజరత్ అబ్బాస్ (రజి) కంఠస్వరం స్పష్టంగా వినబడేది. ఆయనే స్వయంగా అనేవారు: హునైన్ యుద్ధంలో ప్రియప్రవక్త (సఅసం) స్వారీ చేస్తున్న గుర్రపు కళ్ళెం చేత పట్టుకొని దాని వెంట పరుగెత్తుతున్నా, తీవ్రపోరాట సందర్భంలో విరోధుల ప్రభావం ఒక్కసారి కనబడింది. అనుకోని విధంగా ముస్లింల ధైర్యసాహసాలు సన్నగిల్లినట్లు తోచింది. ప్రియప్రవక్త (సఅసం) అన్నారు: "ఓ అబ్బాస్! బల్లెములు ధరించిన సైన్యాన్ని కేక వేసి పిలువు." నా శబ్దం మొదటే బిగ్గరగా ఉంది. కంఠస్వరబలంతో గర్జించాను. "బల్లెంవాండ్లెక్కడ ఉన్నారు?" అందరూ ఒక్కమారు పరుగిడుకుంటూ వచ్చారు. ముస్లింలు ఒక్కమారు బలం పుంజుకొన్నారు.

కొన్ని చారిత్రాత్మక గ్రంథాలలో ఒక సాధారణ విషయం చెప్పబడింది. దైవప్రసన్నత పొందగోరే వారికి ఈ సాధారణ దృష్టాంతం ఒక గుణపాఠాన్ని నేర్పుతుంది. అమీరుల్ మోమినీన్ హజరత్ ఉమర్-యె-ఫారూఖ్ (రజి) కాలం అది. ప్రజలు ఒక ఫిర్యాదు చేశారు.

హజరత్ అబ్బాస్(రజి) ఇంటి పైకప్పు నీటి తూము మసీదు వైపు ఉంది. వర్షం పడినప్పుడు ఇంటి కప్పుపై ఉన్న నీరంతా మసీదులో పడుతోంది. నమాజు చేసేవారికి అది కష్టంగా ఉంది. ఈ ఫిర్యాదు విన్న హజరత్ ఉమర్ (రజి) ఆ తూము మూసేయండని ఆజ్ఞ ఇచ్చారు. ఈ విషయం హజరత్ అబ్బాస్ (రజి)కు తెలియవచ్చింది. ఆయన హజరత్ ఉమర్ (రజి)పై దావా వేశారు. పిటీషన్‌కు

ఆధారంగా ఈ తూము ప్రియప్రవక్త (సఅసం) కాలం నుండి ఇలాగే నడుస్తోంది. "నా అనుమతి తీసికోకుండా మీరు దానిని మూసివేశారు" అన్నారు.

ఆధారంతో ఉన్న పిటీషన్ దర్యాప్తు చేస్తున్న ఖాజీగారు హజరత్ ఉమర్ (రజి)కు వ్యతిరేకంగా మరియు హజరత్ అబ్బాస్ (రజి)గారి హక్కుకు అనుకూలంగా తీర్పు ఇచ్చారు. తీర్పు చేతికందాక అమీరుల్ మోమినీన్ హజరత్ ఉమర్ (రజి) చూస్తుండగా హజరత్ అబ్బాస్ (రజి) ఆ తూమును తిరిగి తెరిచారు. తరువాత హజరత్ అబ్బాస్(రజి) ఇలా అన్నారు:

"ఓ అమీరుల్ మోమినీన్! నేను మొదట్లోనే నా హక్కును విరమించుకొని ఉంటే అది మీ ప్రసన్నత పొందడానికి, లేక మీ భయభ్రాంతుల వల్ల అలా చేశాను అనే అనుమానం కలిగేది. ఇప్పుడు కేసు నా పక్షంలో తిరిగింది. కావున నేను నా ఇంటిని పూర్తిగా అల్లాహ్ పేరిట దానం చేస్తున్నాను. ఇక మీ ఇష్టమొచ్చినట్లు ఆ ఇంటిని వాడుకోవచ్చు. అల్లాహ్ ప్రసన్నత అభిలషిస్తూ 86 సంవత్సరాల జీవితం గడిపి పరలోకపాత్రులయ్యారు. ఆయన సంతానంలో హజరత్ అబ్దుల్లా ఇబ్నె అబ్బాస్ (రజి) సుప్రసిద్ధ వ్యక్తిగా సహాబాలలో పేరుపొందారు.

హజరత్ జాఫర్ తయ్యార్
(రజిఅల్లాహు అన్హు)

హజరత్ జాఫర్ తయ్యార్ (రజి), హజరత్ అలీ (రజి) గారి తమ్ముడు. తండ్రి పేరు అబూతాలిబ్. ఈ బంధుత్వం వల్ల హజరత్ జాఫర్ తయ్యార్ (రజి) ప్రియప్రవక్త (సఅసం) పిన తండ్రి కుమారుడు. తల్లిదండ్రులు దివంగతులయ్యాక, తాత అబ్దుల్ ముత్తలిబ్ పరమపదించాక, హజరత్ ముహమ్మద్ (సఅసం) పినతండ్రి అబూతాలిబ్‌గారి ఇంటిలో నివసిస్తున్నారు. అక్కడ ప్రియప్రవక్త (సఅసం), హజరత్ అబ్బాస్ (రజి), హజరత్ జాఫర్ (రజి) పరస్పరం కలసిమెలసి ప్రగాఢ మైత్రీ భావంతో జీవితం గడిపేవారు. ఒకే చోట

కూర్చోవడం, జీవితం గడపడం వల్ల వారి మధ్య మంచి సాన్నిహిత్యం ఉండేది. కేవలం పినతండ్రి తనయులు కావడం వల్లనే కాదు, హజరత్ జాఫర్ (రజి)లో ఉన్న ఉన్నత విలువలు, సుగుణాలను చూసి ప్రియప్రవక్త (సఅసం) ఆయన్ను గౌరవించేవారు.

ప్రియప్రవక్త (సఅసం) ప్రప్రథమంగా తన కుటుంబీకులకు ఇస్లాం ప్రబోధించారు. హజరత్ అలీ (రజి) ఇస్లాం స్వీకరించారు. ఆ పిమ్మట కొద్ది దినములు గడిచాయి. ఒకానొక దినం ప్రియప్రవక్త (సఅసం) హజరత్ అలీ (రజి)తోపాటు దైవారాధన చేస్తున్నారు. నమాజు మధ్యలో ఉండగ ఆ దారిన వెళ్తూ అబూతాలిబ్, హజరత్ జాఫర్(రజి)లు వారిని చూచారు. ఎంతో వినయ వినమ్రతలతో వారు నమాజు చేస్తున్నారు. అది చూచి వారు ధార్మిక ఆలోచనలతో ప్రభావితులయ్యారు. అబూతాలిబ్ తన కుమారుడు హజరత్ జాఫర్ (రజి) నుద్దేశించి "నాయనా! నీవు వెళ్ళి వారిరువురితో కలసి ఆరాధన చేసుకో" అన్నారు. హజరత్ జాఫర్ (రజి) వెళ్ళారు. ప్రియప్రవక్త (సఅసం)కు కుడి వైపు నిలబడ్డారు. నమాజు చేశారు. ఏకేశ్వరోపాసనలో ఉన్న ప్రభావం ఆయన మనో హృదయాలను ఆకట్టుకుంది. వెనుదిరగక అల్లాహ్ ఒక్కడే ఆరాధ్య దైవం, ప్రియప్రవక్త (సఅసం) ఆయన సందేశ ప్రవక్త అని విశ్వసించారు.

ఇస్లాం స్వీకరించి జీవితం గడుపడం అంటే ఆ కాలంలో సామాన్యమైంది కాదు. ఇస్లాంను అంగీకరించిన నేరానికి పెద్ద పెద్ద వారినే అవిశ్వాసులు హింసిస్తూ వచ్చేవారు. అబూ తాలిబ్ బ్రతికి ఉన్నంత వరకు, ఆయన ఖురైషులను ప్రతి ఘటించడం వల్ల ఖురైషులు ముస్లింలను విపరీతంగ హింసించ లేకపోయారు. కాని అబూ తాలిబ్ మరణించాక ఇక ఎవరి ఒత్తిడి ఖురైషులపై లేకపోయింది. మక్కా వాసుల మాట అడ్డగించేవారు లేరు. అందువల్ల వారు ముస్లింలపై ఎన్నో అఘాయిత్యాలకు పాల్పడ్డారు. హజరత్ జాఫర్ (రజి) కూడా వారి బాధల నుండి తప్పించుకోలేకపోయారు. ఖురైషుల దౌర్జన్యాలు భరించరానివి అయ్యాయి. మహాప్రవక్త (సఅసం) ఎంతో ఆవేదన పడుతూ, హబసకు వలస వెళ్ళాల్సిందిగ

ముస్లింలను కోరారు. ప్రియప్రవక్త (సఅసం)గారి వద్ద సెలవు తీసికొని ఒక ముస్లింల జట్టు 'హబస' (అబిసీనియా) దేశానికి వలస వెళ్ళింది. హజరత్ జాఫర్ (రజి) ఈ జట్టులోనే ఉన్నారు.

అబిసీనియాలో కాలు పెట్టారు ముస్లింలు. వెనువెంటనే మక్కా నుండి ఖురైషుల ఒక బృందం రానే వచ్చింది. వారి ఉద్దేశ్యం వలస వచ్చిన ముస్లింలను మళ్ళీ మక్కా తీసికొని పోవాలనేదే. వారిని వేధించి, బాధించి తమ దౌర్జన్యదాహం తీర్చుకోవాలని వారి కోరిక. అందుచేత హబస రాజదర్బారు చేరారు. ఇలా విన్నవించారు: "ఓ రాజా! మా దేశపు కొందరు యువకులు అవివేకులు కావడం వల్ల వారు తమ తాతముత్తాతల ధర్మం వదిలేశారు. మరో ధర్మం ఎన్నుకొన్నారు. స్వదేశం నుండి పారిపోయి వచ్చారు. మీ దేశం చేరారు. వారి బంధువులు, పట్టణ ప్రముఖులు మమ్మల్ని పంపారు. మీ దేశం నుండి వాపసు తీసికొని రమ్మన్నారు. వారిని మళ్ళీ స్వదేశం తీసికొని పోవడానికి మీరు అనుమతిస్తారనే నమ్మకం మాకుంది."

రాజు నజ్జాషి వివేకంగల వ్యక్తి. మంచి గుణవంతుడు, అనుభవశాలి. వచ్చిన వారిని విచారణ చేయక వెనుకకు గెంటి వేయడం సబబు కాదని నిర్ణయించారు. వచ్చిన ముస్లింలను దర్బారుకు రప్పించారు. విచారణ చేశారు.

"మీరు మీ వంశ ధర్మం వదలి నూతనంగా స్వీకరించిన ధర్మం ఏమిటి?" అని అడిగారు.

ముస్లిం జట్టులో నుండి హజరత్ జాఫర్ (రజి)ను ముస్లింలు ఎన్నుకొన్నారు, జవాబు ఇవ్వండని కోరారు. ఆ సమయంలో హజరత్ జాఫర్ (రజి) ముస్లిమేతరులతో కూడుకున్న రాజసభికులనుద్దేశిస్తూ ఉపన్యాసం చేశారు. ఒక వైపు తమ సమాజంలో ప్రబలి ఉన్న దురాచారాల్ని కన్నులకు కట్టినట్లు చెప్పారు. మరో వైపు ఇస్లాం గురించి వివరించారు, దానివల్ల చేకూరే మంచిని ప్రస్తావించారు. పాటిస్తున్న నీతినియమాలను ఉల్లేఖించారు. ఉపన్యాసం సంక్షిప్తంగా

చేశారు. కాని లోతయిన భావాలతో అతి గంభీరంగా ఉంది ఆ ఉపన్యాసం. సారాంశం ఇలా ఉంది.

"ఓ రాజా! మా జాతివారు వివేకం కోల్పోయిన మూర్ఖులు. మేము విగ్రహారాధన చేసేవారం, నిషిద్ధ వస్తువుల్ని తినేవారం. చెడు పనులు చేసేవారం. పొరుగింటి వారిని కష్టపెట్టేవారం. మాలో ఉన్న బలవంతులు బలహీనుల రక్తాన్ని పీల్చి త్రాగేవారు. మేము బంధువుల హక్కుల్ని కొల్లగొట్టేవారం. అలాంటి చెడులలో రేయింబవళ్ళు జీవితం గడిపేవారము. దైవం మాలో నుండే ఒక వ్యక్తిని తన ప్రవక్తగా చేసి పంపాడు. ఆయన మాకు బాగా తెలిసిన వ్యక్తి. ఆయన జీవితం- అద్దంలా మన ముందుంది. మేము ఆయన్ను నిత్యం సత్యం పలికే వ్యక్తిగా, అమానతుదారునిగా చూశాం. ఎల్లప్పుడు ఆయన్ను కళంక రహితునిగా, సచ్ఛీలంగల వ్యక్తిగా చూస్తూ వచ్చాం. ఆయన్ను ఒక మహనీయునిగా మేము చూశాం. ఆయన మమ్మల్ని విగ్రహారాధన నుండి తప్పించారు, దైవానికి సాటి కల్పించకండి అని అన్నారు. దేవుడు ఒక్కడే అని ప్రబోధన చేశారు, నిత్యం సత్యం పలుకండని, అమానతుదారులుగా ఉండమని చెప్పారు. పొరుగింటి వారితో, బంధువులతో ప్రేమ వాత్సల్యం కలిగి ఉండాలని ప్రబోధించారు. అబద్ధమాడరాదని నొక్కి చెప్పారు. నిష్కారణంగ అమాయకుల ప్రాణాలు తీయ రాదని చెప్పారు. అనాధ బాలుర ధనం స్వాహా చేయరాదని చెప్పారు. శీలవతులైన మహిళలపై బురద చల్లరాదని చెప్పారు. విగ్రహారాధన వదలి ఏకైక దైవాన్ని విశ్వసించండని చెప్పారు. నమాజులు చదవండి, ఉపవాసాలు వుండండి. జకాతు చెల్లించండి అని చెప్పారు. మేము ఆయన పట్ల విశ్వాసం ప్రకటించాం. ఆయన చూపించిన మార్గంపై నడిచాం. విగ్రహాలను వదిలేశాం, ఏకేశ్వరోపాసన అనుసరించాం. అల్లాహ్‌నే ఆరాధిస్తూ వచ్చాం. నిషేధాలను వదిలేశాం. దీనిపై మా జాతివారు మా పట్ల శత్రుత్వం వహించారు. అనేక విధాల మమ్మల్ని హింసించారు. విగ్రహాలను ఆరాధించమని మొదట్లో చేస్తున్న చెడు కొనసాగించ మని కోరింది మా జాతి. వారి దౌర్జన్యకాండ మితిమీరిపోగా ప్రియప్రవక్త (సఅసం) ఆజ్ఞ పొంది స్వచ్ఛందంగ మీ దేశానికి వలస వచ్చాం."

ఈ మాటలు విన్న నజ్జాషి రాజు "మీ ప్రవక్త (సఅసం)పై అవతరించబడిన గ్రంథం నుండి కొన్ని వాక్యాలు వినిపించండని" కోరారు. హజరత్ జాఫర్ (రజి) మర్యం సూరా నుండి కొన్ని ఆయతులు పఠించి వినిపించారు. ఆ వాక్యాలను విన్న నజ్జాషి వాటి ప్రభావంతో చలించిపోయాడు. ఇలా అన్నాడు: "దైవసాక్షిగా చెబుతున్నా ఖుర్‌ఆన్, తౌరాతు ఒకే దీపం వెలుగు." మక్కా నుండి వెంటాడుతూ వచ్చిన ఖురైషులతో అన్నారు: "దైవం సాక్షి ఉండుగాక! వీరిని మీకెప్పటికీ అప్పగించను" అన్నారు.

ఖురైషుల పన్నాగం వ్యర్థమయింది. కాని వారు మరో యుక్తితో కుట్ర పన్నారు. మళ్ళీ నజ్జాషి రాజదర్బారులో హాజరయ్యారు. ఇలా అన్నారు: " ఓ ప్రభూ! మీకు తెలుసా, హజరత్ ఈసా (అలై)ను గురించి వీరి ఆలోచనలేమిటో?" జవాబు కోసం నజ్జాషి ముస్లింలను మళ్ళీ దర్బారుకు పిలిపించాడు. సమస్యకు సమాధానం చెప్పడానికి ముస్లింలు సందిగ్ధావస్థలో పడ్డారు. ఎందుచేతనంటే క్రైస్తవులు హజరత్ ఈసా (అలై)ను అల్లాహ్ కుమారుడని విశ్వసిస్తారు. ఇస్లాం ఈ మూల విశ్వాసాన్ని కాదంటుంది. అందువల్ల నిజం చెబితే నజ్జాషి కోప్పడుతాడేమోనన్న భయం వారికి కలిగింది. కాని హజరత్ జాఫర్ (రజి) ఒక దృఢ నిశ్చయానికొచ్చారు. ఏది ఏమైనా సరే ఈ విషయంలో ఇస్లాం వాస్తవికత తెలియపరచదలిచారు. ఇలా అన్నారు: "మేము హజరత్ ఈసా (అలై)ను ఒక దైవదాసునిగా, ప్రవక్తగా, దైవాత్మ కలవాడిగా విశ్వసిస్తున్నాం." ఇది విన్న నజ్జాషి భూమి నుండి ఒక రేణువు తీసికొని, "దైవసాక్షిగా చెబుతున్నా! మీరు చెప్పిన దానికన్నా ఈసబ్నుమర్యం (అలై) ఈ రేణువంత ఎక్కువ కాదు, తక్కువ కూడా కాదు" అన్నాడు.

ఖురైషులకు పరాజయం కల్గింది. మక్కా వాపసు వచ్చారు. హజరత్ జాఫర్ (అలై) ముస్లింలతోబాటు హబస్‌లోనే ఉంటూ వచ్చారు. ప్రియప్రవక్త (సఅసం) మక్కా నుండి మదీన వలస పోయారు. ఆ తరువాత 7వ హిజరీలో ఖైబరును జయించాక, 'హబస్' నుండి ముస్లింలు మదీన వలస పోయారు. హజరత్ జాఫర్ (రజి) అంటే ప్రియప్రవక్త (సఅసం)కు ఎంతో ప్రేమ. మదీనలో

ఆయన ప్రియప్రవక్త (సఅసం) తో కలిసిన ఉదంతం వినండి. హజరత్ జాఫర్ (రజి) ముందుకు రాగానే, ప్రియప్రవక్త (సఅసం) ఆయన్ను కౌగిలించుకొన్నారు. నొసటపై ముద్దాడి: "జాఫర్ (రజి) రావడం వల్లనో, ఖైబరు జయించడం వల్లనో, దేనివల్ల నాకు ఎక్కువ సంతోషం కలుగుతూందో చెప్పలేను" అని అన్నారు.

ఆ తరువాత 8వ హిజరీలో 'ముఅత్త' యుద్ధం జరిగింది. 3000 ముస్లిం సేన ఒక లక్ష రోమను సైన్యాన్ని ఎదుర్కొంది. జైదు ఇబ్నె హారిస (రజి) ముస్లిం సేనకు సైన్యాధిపతిగ ఉన్నారు. హజరత్ జాఫర్ (రజి) కూడా ఆ యుద్ధంలో పాల్గొన్నారు. జైదు (రజి) ఆ యుద్ధంలో అసువులు బాసి అమర వీరులుకాగ, హజరత్ జాఫర్ (రజి) సైన్యాధిపత్యం వహించారు. ఇస్లామి యుద్ధ పతాకాన్ని చేతపట్టుకొని వైరి వర్గాన్ని విచ్ఛిన్నపరుస్తూ ముందుకు వెళ్తున్నారు. కాని శత్రుసేన మిడతల దండులా పైబడుతుంది. వారి దెబ్బలకు దేహం క్షతగాత్రమయింది. కరవాలపు దెబ్బలతో రెండు చేతులు నరకబడ్డాయి. అయినప్పటికీ ఆ వీరుడు ఇస్లాం పతాకాన్ని క్రిందపడకుండా ఎదనానించి పట్టారు. ప్రాణాలు తెగించారు, ప్రతాపం చూపించారు. చివరకు రోమన్లు ఆయన ప్రాణాలు తీశారు. ఇసాం సిపాయి అమరవీరుడయ్యారు.

అబ్దుల్లా ఇబ్నె ఉమర్ (రజి) ఆ యుద్ధంలో ఉన్నారు. ఇలా అన్నారు: "నేను సంగ్రామ మైదానంలో హజరత్ జాఫర్ (రజి) మృతదేహం కోసం వెతుక్కుంటూ వెళ్ళాను. శరీరపు ఎద భాగంలో ఏబది గాయాలున్నాయి. దేహంపై మొత్తం తొంబది కంటే అధికంగానే దెబ్బలున్నాయి. దైవసాక్షిగ చెబుతున్నా, ఆయన శరీరపు వెనుక భాగంలో ఒక చిన్న దెబ్బ కూడా లేదు."

ఈ సమర పరిస్థితి ఎలా ఉందో హజరత్ జిబ్రాయీల్ (అలై) ప్రియప్రవక్త (సఅసం)కు తెలియపరిచారు. ఆయన (సఅసం) కన్నీరుమున్నీరయ్యారు. హజరత్ జిబ్రాయీల్ (అలై) ఒక సువార్తను కూడ వినిపించారు. హజరత్ జాఫర్ (రజి) రెండు చేతులు తెగిపోవడం వల్ల ఆయనకు అల్లాహ్ మరో రెండు బాహువులు ప్రసాదించాడు కూడా. వాటితో ఆయన దేవదూతలతోపాటు స్వర్గవిహారం

చేస్తుంటారనే సుసందేశం కూడా వినిపించారు. అరబ్బీ భాషలో ఎగిరే వాటిని 'తయ్యార్' అని అంటారు. ఈ కారణంగ హజరత్ జాఫర్ (రజి)కు **'తయ్యార్'** అనే బిరుదు ఇవ్వబడింది. ఆ బిరుదుతో హజరత్ జాఫర్ (రజి) వాసికెక్కారు.

హజరత్ జాఫర్ తయ్యార్ (రజి), సాహసంగల వ్యక్తి. వాటితోబాటు ఆయన అనేక సుగుణాలు కలవారు. బాల్యం నుండి ప్రియప్రవక్త (సఅసం) సాన్నిధ్యంలో ఉండడం వల్ల ఇస్లాం బాగోగులను క్షుణ్ణంగ తెలిసికొన్నారు. జీవిత విషయా లన్నింటిలో అల్లాహ్, ఆయన ప్రవక్త(సఅసం)ను అనుసరించి విధేయతతో నడచుకొనేవారు. ఈ ప్రత్యేకత వల్ల హజరత్ జాఫర్ తయ్యార్ (రజి) ప్రియప్రవక్త (సఅసం) అనుచరులలో ప్రత్యేక వ్యక్తిగా పరిగణించబడ్డారు. హజరత్ అబూ హురైరా (రజి) ఇలా విన్నవించారు: తరచూ ఆకలిదప్పుల బాధ భరించలేక పొత్తి కడుపుపై ఇసుక రేణువుల తిత్తికట్టేవాణ్ణి. క్షుద్బాధ కలవారికి భోజనం పెట్టాలి అనే దివ్యగ్రంథపు ఆయతు జ్ఞాపకం ఉన్నప్పటికీ ప్రజలతో ఆ వాక్యాన్ని గురించి అడిగేవాణ్ణి. బహుశః ఎవరైనా భోజనం పెట్టిస్తారనే ఆశ ఉండేది. ఈ విషయంలో హజరత్ జాఫర్ (రజి)ను అందరికంటే శ్రేష్టునిగ చూచాను. 'అన్నమో' అని ఆకలి బాధపడేవారికి హజరత్ జాఫర్ (రజి) భోజనం పెట్టేవారు. తినడానికి ఏది లభ్యమైతే ఆ వస్తువును ఇచ్చేవారు. నెయ్యి, తేనె తినిపించేవారు. ఒక్కొక్కప్పుడు అవీ లేకుంటే వాటి ఉత్త సంచులు తెచ్చేవారు. వాటిని చీల్చి అందులో తగిలి ఉన్న నెయ్యి, తేనెను అతిథులు నాలుకతో నాకి ఆకలి తీర్చుకొనేవారు.

హజరత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించిన ఈ విషయం వల్ల హజరత్ జాఫర్ (రజి) ఎంత ఉదార స్వభావులో మనకు తెలుస్తుంది. బీదల పట్ల ఆయనకున్న ఉదారత్వం చూచి ప్రియప్రవక్త (సఅసం) ఆయనను **'అబుల్ మసాకీన్'** (పేదవారి తండ్రి) అని పిలిచేవారు.

హజరత్ జాఫర్ (రజి)ను చూస్తూ ఒకప్పుడు ప్రియప్రవక్త (సఅసం) ఇలా అన్నారు: "ఓ జాఫర్ (రజి)! ఆకారంలోను, గుణగణాలలోనూ నీవు నన్ను పోలి ఉన్నావు."

ఇన్ని సుగుణాల సంపద ఆయనలో ఉన్నందువల్లనే ప్రియప్రవక్త(సఅసం) తనకు ఆప్తులైన పదునాలుగు మందిలో ఒక ప్రత్యేక మిత్రునిగా ఆయనను పరిగణించారు. హజరత్ జాఫర్ (రజి) తనయుడు హజరత్ అబ్దుల్లా ఇలా అనేవారు. నేను నా పినతండ్రి హజరత్ అలీ (రజి)ను ఏదైనా ఇవ్వమని అడిగితే ఆయన ఇవ్వడానికి నిరాకరించేవారు. కాని తండ్రి హజరత్ జాఫర్ (రజి) పేరు చెప్పి ఏదైనా అడగ్గా హజరత్ అలీ (రజి) దానిని ఇవ్వడానికి నిరాకరించేవారు కారు.

హజరత్ జాఫర్ (రజి) జీవితం మనకు గుణపాఠం నేర్పే అనుభవాల గ్రంథం.

హజరత్ అబూ ఉబేదహ్ ఇబ్నె అల్ జర్రాహ్ (రజిఅల్లాహు అన్హు)

మహాప్రవక్త (సఅసం) అనుచరులలో ఎందరో మహానుభావులున్నారు. వారిలో హజరత్ ఉబేదహ్ ఇబ్నె అల్ జర్రాహ్ (రజి) ఒకరు. ప్రపంచంలో సజీవులుగా ఉన్న సమయంలోనే మహాప్రవక్త (సఅసం) కొందరిని స్వర్గవాసులను శుభవార్త వినిపించారు. అటువంటి సువార్త భాగ్యాన్ని నోచుకొన్నవారిలో 'అబూ ఉబేదహ్ ఇబ్నె అల్ జర్రాహ్' ఒకరు. మరో సుగుణం ఈయనలో ఉంది. ప్రియప్రవక్త (సఅసం) ఈయనను "ముస్లిం సమాజ అమానతుదారుడు" అని చెప్పారు. ఇలాంటి వీరుల జీవిత చరిత్ర మనకు శుభదాయకం. సమృద్ధికరం కూడ. మనోహృదయాల ఏకాగ్రతతో, ఈ పుణ్య పురుషుల జీవిత చరిత్రలు చదువడం వల్ల మనం మన మూర్తిత్వాన్ని మలచుకోగలం. రండి, ఏ కారణాల వల్ల అల్లాహ్, ఆయన ప్రవక్త (సఅసం) ఈ మహానుభావుల వల్ల సంతోషపడ్డారో, ఇహపర జీవితాల్లో కృతార్థులని చెప్పారో తెలిసికొనే ప్రయత్నం చేద్దాం.

హజరత్ అబూ ఉబేదహ్ (రజి) ఇస్లాం స్వీకరించక ముందు హజరత్ అబూబకర్ (రజి) మిత్ర బృందంలో ఉండేవారు. అబూ బకర్(రజి) ముస్లిం

అయ్యారు, తన మిత్ర బృందాన్ని కూడా ఇస్లాం వైపు పిలిచారు. ఆయన మిత్రులలోని వివేకవంతులు, నిజానిజాలను అవగాహన చేసికొనే దక్షత కలవారు. ఇస్లాం అనుగ్రహాలను గుర్తించారు. దైవదాస్యానికి సంసిద్ధులయ్యారు. అట్టి వారెవ్వరు ఏకేశ్వరోపాసనం నుండి దూరం కాలేదు. హజరత్ జుబేర్ (రజి), హజరత్ తల్హా (రజి) లాంటి హేమాహేమీలు దైవమార్గంలో అసువులు ధారబోసిన అమరవీరులు, హజరత్ అబూబకర్ (రజి) ప్రబోధనల వల్లనే ముస్లింలయ్యారు. ఆయన (రజి) వలన ధర్మమార్గం అనుసరించిన విశ్వాసమూర్తుల్లో అబ్దుల్ రహమాన్ బిన్ అవుఫ్ (రజి) ఉన్నారు. ఈయన ప్రియప్రవక్త (సఅసం) సహచరులలో మంచి ఆలోచనాపరులు, సంక్లిష్ట సమయాలలో సమాలోచనలు చేసి సమస్యలను పరిష్కరించేవారు. సాఅద్ ఇబ్నె వఖ్ఖాస్ (రజి) లాంటి ఉత్తేజితులయిన సహబాలు, ఉస్మాన్ ఇబ్నె అప్ఫాన్ (రజి), అబూ ఉబేదహ్ (రజి) లాంటి గంభీర స్వభావం కలవారు ఇస్లాం స్వీకరించారు. శిఖరాగ్ర శ్రేణికి చెందిన వ్యక్తులయ్యారు.

ఇస్లాం స్వీకరించిన మొదటి కొద్దిమందిలో హజరత్ అబూ ఉబేదహ్ (రజి) గారు ఒకరు. వీరిని సాబిఖూనల్ అవ్వలూన్ అని అంటారు. అంటే ప్రారంభంలోని వారన్నమాట. ఈ మహనీయులు ఇస్లాం స్వీకరించినందువల్ల మక్కా పట్టణ ముష్రికుల చేతుల్లో దయాదాక్షిణ్యాలులేని దౌర్జన్యాలకు ఆహుతి అయ్యారు. కలిగిన ఆవేదనలను మౌనంగా భరించారు. హజరత్ అబూ ఉబేదహ్ (రజి) కూడా బాధలను ధైర్యంతో ఎదుర్కొన్నారు. పర్యవసానం, ఇంటిని, స్వదేశాన్ని, బంధుజనాన్ని వదలి వెళ్ళాల్సి వచ్చింది. సంపదను పోగొట్టుకోవలసి వచ్చింది. రెండు పర్యాయాలు హబసు (అబిసీనియా) దేశానికి, ఆ తరువాత మదీన పట్టణానికి వలస వెళ్ళాల్సి వచ్చింది.

అల్లాహ్ ఆదేశాలకు కట్టుబడి ప్రవక్త (సఅసం) చూపిన మార్గాన్ని ఆశ్రయించి మదీన వలస వచ్చి జీవిస్తున్న ముస్లింలను మక్కా ముష్రికులు వదలలేదు. బదర్ మైదానంలో యుద్ధానికి సమాయత్తమయ్యారు. ముస్లింలపై కాలుదువ్వారు. ఆ యుద్ధంలో హజరత్ అబూ ఉబేదహ్ (రజి) ఆవేశపూరిత

ఉత్సాహంతో పాల్గొన్నారు. ఆయన చూపిన దృఢ సంకల్పం క్రింది సంఘటన వల్ల మనకు తెలుస్తోంది. హజరత్ అబూ ఉబేదహ్ (రజి) ప్రియప్రవక్త (సఅసం) వెంట ఉంటూ, ఇస్లామి సైన్యంతో కలిసి పోరాడుతున్నారు. ఎదుట ఉన్నది ఎవరో కాదు, మక్కా ముష్రికులు, అందులో తన తండ్రి ఉన్నారు. యుద్ధం హోరాహోరీన జరుగుతుంది. హజరత్ అబూ ఉబేదహ్ (రజి) తండ్రిగారు పొంచి పొంచి తనయుని చంపడానికి బాణాలు కురిపిస్తున్నారు. హజరత్ అబూ ఉబేదహ్ (రజి) కొద్దిసేపు తండ్రిని ఉపేక్షించారు. కాని అవిశ్వాసి అయిన ఆ తండ్రి తనయుని ఔదార్యాన్ని గ్రహించలేకపోయాడు. కుమారుడు ఏ బంధుత్వాన్నీ లెక్కించక ఒక్కవేటు వేశాడు, ఆ దెబ్బతో కూలిపోయాడు తండ్రి. ధర్మ యుద్ధంలో ఆయన ప్రదర్శించిన దృఢ సంకల్పం చారిత్రాత్మకం. తల్లి, తండ్రి, అన్న, చెల్లెలు, జాతి తదితర అన్ని సంబంధాలకు అతీతం విశ్వాస బంధం. ప్రాపంచిక సంకెళ్ళను త్రెంచుకొని ఏకైక దేవుని పట్ల విశ్వాసం ప్రకటిస్తాడు ముస్లిం. అల్లాహ్‌కు దాసుడై ఉంటాడు. ఇలాంటి సంపూర్ణ విశ్వాసవంతుల ధైర్యాన్ని ప్రోత్సహిస్తూ దైవగ్రంథం ఇలా ప్రకటిస్తుంది:

"దైవం, ప్రళయదినం పట్ల విశ్వాసం ప్రకటించిన వారు దైవం మరియు దైవప్రవక్త పట్ల విరోధం కలవారితో అనుబంధం కల్గి ఉండరు; తుదకు ఆ వైరులు తండ్రి, తనయుడు, సోదరుడు, స్వకుటుంబీకులు అయినాసరే. వారే నిజమైన ముస్లింలు. వారి మనో హృదయాలను దైవం విశ్వాసమధురంతో నింపాడు. అదృశ్యంగా వారికి ఆయన సహాయపడుతుంటాడు కూడా."

(సూరయె ముజాదిల-3వ రుకూ)

ఆ తరువాత ఒహద్ యుద్ధం వచ్చింది. ఆ యుద్ధంలో ప్రియప్రవక్త (సఅసం) ముఖం గాయపడింది. తొడుక్కున్న కవచపు రెండు గొలుసులు తీవ్రంగా గుచ్చుకున్నాయి. హజరత్ అబూ ఉబేదహ్ (రజి) ఆ గొలుసును తన పళ్ళతో గట్టిగా పట్టి లాగారు, చేసిన ప్రయత్నంలో రెండు పళ్ళూడాయి. గొలుసు సంకెళ్ళు తీసివేయనంత వరకు ఎంత బాధ కలిగినా ప్రయత్నం మాత్రం మానలేదు. ప్రియప్రవక్త (సఅసం)ను సంరక్షించడం హజరత్ అబూ ఉబేదహ్ (రజి) లక్ష్యం.

బదర్, ఉహద్ సంగ్రామాలలో పాల్గొన్నట్టే హజరత్ అబూ ఉబేదహ్ (రజి) మహాప్రవక్త (సఅసం) వెంట అన్ని యుద్ధాలలో పాల్గొన్నారు. శత్రువులను పరాక్రమంతో ఎదుర్కొన్నారు. ఆ యుద్ధాలతోపాటు ప్రియప్రవక్త (సఅసం) ఏ సమరానికైె పంపినా, శత్రు సేనలను సంహరించి విజయభేరి మ్రోగిస్తూ వాపసు వచ్చిన దిట్ట హజరత్ అబూ ఉబేదహ్ (రజి).

ప్రియప్రవక్త (సఅసం) హజరత్ ఉమర్ ఇబ్నుల్ ఆస్ (రజి)ను ఒక పోరాటంలో కొంత మంది సైనికులతో పంపారు. వెళ్ళిన ఉమర్ ఇబ్నుల్ ఆస్ (రజి) అక్కడి పరిస్థితులను పరిశీలించి ఇంకా కొంత సైన్యాన్ని పంపవలసిందిగా ప్రియప్రవక్త (సఅసం)ను కోరారు. ఆ నివేదికను పురస్కరించుకొని ఇంకా రెండు వందల మంది సిపాయిలను హజరత్ అబూ ఉబేదహ్ (రజి) నాయకత్వంలో పంపారు. ప్రియప్రవక్త (సఅసం) పంపిన అదనపు సైన్యంలో హజరత్ అబూబకర్ (రజి), హజరత్ ఉమర్-యె- ఫారూఖ్ (రజి) లాంటి వీరశిఖామణు లున్నారు. వారందరూ నాయకత్వం వహిస్తూ హజరత్ అబూ ఉబేదహ్ (రజి) పాల్గొంటున్న యుద్ధంలో మద్దతు కోసం వెళ్ళారంటే ఆయన ప్రతిభకు, ఆయన పట్ల ప్రియప్రవక్త (సఅసం)కు ఉన్న నమ్మకానికి వేరే నిదర్శనం కావాలా!

హజరత్ అబూ ఉబేదహ్ (రజి) నాయకత్వంలో సైన్యం పంపబడింది. అది హజరత్ ఉమర్ ఇబ్నుల్ ఆస్ (రజి) సైన్యంతో కలిసింది. ఈ మొత్తం సైన్యానికి ఎవరు నేతృత్వం వహించాలన్నది సమస్య. హజరత్ అబూ ఉబేదహ్ (రజి) గారు ఉండగా సైన్యాధిపత్య భారం వహించడానికి హజరత్ ఉమర్ ఇబ్నుల్ ఆస్ (రజి) అంత అర్హులు కారని అందరికీ తెలుసు. అయినా సందర్భోచితంగా హజరత్ ఉమర్ ఇబ్నుల్ ఆస్ (రజి) సైన్యాధిపతిగ కొనసాగాలని భావించి, హజరత్ అబూ ఉబేదహ్ (రజి) ఆయన్నే సైన్యాధిపతిగ అంగీకరిస్తూ యుద్ధంలో పాల్గొన్నారు. ఈ దృష్టాంతం ఆయనలోని ఉన్నత నైతిక విలువలను చాటి చెబుతోంది.

హజరత్ అబూ ఉబేదహ్ (రజి) ప్రియప్రవక్త (సఅసం) సాంగత్యంలో ఉంటూ తన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకొన్నారు. ఉన్నత సేవలకు జీవితం అంకితం

చేశారు. ప్రియప్రవక్త (సఅసం) ప్రపంచం వీడాక, హజరత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) కాలంలో, హజరత్ ఉమర్-యె-ఫారూఖ్ (రజి) కాలంలో ఎన్నో ఘన కార్యాలను సాధించారు. ఈ ఖలీఫాల కాలంలో సిరియా దేశంపై దండెత్తడమయింది. డెమాస్కస్, మఖల్, హమస్, లాజిఖియా, యర్మూక్ తదితర దేశాలపై కూడా ఇస్లామి సైన్యం దాడి చేయడమయింది. ఎక్కడ వెళ్ళినా శత్రు సైన్యంతో భీకర సమరం చేయవలసి వచ్చింది. ఎటు వెళ్ళినా ఖలీఫాగారి ఆజ్ఞా పాలన చేస్తూ, సైన్యాధిపతిగ ప్రతిభతో పోరాటాలు చేశారు, విజయభేరి మ్రోగించారు. చరిత్ర పుటల్ని తిరగేస్తే ఆ సంఘటనలు ఆయన యుద్ధ నైపుణ్యాన్ని, శక్తిని ప్రదర్శిస్తాయి. ఉదాహరణకు యర్మూక్ యుద్ధంలోని ఓ సంఘటన చూడండి.

హజరత్ అబూ ఉబేదహ్ (రజి) క్రైస్తవ రాజ్యాలను కైవశం చేసికొంటూ వెళ్తున్నారు. రోమన్ చక్రవర్తి హెర్క్యూలియస్ రాజ్యపీఠాన్ని కదలించడానికి ఆయన రాజ్యంలో చొరబడ్డారు. ఆ రాజాధిరాజు తన అధీనంలోని పాలకులకు ముస్లింలతో రానున్న ముప్పును ముందుగ తెలియపరిచాడు. ఆ హెచ్చరిక నందుకొన్న సామంత పాలకులు తమ తమ సైనిక బలగాలను సమాయత్తపరుస్తూ ఒక మహా సైన్యాన్ని తయారు చేశారు. ముస్లింలను తమ రాజ్యాల నుండి గెంటివేశాక విరామ విశ్రాంతులు తీసికొంటామని ప్రతిజ్ఞబూనారు. ఈ వార్త హజరత్ అబూ ఉబేదహ్(రజి)కు కూడా అందింది. ఆయన 'హరిస్' అనే స్థలంలో ఆగి తన సైనికాధికారులను పిలిచి ఒక ప్రభావపూరిత ఉపన్యాసమిచ్చారు. మిడుతల దండులా ఉన్న వైరులను జయించేందుకు సలహాలను అర్థించారు.

ఒక మహాశయుడు ఇలా సలహానిచ్చారు. "మహిళలను, పిల్లవాండ్లను పట్టణంలో వదలి శత్రు సైన్యాన్ని ఎదుర్కోవడానికి వెళ్ళాలి. ఖాలిద్ బిన్ వలీద్ (రజి)కు, ఉమర్ ఇబ్నుల్ ఆస్ (రజి)కు ఉత్తరాలు వ్రాస్తూ వారిని డెమాస్కస్, పాలస్తీనా నుండి ఇక్కడకు రప్పించాలి" అన్నారు.

'హరిస్' అప్పుడప్పుడే జయించబడింది. అక్కడి క్రైస్తవులు జిజియా చెల్లించే షరతుపై ముస్లింల అధీనంలో ఉంటామని ఒప్పుకొన్నారు. అందువల్ల మరో

మహనీయుడు ఇలా సలహానిచ్చారు. "మనం మన ఆలుబిడ్డలను క్రైస్తవుల దయాదాక్షిణ్యాలపై వదలి వెళ్ళరాదు." సర్వసైన్యాధిపతి హజరత్ అబూ ఉబేదహ్ (రజి) ఇలా అన్నారు: "అలా అయితే మనం వెంటనే క్రైస్తవుల పట్టణం వదలి వెళ్ళిపోవాలి." ఈ సలహా రావడమే ఆలస్యం, ఇబ్నె హస్న (రజి) లేచి నిలబడ్డారు. అభ్యంతరాన్ని తెలిపారు. ఇలా అన్నారు: "ఓ నాయక మహాశయా! ఇస్లాం దృష్టితో పరిశీలిస్తే మీరిచ్చిన సలహా చేసిన వాగ్దానానికి సంపూర్ణ వ్యతిరేకమవు తుంది. ఇచ్చిన మాట నిలబెట్టుకోలేకపోయినట్లే. ఇలా వెళ్ళడానికి మీకు హక్కు లేదన్నారు.

ముస్లిం సమాజ నాయకుడు, అమానతుదారుడు. ఇలాంటి ప్రాణ సంకట స్థితిలో కూడా ఇస్లాం సూత్రాలకు భిన్నంగ ప్రవర్తించదలుచలేదు. చేయబోతున్న తప్పును ఒప్పుకొన్నారు. విజ్ఞులతో సంప్రదింపులు చేశారు. వసూలు చేసిన జిజియా మొత్తాన్ని క్రైస్తవ సోదరులకు వాపసు చేశారు. ఇలా అన్నారు: "జిజియా మీ ప్రాణ రక్షణ కోసం తీసుకోబడిన మొత్తం. ఇప్పుడా పని మేము చేయలేకున్నాం. అలాంటి సమయంలో వసూలు చేసిన సొమ్మును మేము ఉపయోగించరాదు, దానికి మేము అర్హులము, హక్కుదారులముకాము." విజయోన్ముఖులైనప్పటికీ ముస్లింల సత్యసంధత, వారి న్యాయశీలరత చూస్తూ హరిస్‌లో ఉన్న క్రైస్తవులు ప్రభావితులయ్యారు. "ఓ దైవమా! వీరిని మళ్ళీ మా దేశానికి పంపు."

ముస్లింలు 'హరిస్"ను విడిచివెళ్ళారను వార్త రోము చక్రవర్తి హెర్క్యూలియస్‌కు అందింది. వారి ధైర్యం హెచ్చయింది. ఒక గొప్ప సైన్యాన్ని సమీకరించుకొని యర్‌ముఖ్‌కు వెళ్ళారు. అక్కడ ముస్లింలను ఓడించి పరాభవంపాలు చెయ్యాలి, మరోసారి రోమన్ల జోలికి రాకుండా వారిని శాశ్వతంగా నివారించాలన్నదే వారి ఉద్దేశ్యం. కాని ముస్లింల నైతిక బలం, వారి కరవాలాల మెరుపులు చూచిన రోమన్లకు ముస్లింలతో పోరాడే ధైర్య సాహసాలు లేకపోయాయి. ఎలాగైనా సరే సంధి చేసికోవాలి, కాబోయే యుద్ధాన్ని ఆపాలి అని తలంచారు కొందరు రోమన్లు. ఈ కోరికను పురస్కరించు కొని ఒక దూత ఇస్లామి సేనతో సంప్రదించడానికి వచ్చాడు. వచ్చిన దూత ముస్లింలను

సమీపం నుండి చూచాడు. హజరత్ అబూ ఉబేదహ్ (రజి)తో కలిసాడు. వారు సంధి నిబంధనల్ని చర్చించుకొంటూ ధార్మిక విషయాలు కూడా మాట్లాడు కున్నారు. ఇస్లాంలో ఉన్న సత్యాన్ని, ధార్మికతని గ్రహించాడు వచ్చిన దూత. స్వచ్ఛందంగ ఇస్లాం స్వీకరించాడు. ముస్లిం అయ్యాడు. ఇక ఆ దూత మళ్ళీ రోమన్ల వద్దకు పోదలచలేదు. అలా తిరిగి వెళ్ళకపోయినట్లయితే రోమనులలో అపోహ కలుగుతుందని అంచనా వేస్తూ హజ్రత్ అబూ ఉబేదహ్ (రజి) ఇలా అన్నారు: "ఇప్పుడయితే మీరు వాపసు వెళ్ళండి. రేపు మా సైనికులు మీ సైన్యం వద్దకు వస్తారు. వారితోబాటు మీరు వాపసు రండి."

రెండవ దినం ఇస్లామి సైనికులు, రోమను సైన్యం వద్దకు వెళ్ళారు. చర్చించుకొన్న సంధి షరతులపై ఏకాభిప్రాయం కుదరలేదు. పర్యవసానం యుద్ధ మేఘాలు అలుముకోవడం ప్రారంభమయ్యాయి. శత్రు సేనలు లక్షల సంఖ్యలో ఉన్నారు. ముస్లిం సేనలు ముప్పది లేక ముప్పది రెండు వేలున్నాయి. హజ్రత్ అబూ ఉబేదహ్ (రజి) ఎంతో చాకచక్యంతో ముస్లిం సేనలను యుద్ధంలో దింపారు. ఆయన చూపిన నైపుణ్యం, సమయస్ఫూర్తి వల్ల విరోధి ఓడిపోయాడు, యుద్ధ మైదానం నుండి పలాయనం అయ్యాడు. దాదాపు డెబ్బది వేల మంది శత్రు సేనలో మరణించారు. ఈ యుద్ధానంతరం ముస్లింలు సునాయాసంగ రోమనుల కోటలన్నింటిని ఆక్రమించుకొన్నారు.

హజరత్ అబూ ఉబేదహ్ (రజి) యుద్ధాలలో ప్రదర్శించే చాతుర్యం ఎన్నో విజయాలకు దారి తీసింది. ఆయన నడవడిక కూడ ఉన్నతంగ ఉండేది. మక్కా ముష్రికులకు, ప్రియప్రవక్త(సఅసం)కు మధ్య హుదైబియాలో జరిగిన సంధి ఒప్పందంపై కూడా హజ్రత్ అబూ ఉబేదహ్ (రజి) ఒక సాక్షిగ సంతకం చేశారు. 9వ హిజరీలో నజ్రాన్ దేశం నుండి కొంత మంది ఒక అభ్యర్థనతో ప్రియప్రవక్త(సఅసం) సమక్షంలో హాజరయ్యారు. ఆ విన్నపం ఏమిటంటే, వారి వెంట సత్యధర్మ ప్రబోధకుని పంపినట్లయితే వారు ఇస్లామి ధర్మ హితవులను అర్థం చేసికొని జీవితం గడుపుతామన్నారు. ప్రియప్రవక్త (సఅసం) హజ్రత్ అబూ ఉబేదహ్ (రజి)ను వారి వెంట పంపుతూ ఇలా అన్నారు: "ఈయన ముస్లిం సమాజపు నమ్మకస్తుడు. ఈయన్నే మీ వెంట పంపుతున్నాను."

ప్రియప్రవక్త (సఅసం) తరువాత అర్హతగల ఖలీఫాను ఎన్నుకోబోతున్నారు. హజరత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) లాంటి మహనీయులు ముస్లింల ఎదుట హజ్రత్ అబూ ఉబేదహ్ (రజి)ను నిలబెట్టారు. ఇలా చెప్పారు: "ఇటు చూడండి, హజ్రత్ అబూ ఉబేదహ్ (రజి) ఇక్కడున్నారు. ఆయనకు **'అమీనుల్ ఉమ్మత్'** అనే బిరుదివ్వబడింది. కావాలంటే ఆయన చేతిపై 'బయిత్' చేయండి." ఆ తరువాత హజ్రత్ అబూ ఉబేదహ్ (రజి) ముందుకొచ్చి, హజ్రత్ సిద్దీఖ్-యె-అక్బర్ (రజి) చేతిపై 'బయిత్' చేయడంతో ముహాజిర్లు, అన్సారీలు హజరత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) చేతిపై బయిత్ చేస్తూ ఆయన్నే ఖలీఫాగ నిర్ణయించారు.

హజ్రత్ అబూ ఉబేదహ్ (రజి) ఎప్పుడూ సమానత్వాన్ని కోరుకొనేవారు. అల్లాహ్, ఆయన ప్రవక్త (సఅసం) పట్ల నిత్యం విధేయత కలిగి మెలిగేవారు. వీరు అధికులు, వారు అల్పులు అనే భావం లేశమంత కూడా లేకుండా ఉండేవారు. ఒకసారి యుద్ధంలో ఒక చోట మజిలీ చేసి ఉన్నారు. విరోధి సైన్యం నుండి సంధి చేసికొనే ప్రయత్నంలో ఒక సిపాయి పంపబడ్డాడు. వచ్చిన వ్యక్తి ఆశ్చర్యపోయాడు. అక్కడున్న ముస్లిం సైనికులందరు ఒకే విధంగా మూసపోసినట్లున్నారు. ప్రతి చిన్నా పెద్దా అందరూ ఒకే విధంగా ఉన్నారు. అక్కడున్న గుడారాలలో సైన్యాధిపతి గుడారం ఏదీ అని దృష్టి సారించి చూశాడు. అక్కడున్న ఆ సముదాయంలో ఎవరు సిపాయి, ఎవరు సైన్యాధిపతి అని గుర్తించలేక పోయాడు. ఆశ్చర్యపోయి అడిగాడు:

"ఎవరయ్యా మీ సర్దారు?" అక్కడున్న వారు అతణ్ణి హజ్రత్ అబూ ఉబేదహ్(రజి) దగ్గరకు పంపారు. ఆ సమయంలో ఆయన వట్టి నేలపై కూర్చొని ఉన్నారు. చూచీ చూడగానే విస్మయమొందాడు. "మీరేనండి నిజమైన సర్దారు!" ఆ పిమ్మట వచ్చిన పని చూసుకొన్నాడు, వెళ్ళిపోయాడు.

హజరత్ ఉమర్ (రజి) ఖలీఫాగ ఉన్నప్పుడు, సిరియా దేశంలో ఎన్నో సంస్కరణలను ప్రారంభించారు. ఆ పనులు చాలా వరకు హజ్రత్ అబూ ఉబేదహ్ (రజి) చేతుల్లో సాధించబడ్డాయి. 18వ హిజరీలో అరబ్బు దేశం క్షామం వల్ల కటకటలాడుతుంది. హజ్రత్ అబూ ఉబేదహ్(రజి) క్షామ పీడితుల కోసం నాలుగువేల ఒంటెలపై అవి మోసేంత ధాన్యాన్ని సిరియా దేశం నుండి రవాణా

చేశారు. మానవ సేవతోపాటు ధార్మిక ప్రచారం మరవకుండ చేసేవారు. యుద్ధ సమయం కానీయండి, శాంతి సమయం కానీయండి, ధర్మప్రచారం ఆయన గుణం. వేలాది సంఖ్యలో సిరియా దేశవాసులు, రోమను క్రైస్తవులు ఆయన నడవడిక, ప్రవర్తనను చూస్తూ ప్రభావితులయి ఇస్లాం స్వీకరించారు.

హజ్రత్ అబూ ఉబేదహ్ (రజి) సాధారణ స్వభావం కలవారు. సిరియా దేశాన్ని జయించిన వీరుడు, ఆపై ఆ ప్రాంతానికి గవర్నరు జనరల్‌గా నియమించబడ్డారు. అయినప్పటికీ అతి సాధారణ దుస్తులు ధరించేవారు. స్వారీ చేయడానికి మామూలు ఒంటె ఉంది. ఆ ఒంటెను నడిపే కళ్ళెం మామూలు తాడు మాత్రమే. హజరత్ ఉమర్ (రజి) ఒక అత్యవసర పని మీద సిరియా దేశానికి వచ్చారు. అక్కడికి వెళ్ళాక ముస్లిం సమాజ అమీన్ (అమానతుదారుడు) హజ్రత్ అబూ ఉబేదహ్(రజి)తో కలిసారు. ఆయన వద్ద యుద్ధకవచం, కరవాలం, ఒంటెపైన స్వారీ చేయడానికి వేసే 'కజావ' తప్ప మరేమీ లేవు. హజ్రత్ అబూ ఉబేదహ్(రజి)ను ఉద్దేశిస్తూ, "ఓ హజ్రత్ అబూ ఉబేదహ్! నిత్యావసర వస్తువులైనా కనీసం పెట్టుకోకూడదా!" అని అన్నారు. జవాబుగా, "ఓ అమీరుల్ మోమినీన్! ఇవే నాకు ఎక్కువయ్యాయి" అని చెప్పారు హజరత్ అబూ ఉబేదహ్ (రజి).

ఆ పిమ్మట హజరత్ ఉమర్(రజి) నాలుగు వందల దీనార్లు, నాలుగు వేల దిర్హములు ఆయన కోసం పంపారు. ఆ మహనీయుడు వచ్చిన ధనాన్ని తన సైన్యంలో పంపకం చేశారు. ఈ సంగతి హజరత్ ఉమర్ (రజి)కు తెలియగా "అల్ హమ్దులిల్లాహ్! ఇస్లాంననుసరించే వారిలో ఇలాంటి వారు ఉన్నారని" దైవానికి కృతజ్ఞత తెలుపుకొన్నారు. ఇలా జీవితమంతా అల్లాహ్, ఆయన ప్రవక్త (సఅసం) ఇచ్చిన ఆజ్ఞలను పాటిస్తూ, చివరకు జాబియా అనే ప్రదేశంలో ప్లేగు (తావూన్) వచ్చింది. ఆ ప్లేగు సోకడం వల్ల దివంగతు లయ్యారు. అనేక పెద్దలు ఆయన్ను అక్కడ నుండి వెళ్ళి పొమ్మన్నారు. ప్రియప్రవక్త (సఅసం) ఆ వ్యాధి వచ్చాక పారిపోగూడదని సెలవిచ్చారు. అందువల్ల ఆయన అక్కడే ఉన్నారు. ప్రాణాలు సైతం ఆజ్ఞాపాలనలోనే వదిలారు.

హజరత్ సయీద్ ఇబ్నె జైదు
(రజిఅల్లాహు అన్హు)

హజరత్ సయీద్ (రజి) అదృష్టవంతులు. ఆయన తండ్రి జైదు మక్కావాసి. మక్కా నగరంలో ఇస్లాం రాకకు మునుపు నుండే జైదుకు బహుదైవారాధన గిట్టేది కాదు. వాటన్నిటి నుండి విసుగెత్తిపోయారు జైదు. దైవానికి సాటి కల్పించడం, వాటికి నైవేద్యాన్ని అర్పించడం, వాటిని సంతోషపరచడానికి జంతువులను బలి చేయడం భరించేవారుకారు జైదు. ఎవరైనా విగ్రహాదులకు బలి దానం చేసి వాటి మాంసం తినడానికి ఇస్తే, దేవతలకు అర్పించిన జంతువుల మాంసం తిననని తిరస్కరించేవారు. జైదు విగ్రహారాధన పట్ల ఇస్లాం అవతరణకు ముందు నుండే ఎంతో జాగ్రత్త పడేవారు. కాని ఒక్క ప్రశ్న ఆయనను ఆవేదన పరుస్తుండేది. దైవానికి సాటి కల్పించకుండా జాగ్రత్త పడ్డాను. ఏకేశ్వరోపాసనం ఎక్కడుందని? దాని కోసం ఎక్కడ వెతకను? నేనేం చేయను? ఇలా ప్రశ్నించుకొంటూ సత్యధర్మం కోసం దేశ విదేశాలు పర్యటిస్తూ అన్వేషణ చేస్తూ వచ్చారు. యూదుల మత గురువులతో కలిశారు. మనసులో ఆవేదన కలిగిస్తున్న దైవ ఏకత్వాన్ని గురించి అడిగారు. వారు ఆయనకు సమాధానమిస్తూ "స్వచ్ఛమైన దైవ ఏకత్వపు ధర్మం ఏకోన్ముఖమైన ధర్మంలోనే పొందగలరన్నారు." జైదు వారిని మళ్ళీ ప్రశ్నించారు: "ఏకోన్ముఖమైన ధర్మం (హనీఫ్) అంటే ఏమిటి?" దానికి వారు, "హనీఫ్ ధర్మం హజరత్ ఇబ్రాహీం (అలై) ప్రబోధించిన జీవిత విధానం" అని అన్నారు. కాని ఇబ్రాహీం (అలై) ప్రబోధించిన ధర్మం గురించి వారేమీ చెప్పలేకపోయారు. దూరదేశాలు పర్యటిస్తూ వెళ్ళిన జైదు కేవలం ఇబ్రాహీం (అలై) ధర్మం అనే పేరును స్మరించుకొంటూ ఉత్సాహంగ స్వదేశానికి వచ్చారు. మక్కా చేరుకొన్నారు. కాబా గోడలకు వీపు నానించి కూర్చొని ఇలా అనేవారు. "ఓ ఖురైషు వంశీయులారా! దైవసాక్షిగా చెబుతున్నాను. నేను తప్ప ఇబ్రాహీం (అలై) గారి ధర్మం ఎవరూ పాటించడం లేదు."

జైదులాంటి సత్యాన్వేషణ చేసేవారు, దైవ ఏకత్వపు ధర్మాన్ని ఆకాంక్షిస్తూ ముష్రికుల నుండి దూరంగ ఉండేవారు. ఇలా సత్యధర్మ అన్వేషణలోనే కాలంగడిపి ఆయన ప్రపంచం వదలి వెళ్ళారు. కాని హజరత్ ముహమ్మద్ (సఅసం) ఏకైక దైవ నినాదం ఇస్తూ మక్కా నగరంలో హజరత్ ఇబ్రాహీం (అలై) ప్రబోధించిన ఏకేశ్వరోపాసనాన్ని మళ్ళీ సమాజంలో ప్రవేశపెట్టారు. అదే ఇస్లాం, అదే సత్యధర్మం. దానిని పూర్తి స్వరూప స్వభావాలతో ప్రచారం చేశారు. దైవ ఏకత్వ నినాదం సయీద్ కుమారుడైన జైదు(రజి)కు వినిపించింది. ఆయన తండ్రి జైదు సత్యధర్మం కోసం వెదికి వెదికి అసువులు బాసారు. ఈ విషయం హజరత్ సయీద్‌కు తెలుసు. హజరత్ ఇబ్రాహీం (అలై) ప్రబోధించిన హనీఫ్ ధర్మప్రచారం మక్కాలో వినిపించిన వెంటనే అమితోత్సాహంతో హజరత్ సయీద్ (రజి) దానిని అంగీకరించారు. ఆయన సతీమణి సద్గుణాలరాశి. పెనిమిటిని సమర్థించారు, ఆమె కూడా ముస్లిం అయ్యారు. ఆ కాలం బహు గడ్డుకాలం, ఇస్లాం స్వీకరించినవారిని మక్కా ముష్రికులు నానా బాధలు పెట్టేవారు. ముస్లింలను చూస్తే సహించేవారుకారు. ఎవరైనా ఒకరు కుటుంబంలో ఇస్లాం స్వీకరించి ముస్లిం అయ్యాడంటే, ఆ వ్యక్తిని కించపరిచే వారు, ఇతరులతో సమానంగ చూచేవారుకారు. ముస్లింలపై దౌర్జన్యం సాగించే వారు ఎవరో పరాయివారుకారు, ఆత్మీయులైన తల్లిదండ్రులు, సోదరులు, పినతండ్రులు, బంధువులు అందరికంటే ముందు ఆ కుటుంబంలో ముస్లింలను వెలివేసి నానా బాధలకు గురి చేసేవారు.

హజరత్ ఫాతిమ (రజి), హజరత్ సయీద్ (రజి) గారి సతీమణి. ఈమె హజరత్ ఉమర్ (రజి)గారి చెల్లెలు. ఈమె భర్త చూపిన వెలుగుబాటపై నడవడం వల్ల ఆమెకు విశ్వాస సౌభాగ్యం లభించింది. ఇక ఈమె ప్రయత్నం వల్ల అన్న కూడ ముస్లిం కావలసి ఉంది.

ఈ సంఘటన అద్భుతమైంది. గుణపాఠం నేర్పడంలో కూడ అనన్య సామాన్యమైంది. మక్కా ముష్రికులు హజరత్ ఉమర్(రజి)ను ఆవేశపరచి హజరత్ ముహమ్మద్ (సఅసం) ప్రాణాలు పొట్టనపెట్టుకోవడానికి సిద్ధపరిచారు. హజరత్ ఉమర్ (రజి) నగ్న కరవాలం చేతపట్టి నేరుగ ప్రియప్రవక్తను వెదుక్కుంటూ

వెళ్తున్నారు. దారిలో ఆయన మిత్రుడొకడు కంట పడ్డాడు. "ఓ ఉమర్! ఎక్కడికి? ఆగు" అని అన్నాడు. "ముహమ్మద్ (సఅసం)ను అంతం చేయడానికి వెళ్తున్నాన"న్నాడు ఉమర్ (రజి). ఉమర్‌కు ఎదుటపడిన వ్యక్తి ఆయనకు సన్నిహితుడు, నిర్మొహమాటంతో ముచ్చటించేవాడు, ఇలా అన్నాడు: "ముహమ్మద్ (సఅసం)ను ఆ తరువాత చంపుదువుగాని, మొదట వెళ్ళి నీ ఇంటి సంగతి చూసుకో. నీ చెల్లెల్ని, ఆమె భర్తను వెళ్ళి చూడు; వారు ముస్లింలయ్యారు."

ఆ మాటలు మంటపై నూనె చల్లినట్లు పని చేశాయి. ఉమర్ (రజి) కోపంతో మండిపోయారు. పండ్లు కొరుక్కుంటూ బావగారి ఇల్లు చేరారు. హజరత్ సయీద్ (రజి)ను పట్టుకొని బాదడం మొదలెట్టారు. ఇటు ఫాతిమ (రజి) భర్తగారి సహనాన్ని చూచారు, అటు అన్నగారి నిర్దాక్షిణ్యం చూశారు. అన్నను ఆపి భర్తను రక్షించడానికి మధ్యలో వచ్చారు. ఉమర్ (రజి) మరింత రెచ్చిపోయారు. చెల్లెల్ని కూడ నిర్దయతో పిడికెళ్ళతో కొట్టి ఆమె దేహాన్ని గాయపరిచారు. ఒళ్ళంతా రక్త సిక్తమయింది. ఇంతగా శిక్షించి దండించినా ఇసుమంత కూడా వారిద్దరిని ఇస్లాం నుండి దూరపరచలేకపోయారు. చెల్లాయి ఎంతో గంభీరంగా అన్నను మందలిస్తూ, 'ఓ ఉమర్! కావాలంటే ప్రాణాలను పొట్టనపెట్టుకో. మా మనోంత రాళాలలో గూడుకట్టుకున్న ఇస్లాంను ఇక వదలడం దుర్లభం. నీవేగనక సత్యాన్ని అంగీకరించకపోయావా, జాగ్రత్త తెలిసికో, అల్లాహ్ నీపై ప్రతీకారం తీసికోక ఉండడు!"

వాళ్ళిద్దరి దృఢ విశ్వాసం చూశారు ఉమర్ (రజి). అతనిలో ఒక విధమైన గగుర్పాటు కలిగింది. చెల్లాయి చెప్పిన మాటలు ఒక మహత్యంలా ఆయనపై పని చేశాయి. ఒక తడవ ఆలోచించారు. "మంచిది, మీరు చదువుతున్న కావ్యం ఏమిటో వినిపించమన్నారు." హజరత్ సయీద్ (రజి) కొన్ని వాక్యాలను వినిపించారు. ఆ సమయం రానే వచ్చింది. అల్లాహ్ అనుగ్రహం ఆయనను వరించింది. చదివి వినిపించిన దైవ వాక్యాలు ఉమర్ (రజి)ను పూర్తిగా మార్చేశాయి. ఇక అక్కడ నుండి లేచారు. విన్న ఒక్కొక్క మాట పరమ సత్యంగా కన్నుల ఎదుట నిలిచింది. చివరకు ప్రియప్రవక్త (సఅసం) సమక్షంలో వచ్చారు. ఆలసించక విశ్వాస వచనం పలికారు, ముస్లిం అయ్యారు. ఇలా పరిశీలించి

చూస్తే హజరత్ ఉమర్ (రజి) ఇస్లాం స్వీకరించడంలో అల్లాహ్ హజరత్ సయీద్ (రజి)ను ఒక మధ్యవర్తిగ చేశాడు. ఆయన ఉమర్ (రజి)కు ఇస్లామి మార్గదర్శ కుడయ్యారు.

ఇస్లామి ఉద్యమసోదరుల జీవితగాధలు చదివితే హజరత్ సయీద్ (రజి) తన జీవితంలో అల్లాహ్, ప్రియప్రవక్త (సఅసం)లకు నచ్చని ఏ పని కూడా చేయలేదని తెలుస్తుంది. చరిత్రకారులు ఈయన విషయంలో భావగర్భిత మైన ఒక వాక్యం ఇలా వ్రాశారు: “యుద్ధాలలో హజరత్ సయీద్ (రజి) ప్రియప్రవక్త (సఅసం)కు ముందుండేవారు, నమాజులలో ఆయన (సఅసం)కు వెనుక ఉండేవారు.” ప్రియప్రవక్త (సఅసం) పరమపదించాక కూడా హజరత్ సయీద్ (రజి) కేవలం ఇస్లాం కోసం యుద్ధాలలో పాల్గొన్నారు. ధైర్యంతో పోరాడారు. ఆయన కనబరచిన యుద్ధనైపుణ్య దక్షత చూసి ఆయన్ను గవర్నరుగ నియమించడానికి ఉపక్రమించగా అందుకాయన ఇష్టపడలేదు.

ఒకప్పుడు బలవంతంగ ఆయనను డెమాస్కస్ గవర్నరుగ నియమించడ మయింది. అప్పుడాయన హజరత్ అబూ ఉబేదహ్(రజి)కు ఇలా ఉత్తరం వ్రాశారు: “మీరేమో జిహాద్ చేస్తూ దైవపుణ్యం సంపాదిస్తుండండి, ఆ భాగ్యం నోచుకోకుండ ఉండడానికి నేనంతటి త్యాగశీలురనుకాను. అందుచేత ఉత్తరం అందిన వెంటనే నా స్థలంలో మరెవరినైనా పంపండి. ఎంత తొందరగ సాధ్యమైతే అంత తొందరగా నేను మీ వద్దకు వస్తాను” శేషజీవితం ఒక సాధారణ సిపాయిగా యుద్ధాలలో పాల్గొంటూ గడిపారు. అల్లాహ్ ఆయనకు ఉదార హృదయాన్నిచ్చాడు. ఇహభోగభాగ్య లాలస ఆయనకు లేదు. దేవునిపై ఒట్టు వేసికోవడానికి ఆయన ఇష్టపడేవారు కారు. ఒక హక్కు విషయంలో ఆయనకు న్యాయస్థానం ఆశ్రయించాల్సి వచ్చింది. ఖాజీ ప్రమాణం చెయ్యమన్నారు. తన హక్కును వదిలేశారేకాని దేవుని మీద ప్రమాణం చేయడాన్ని అంగీకరించలేదు. ఆయనలో దైవభయం మెండు. ఇస్లాం కోసం కృషి (నిరంతరం) చేసేవారు. అది చూచి ప్రియప్రవక్త (సఅసం) ప్రపంచంలోనే ఆయనకు శుభవార్త నిచ్చారు. స్వర్గనివాసి అని ధృవపరిచారు. 70 సంవత్సరాల వయస్సులో ప్రభువు ప్రసన్నత నోచుకొనే పనులు చేస్తూ ప్రపంచాన్ని వదిలారు.

హజరత్ తుఫైల్ ఇబ్నె వదూసీ
(రజిఅల్లాహు అన్హు)

మక్కా నగరంలో సత్యధర్మం వైపు పిలుపు ఇవ్వబడుతుంది. ఆ పిలుపు నిచ్చే వారి మాటలు వినకుండా ప్రజలు దూరంగ ఉంటున్నారు. అసత్యవాదులు ధర్మప్రచారాన్ని ఆపడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో ప్రముఖమైన ప్రయత్నం ధర్మ ప్రబోధకుల పట్ల దుష్ప్రచారం చేయడం, వారి విషయంలో వదంతులు వ్యాపింపజేయడం, ఇంకా వారి వల్ల మహోపద్రవం కల్గుతుందని హెచ్చరించడం. ఇలా ప్రవర్తించడంలో వారి ఉద్దేశ్యం? ఇస్లాం ప్రచారకుల వద్దకు ప్రజలు పోరాదని, వారిచ్చే ధర్మజ్ఞానం ప్రజల చెవుల్లో పడరాదని. ధార్మిక ఉపన్యాసాలు వింటే మార్గభ్రష్టులవుతారని తలిచారు. ఇది దుష్టులు చేస్తూ వచ్చిన ప్రాపగండ.

ప్రజలలో చాలా మంది అమాయకులు. నిత్యం దైనందిన పనుల్లో ఉంటారు. క్రొత్తగా వచ్చి ధర్మప్రచారం చేసే వారితో పరిచయం ఉండదు. అసత్యవాదుల దుష్ప్రచారానికి ప్రభావితులై ధర్మప్రబోధకుల పట్ల జాగ్రత్త పడతారు. సాధ్యమైనంతవరకు వారి చెంతకు పోరు. కాని ఈ పరిస్థితి ఎంతో కాలం ఉండదు కూడ. స్వార్థపరుల కుటిల యత్నాలు ఒకానొక దినం విఫల మవుతాయి. ఏమీ తెలియని అమాయకులు సత్యాన్ని, నిజధర్మాన్ని గుర్తించడం కూడ ప్రపంచం చూస్తుంది. అలాంటప్పుడు చేసిన అసత్యపు ప్రాపగండ, వ్యాపింప జేసిన వదంతులు ఆవిరిలా అదృశ్యమవుతాయి. సత్యధర్మాన్ని గ్రహించిన వ్యక్తి వెంటనే ధర్మ ప్రబోధకులతో ఏకమవుతాడు. ధార్మిక ఉద్యమంలో మనసార పాల్గొంటాడు కూడ. అనుదినం ఇలాంటి సంఘటనలు జరుగుతుండడం మనం చూస్తుంటాం. గతంలో కూడ మనకు గుణపాఠాలనిచ్చే ఇలాంటి విషయాలు ఎన్నో జరిగాయి. అవన్నీ చరిత్ర పుటల్లో భద్రపరచబడ్డాయి.

హజరత్ తుఫైల్ ఇబ్నె వదూసీ (రజి) జీవితం ఇలాంటి ఒక ఘట్టం. ప్రత్యేకంగా చదువదగింది. హజరత్ తుఫైల్ ఇబ్నె వదూసీ (రజి) యమన్ దేశస్థుడు. అక్కడి ఒక సుసంపన్నమైన 'దూస్' తెగకు చెందినవారు. ఒక వైపు ఆయన తన తెగ వారందరికి నాయకుడు, మరో వైపు గొప్ప వ్యాపారస్థుడు

కూడ. వ్యాపార లావాదేవీల కోసం ఈయన తరచూ మక్కా పట్టణం వచ్చి పోయేవారు. పైపెచ్చు ఆయనొక మంచి కవి కూడ. ఈ కారణాల వల్ల మక్కా పట్టణ ధనికులు ఆయనకు అతిథి సత్కారాలతో స్వాగతం పలికేవారు.

ప్రియప్రవక్త (సఅసం) మక్కా పట్టణంలో అక్కడి ప్రజలకు ఇస్లాం వైపు పిలుపునిస్తున్నారు. సత్యధర్మం పాటించమని కోరుతున్నారు. ఆ కాలంలో హజరత్ తుఫైల్ ఇబ్నె వదూసీ (రజి) మక్కా పట్టణానికి రావడమయింది. యథాప్రకారం మక్కావాసులు ఆయనకు స్వాగతం పలికారు. అతిథి సత్కారాలతో ఆదరించారు. ఆయన శ్రేయమే తమ ధ్యేయం అనే నమ్మకం కలుగజేశారు. ఒక హెచ్చరిక కూడ చేశారు: "సోదరా! మా మాట విను, జాగ్రత్తపడు. ముహమ్మద్ (సఅసం) అనే ఒక వ్యక్తి ఉన్నాడు. ఆయనతో కలువగూడదు సుమా! ఎంత మోసగించినా ఆయన (సఅసం) చెప్పే ఒక్క మాట కూడ వినవద్దు. విన్నావంటే చెడిపోతావు. ఆయన చెప్పే మాటల్లో అదేమి మంత్ర శక్తి ఉందోగాని, ఎవరైతే ఆయన మాటలు వింటారో వారు ఆయన (సఅసం) మనుషులైపోతారు. ఒక సోదరుని మరో సోదరునితో, భార్యను భర్తతో, తనయుని తండ్రితో తెగతెంపులు చేయడం ఆయనకు ఎడమ చేతి పని. ఆయన (సఅసం) మా పట్టణంలో కలవరం సృష్టించాడు. సాంప్రదాయకంగా మన సమాజంలో జరిగే పనులన్నీ ఛిన్నాభిన్నమయ్యాయి. చూడు మహాశయా! నీవు మా అతిథివి. మీ శ్రేయాన్ని ముందుంచుకొని ఉన్న మంచి చెడు అర్థమయ్యేట్లు చెప్పాం. ఇక ముందు మీ ఇష్టం" అని చెప్పారు.

హజరత్ తుఫైల్ ఇబ్నె వదూసీ (రజి) పట్టణానికి క్రొత్త. తెలిసిన వారేమో ఆయనకు ఉన్న పరిస్థితులు పూసగుచ్చినట్లు చెప్పారు. వారు చెప్పింది నిజమనే నమ్మారు హజరత్ తుఫైల్ ఇబ్నె వదూసీ (రజి). నాకేంపట్టిందని ఆయనగారితో కలువడానికి అని తలంచారు. అయినప్పటికీ ఎందుకైనా మంచిదని ఆయన చెప్పే మాటలు చెవిలో పడకుండా ఉండడానికి రెండు చెవులలో దూది పెట్టుకొన్నారు. ఎంత జాగ్రత్త తీసికొన్నా జరిగే పరిణామాలు మాత్రం దైవాధీనములు కదా! హజరత్ తుఫైల్ ఇబ్నె వదూసీ (రజి) తీసికొన్న జాగ్రత్తలు ఉపయోగపడలేదు. అకస్మాత్తుగ హజరత్ తుఫైల్ ఇబ్నె వదూసీ (రజి) కాబా దగ్గర నుండి వెళ్ళడం జరిగింది. అదే సమయంలో ప్రియప్రవక్త (సఅసం)

కాబాలో నమాజు చేస్తున్నారు. దివ్యగ్రంథ వాక్యాలు నమాజులో వల్లిస్తున్నారు. ఆ శబ్దం హజరత్ తుఫైల్ ఇబ్నె వదూసీ (రజి) చెవుల్లో పడింది. అక్కడే నిలబడ్డారు. దివ్యఖుర్ఆన్ వాక్యాలు ఆలకిస్తున్నారు. అందులో ఏదో తెలియని ఆకర్షణ ఆయన్ను ఆకట్టుకొంటూ వచ్చింది. ఆలోచనలో పడ్డారు. నేనెంత వెర్రివాణ్ణి. గ్రుడ్డిగా పరాయివారి మాటల్ని నమ్మాను. అపనమ్మకానికి ఆహుతి అయ్యాను. నేనొక పేరు మోసిన కవిని. బాగోగులను గ్రహించగలను. అందులోని సారాంశాన్ని పసిగట్టగలను. అలాంటప్పుడు ఆయన (సఅసం) పఠించే వాక్యాలను ఎందుకు వినరాదు, ఆయన (సఅసం)తో ఎందుకు సంప్రదించరాదు. ఆయన వినిపిస్తున్న వాక్యాలలో వాస్తవంగా ఏదైన మేలు ఉంటే హృదయపూర్వకంగ అంగీకరించాలి. నేనేమైనా అమాయకుణ్ణా ఆయన మాటలకు మోసపోవడానికి. ఇలా అంతర్మథనం చేసికొంటూ అక్కడే నిలిచారు. ప్రియప్రవక్త (సఅసం) దివ్యఖుర్ఆన్ వాక్యాలు పఠించేంత వరకు ఆయన అక్కడే ఉండి బహుధ్యానంతో పఠించబడింది విన్నారు. నమాజు ముగించుకొని ప్రియప్రవక్త (సఅసం) ఇంటికి వెళ్తున్నారు. హజరత్ తుఫైల్ ఇబ్నె వదూసీ (రజి) కూడ ఆయన వెనుకే నడచుకొంటూ వెళ్ళారు. ఇంటిని చేరి ఆయన (సఅసం)తో కలిశారు. మక్కా అధినేతలు ఆయనకు వినిపించిన విషయాలన్ని చెప్పారు. సవినయంగ అన్నారు: "వారి చెప్పుడు మాటలు విని మీరు పఠించే వాక్యాలు నా చెవుల్లో ఎక్కడ పడుతాయోనన్న భయంతో చెవుల్లో దూది పెట్టుకొన్నాను. చూడండి. ప్రజలు నన్ను సరాసరి మోసగించారు. అబద్ధం పలికారు. ఇదే కావ్యం మళ్ళీ నాకు వినిపించండి" అని అర్థించారు. ఆయన మాటలు విన్న ప్రియప్రవక్త (సఅసం) మొదట ఇస్లాంను గురించి చెప్పారు. ఆ పిమ్మట దివ్యఖుర్ఆన్ నుండి కొన్ని వాక్యాలు పఠించారు. హజరత్ తుఫైల్ ఇబ్నె వదూసీ (రజి) సమీపం నుండి దివ్యఖుర్ఆన్ ఆయతులను ఆలకించి ఆశ్చర్యపోయారు. ఆవేశాన్ని ఆపుకోలేక పోయారు. ఇలా అన్నారు: "దైవ సాక్షిగా చెబుతున్నా! వీటికి మించిన ఉద్గ్రంథ వాక్యాలు నేనెప్పుడూ వినలేదు. దీనికంటే ఉన్నతమైన ధర్మం నా దృష్టిలో పడలేదు. నేను సహృదయంతో ఈ సత్యధర్మాన్ని స్వీకరిస్తున్నా."

ఇస్లాం స్వీకరించి హజరత్ తుఫైల్ ఇబ్నె వదూసీ (రజి) సంతృప్తిపడలేదు, ప్రియప్రవక్త (సఅసం) వద్ద విన్నది కంఠస్థం చేశారు. మారుమారు వల్లె వేస్తూ వచ్చారు. యమన్ దేశానికి వావను వచ్చారు. వచ్చీరాగానే తండ్రిని కలుసుకొన్నారు. ఇస్లాం వైపు ఆహ్వానించారు. ఆయన ముస్లిం అయ్యారు. ఆయన సతీమణి కూడ ఇస్లాం సందేశం విని విశ్వాసవంతురాలయ్యారు. కుటుంబీకులు ముస్లింలయ్యాక వారందరూ సామూహికంగ 'దోస్' తెగవారికి ఇస్లాం అంటే ఏమిటో, సత్యధర్మమంటే ఏమిటో తెలియజేశారు. కాని అనుకొన్నదంతా వాస్తవమవుతుందా! ఆయన తెగవారు హజరత్ తుఫైల్ ఇబ్నె వదూసీ (రజి) ఇచ్చిన పిలుపు త్రోసిపుచ్చారు. మళ్ళీ హజరత్ తుఫైల్ ఇబ్నె వదూసీ (రజి) మక్కా వెళ్ళారు. ప్రియప్రవక్త (సఅసం)తో కలిశారు. తమ తెగవారి విషయంలో అల్లాహ్‌ను ప్రార్థించమని కోరారు. ప్రియప్రవక్త (సఅసం), "దోస్ తెగవారికి ఇస్లాం మహాభాగ్యాన్ని స్వీకరించే హితవునివ్వు, వారిపై నీ కరుణను ప్రసాదించుమ"న్నారు. ఈ 'దుఆ' చేశాక హజరత్ తుఫైల్ ఇబ్నె వదూసీ (రజి)తో అన్నారు: "నాయనా! మిక్కిలి మృదుస్వభావంతో మధురమైన మాటలతో ఇస్లాం వైపు ప్రజలను పిలువు."

మృదుమధురంగ ప్రజలనాహ్వానించమని చెప్పడానికి కారణం హజరత్ తుఫైల్ ఇబ్నె వదూసీ (రజి) తమ తెగవారిలోని ధనవంతులకు, ఐశ్వర్యవంతులకు ఆజ్ఞలిచ్చి మాట్లాడేవారు. హజరత్ తుఫైల్ ఇబ్నె వదూసీ (రజి) స్వస్థలానికి తిరిగి వచ్చారు. ప్రియప్రవక్త (సఅసం) ఇచ్చిన హితవు ప్రకారం పరిస్థితులను పరిశీలించి, ప్రజల మనస్తత్వం గుర్తించి ఏ వ్యక్తిని ఇస్లాం వైపు పిలువాలో ఆ వ్యక్తికి హితోపదేశం చేసేవారు. ఆ వ్యక్తి ముస్లిం అయ్యేవాడు. కొన్ని దినములలోనే తన 'దూస్' తెగవారిలో అనేకులు ముస్లింలయ్యారు.

హజరత్ తుఫైల్ ఇబ్నె వదూసీ (రజి) ఇస్లాం ప్రచారం చక్కగ చేసేవారు. మక్కా వెళ్ళి ప్రియప్రవక్త(సఅసం)తో తరచూ కలిసేవారు. మక్కాలో ఉన్న పరిస్థితులను గమనించేవారు. అక్కడ ఇస్లామి ఉద్యమం ఎదుర్కొంటున్న కష్టాలను కూడా వినేవారు. విశ్వాసవంతులపై దౌర్జన్యకాండ భరించనలవికాకుండా ఉంది. కాని హజరత్ తుఫైల్ ఇబ్నె వదూసీ (రజి) పరిస్థితులు బాగుగా ఉండేవి.

ఆయన అధీనంలో బహు పటిష్టమైన ఒక కోట ఉండేది. 'దోస్' లాంటి బలమైన తెగవారు ఇస్లాంను స్వీకరించారు. అందువల్ల వారికి కష్టాలులేవు, రక్షణకు కొదువలేదు. హజరత్ తుఫైల్ ఇబ్నె వదూసీ (రజి) ప్రియప్రవక్త (సఅసం)ను యమన్ రావలసిందిగా ఆహ్వానించారు. అక్కడ అన్ని సౌకర్యాలు తృప్తికరంగా ఉంటాయని కూడా చెప్పారు. కాని ప్రవక్త (సఅసం) మక్కా వదలిపోవడానికి అల్లాహ్ ఆజ్ఞ కోసం ఎదురుచూస్తున్నారు. అందుచేత యమన్ వైపు వెళ్ళడానికి ఒప్పుకోలేదు. హజరత్ తుఫైల్ ఇబ్నె వదూసీ (రజి)ను స్వదేశం వెళ్ళి తన తెగలో మిగలి ఉన్న వారికి ఇస్లాం వైపు ఆహ్వానమివ్వండని సెలవిచ్చారు.

హజరత్ తుఫైల్ ఇబ్నె వదూసీ (రజి) మళ్ళీ యమన్ వెళ్ళారు. ఇస్లాం ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఆయన చూపిన చొరవ వల్ల, ఆయనకు ఉన్న పలుకుబడి వల్ల చాలా మంది జనులు ముస్లింలయ్యారు. ప్రియప్రవక్త (సఅసం) మక్కా నుండి మదీన వలసపొయ్యారని తెలియగానే వదూసి (రజి), 'దూస్' తెగవారు తమ కుటుంబాలతో సహా మదీన వెళ్ళారు. మదీన చేరగానే, ప్రియప్రవక్త (సఅసం) ఖైబరుపై యుద్ధానికి వెళ్ళారని తెలిసింది. వచ్చిన వారందరూ ఖైబరు వెళ్ళారు. అక్కడికి వెళ్ళి ప్రియప్రవక్త (సఅసం)ను కలిశారు. వలస వచ్చిన వారిలోని యువకిషోరములకు ఆ యుద్ధ కీలక ప్రాంతంలో ఒక స్థావరం ఏర్పాటు చేశారు. వచ్చిన దూస్ తెగవారు ఇస్లాం కోసం ప్రాణాలర్పింప సిద్ధపడ్డారు. ప్రియప్రవక్త (సఅసం)కు వారి పట్ల సంతృప్తి కలిగింది. ఇక ఖైబరు విజయానంతరం వారందరు మదీన వచ్చారు. అక్కడే నివాసం ఏర్పరచుకొన్నారు. ప్రియప్రవక్త (సఅసం) సేవలో గడిపారు. ఇస్లాం ప్రసాదించే ఉన్నత విద్య నభ్యసించారు. దైవమార్గంలో ప్రాణార్పణ కోసం ఎంతో ఆశ పెట్టుకొన్నారు. ప్రియప్రవక్త (సఅసం) పరమపదించాక, హజరత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) కాలంలో ఈ కోరిక నెరవేరింది. యమన్ యుద్ధంలో హజరత్ తుఫైల్ ఇబ్నె వదూసీ (రజి) వీరస్వర్గం చేరారు.

విశ్వాస వచన పఠనానంతరం ముస్లిం అయ్యారు. విశ్వాస వచన ఉన్నతికై దైవమార్గంలో పోరాడుతూ అమరవీరులయ్యారు. **(ఇన్నాలిల్లాహివ ఇన్నఇలైహి రాజివూన్).**

హజరత్ బిలాల్ (రజిఅల్లాహు అన్హు)

"ఇన్న అక్రమకుమ్ ఇందల్లాహి అత్ఖాకుమ్."

"నిశ్చయంగ దైవ సాన్నిధ్యంలో అందరికన్నా అధిక గౌరవమర్యాదలు కలవారు మీలో అధిక దైవభయం కలవారే."

సర్వసాధారణంగ ఎవరైతే అందరికన్నా అధికంగ చదువుకొన్నారో, వారు వంశం, వర్ణం బట్టి అగ్రశ్రేణికి చెందినవారుగా చలామణి అవుతారు. సిరి సంపదలలో అందరికంటే అధిక ధనం కలవారు. అధికారంలో, హోదాలో ఉన్నత స్థానం కలవారు ప్రపంచంలో అధికులనబడుతారు. అధికారం కలవాడు తన హస్తగతమైన చట్ట బలంతో బలహీనులను అధీనంలో తీసికొని తన ఇష్టప్రకారం వాడుకొంటాడు. బలహీనులు అందుకు నిరాకరించారంటే వారి నామరూపాలు లేకుండా చేస్తాడు బలవంతుడు. కాని ఇస్లాం న్యాయపరమైన ధర్మం. ఈ ధర్మంలో విద్యాధిక్యత, ధనం, జాతి, వంశం, రంగు, రూపం, హోదా, అధికారం, ప్రపంచవాసుల పొగడ్త, ప్రతిష్టకు కాదు గొప్ప తనం. "ఇస్లాం దృష్టిలో మీలో అత్యధిక గౌరవ మర్యాదలు కలవారు ఎవరంటే, ఎవరైతే దైవం పట్ల అధిక భయం కలిగి ఉంటారో వారే." దైవం పట్ల అధిక భయం కలవారంటే దైవం పట్ల అవిధేయత అంటే భయపడేవారు. అటువంటి వ్యక్తి దైవ ప్రసన్నత పొందదానికి చెడు పనుల నుండి దూరమవుతాడు. మంచి పనులను మనసార నిర్వహిస్తాడు. ఇస్లాం ఇలాంటి వ్యక్తుల్ని తయారు చేస్తుంది. వినయ విధేయతలతో దైవ భయంకల సొసైటీని స్థాపిస్తుంది. ఈ సముదాయం మానవాళికి ఆదర్శవంతమవుతుంది. ఇలాంటి సమాజంలోనివారు త్రికరణ శుద్ధిగా, ఇస్లాం కోసం ప్రాణత్యాగం చేయడానికి సిద్ధమై ధర్మసంస్థాపనకు పూనుకొంటారు, ఈ సమాజంలో చదువురాని వారున్నారు, ఉన్నత వంశం కులానికి చెందినవారు న్నారు. రూప సౌందర్యాలులేనివారున్నారు. లేమినను భవించేవారున్నారు. హోదాలు లేనివారున్నారు. అధికార బలం ఏ రూపంలోనూ

లేనివారు కూడా ఉన్నారు. కాని వారందరు దైవధర్మ పరాయణులు, అల్లాహ్‌కు భయపడేవారు. ఈ ఒక్క గుణం వలన వారు భూలోక తారలవుతారు. ఇస్లాం సమర్పించే గౌరవోన్నతులు కలవారవుతారు. ఇలాంటి అగ్రశ్రేణి గౌరవోన్నతులందుకొన్న వారిలో హజరత్ బిలాల్ (రజి) ఆదర్శవంతంగా ఉన్నారు. ఆయన జీవిత చరిత్ర సంక్షిప్తంగా సమర్పిస్తున్నాం. అల్లాహ్, ఆయన ప్రవక్త (సఅసం)పట్ల విశ్వాసం ప్రకటించిన ఇలాంటి ఆదర్శమూర్తులు ఇస్లాం సమాజాన్ని ఏర్పాటు చేశారు. ఇస్లామి దృక్పథాన్ని ప్రజలకు ఆచరణాత్మకంగ తెలియజేశారు. వారి అడుగుజాడల్లో నడచుకోదలచిన మనకు హజరత్ బిలాల్ (రజి) జీవిత చరిత్ర గుణపాఠం నేర్పుతుంది. మానవత్వం పట్ల ఆదరణ చూపేవారికి హజరత్ బిలాల్ (రజి) జీవితం వెలుగుబాటనిస్తుంది.

హజరత్ బిలాల్ (రజి) నల్లటి వర్ణం కలవారు. నీగ్రో జాతికి చెందినవారు. ధనం, హోదా, అధికారం ఏమీ లేనివారు. ఒక బానిసగా జీవితం గడిపేవారు. సమాజంలో బానిసకు స్థానమెక్కడ ఉంది? బానిస బ్రతుకు హీనం. వంట చెరుకుల్లా, పశువుల్లా, కూరగాయల్లా బానిసలు బజారులో విక్రయించబడేవారు. జంతువైనా పరుగెత్తిపోవచ్చు. కాని బానిస తప్పించుకొనిపోవడం కూడా దుస్సాధ్యం. ఎక్కడికి వెళ్ళినా పట్టుకోబడతాడు. యజమానికి అప్పగించబడతాడు. లేకుంటే నడి బజారులో మళ్ళీ విక్రయించబడతాడు. క్రయదారుడు దయా దాక్షిణ్యం చూపకుండా బానిసతో ఏ పని కావాలంటే ఆ పని చేయించుకొంటాడు.

హజరత్ బిలాల్ (రజి) ఒక బానిసగ మక్కా పట్టణంలో జీవితం గడుపుతున్నారు. దేవుడు ఒక్కడే. అందరికీ ఆరాధ్యుడు ఆయనే అనే నినాదం విన్నారు. మానవుణ్ణి బానిస బంధనం నుండి విముక్తిపరుస్తూ జీవితం సఫలం అయ్యేలా చేయడానికి మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇస్లామి ఉద్యమం నడుపుతున్నారు. దాస్యం అల్లాహ్‌కే చెల్లుతుంది. ఆయనే అందరినీ సృష్టించాడు, పోషిస్తున్నాడు కూడ. మన అవసరాలన్నిటిని ఆయనే తీరుస్తున్నాడు. అందుచేత మన నిజస్వామి ఆయనే. అల్లాహ్ ఇష్టప్రకారం ఉన్న విషయమే నిత్యసత్యం. మన కోరికలు

అల్లాహ్ ఇష్టప్రకారం ఉంటే అవి చెల్లుతాయి. లేకుంటే అవి చెల్లవు. వంశ పారంపర్యంగా వస్తున్న వ్యవహారాలు, సంప్రదాయాలు అల్లాహ్ ఆజ్ఞలకు అనుగుణంగా ఉన్నట్లయితే అవి సవ్యమని, పాటించదగ్గవని సమర్థించ బడుతాయి. అల్లాహ్ ఆజ్ఞలకు వ్యతిరేకమయినవయినట్లయితే అవి ప్రాణకంటకమవుతాయి. మానవునిపై మానవుడు చలాయించే ఆజ్ఞలు దైవాజ్ఞ ప్రకారం ఉంటే అవి చెల్లుబాటు అవుతాయి. లేకపోతే అట్టి ఆజ్ఞ దౌర్జన్యం అనబడుతుంది.

మహాప్రవక్త (సఅసం) ప్రవచించే ఈ మాటలు సాధారణ వ్యక్తికి అర్థ మవుతూ వచ్చాయి. ఈ మాటలు పరమ సత్యమని, స్వాభావికమైనవని ప్రతి చిన్న, పెద్ద గమనిస్తూ వచ్చాడు. తెల్ల, నల్ల జాతి వారు ఈ సందేశాన్ని అర్థం చేసుకొన్నారు. నిరుపేద, ఐశ్వర్యవంతుడు ఈ ధర్మాన్ని జీర్ణించుకొన్నారు. తనవారు, పరాయివారు కూడ అర్థం చేసుకొన్నారు. యజమాని, బానిస కూడా స్పష్టంగా తెలుసుకొన్నారు. కాని విన్న సందేశాన్ని పాటించిందెవరు? మనిషిని మానవునిగ చూసేవారు, మనిషిని మానవునికి దాసునిగా ఉండడం చూస్తూ కుమిలిపోయేవారు, మానవత్వంతో నిండిన మనసులు కలవారు, దయార్ద్ర హృదయులు దైవ ఏకత్వపు పలుకులు విన్నారు. ఏక కంఠంతో వారందరు ముహమ్మద్ (సఅసం) చెప్పేదంతా నిజమని ఒప్పుకున్నారు. ఆయన ఉపదేశం దైవసందేశమని నిర్ధారించుకొన్నారు. కాని ఎవరయితే పెట్టుబడిదారీ విధానం అవలంబించారో, నిరుపేదల, నిస్సహాయుల రక్తాన్ని పీల్చేందుకు అలవాటు పడ్డారో, తామే సర్వం అని అహంభావంతో మెలిగారో, యాజమాన్యపు అధికారం చలాయించేవారో, ఈ సత్యప్రబోధనలను భరించలేకపోయారు. వారందరికి ఒక విషయం క్షుణ్ణంగ అర్థమయింది. ముహమ్మద్ (సఅసం) నడిపే ఈ ఒకే దేవుడన్న ఉద్యమం వేర్లూనిందంటే, ఒక సత్సమాజం ఏర్పడిందంటే ఇక వారి అట్టహాసం సద్దు మణుగుతుంది. బలహీనులపై దౌర్జన్యం అంతమవుతుంది. రాక్షసత్వం పరుగులు తీస్తుంది. అందుచేత ఇస్లామి ఉద్యమ వ్యతిరేక శక్తులు

తమ ఆర్థిక బలాన్ని ఉపయోగిస్తూ, ఇస్లామి ఉద్యమాన్ని అణిచి వేయడానికి అండబలంతో, అధికార బలంతో నడుంకట్టారు. ప్రయత్నాలు సాగించారు. ఈ ఉద్యమంలో చేరి ఎవరైనా ఏక దైవారాధన కోసం ప్రయత్నం చేస్తే, ఈ నినాదంతో ఏకీభవిస్తే వాణ్ణి భయపెట్టే వారు, కఠిన శిక్షలతో హెచ్చరించేవారు, కొట్టేవారు, తిట్టేవారు, ఖైదీలుగా చేసి క్షుద్బాధతో అలమటింపజేసేవారు. వాటన్నిటికి లోనుకాకుండా పోతే లాలూచి చూపించేవారు. ఒకే కుటుంబ సభ్యులు కూడ పరస్పరం ఘర్షించుకునేవారు. తండ్రి తనయుణ్ణి మందలించేవాడు. క్రొత్త ధర్మపు దరిదాపులకు కూడా పోకూడదనేవాడు. అన్న తమ్మునికి హెచ్చరిక చేసేవాడు. ఆత్మీయులను ఇస్లాం నుండి దూరం చేయడానికి ప్రయత్నం సాగేది. పిన తండ్రి తన సోదర కుమారుని ఆపేవాడు. యజమాని స్వంత బానిసకు ఇస్లాం గాలిసోకకుండా చేసేవాడు. వేయేల సమాజంలోని తలబిరుసుతనం కలవారందరూ ఇస్లాం అవగాహన చేసుకొన్నవారిని ఆ జీవిత విధానం నుండి దూరం చేయడానికి నానా విధాల ప్రయత్నాలు చేసేవారు. కుటుంబీకుల మధ్య ఆప్యాయతలు ఉంటాయి. తండ్రికి కొడుకులపై, అన్నకు తమ్మునిపై, పిన తండ్రికి అన్న కుమారునిపై దయాదాక్షిణ్యాలుంటాయి. వారిని శిక్షించాలంటే కఠినంగా వ్యవహరించలేరు. కాని బానిసను శిక్షించడానికి యజమానికి ఏ కనికరం అడ్డు వస్తుందని, అక్కడ ఆ ప్రశ్నేలేదు. నా గులాం, నాకు విధేయుడుగ ఉండడానికి బదులు నన్నే ధిక్కరిస్తాడా! ఈ దృక్పథం వల్ల బానిసల జీవితాలు మరింత దుర్భరమయ్యాయి. వారిపై అడ్డులేని దౌర్జన్యం జరుగుతూ వచ్చింది. కోపం తీర్చుకోవడానికి యజమానులు బానిసలపై మండిపడేవారు. వారిపై తమ పగ తీర్చుకొనేవారు. ఇష్టమొచ్చిన శిక్షలనిచ్చి వేధించేవారు.

కాని అల్లాహ్ నిర్ణయం ఎవరికి తెలుసు. ఆయన తలచింది తప్పక అవుతుంది. మక్కా పట్టణంలో ఉన్న బానిసలలో హజరత్ బిలాల్(రజి) ఒకరు. ఆయనపై జరిగిన దౌర్జన్యం అంత ఇంత అని చెప్పనలవికాదు. ఉమయ్యా బిన్ ఖలఫ్ దగ్గర బానిసగ ఉన్నారు హజరత్ బిలాల్ (రజి). ఒకే దేవుడన్న నినాదం,

ప్రియప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఆణిముత్యాల్లాంటి పలుకులు హజరత్ బిలాల్ (రజి) హృదయంలో హత్తుకొనిపోయాయి. ఒక్క క్షణం కూడా వేచి చూడక ***"అష్హదు అన్ లా ఇలాహ ఇల్లల్లాహు వ అష్హదు అన్న ముహమ్మదుర్ రసూలుల్లాహ్"*** అని విశ్వాస వచనం పలికారు. "అల్లాహ్ తప్ప ఇతర ఆరాధ్య దైవం లేదని నేను విశ్వసిస్తున్నా. హజరత్ ముహమ్మద్ (సఅసం) అల్లాహ్ ప్రవక్త అని విశ్వసిస్తున్నా"నని అన్నారు. ఒక గులాం, తనను వదిలేసి మరొకరిని ఆరాధ్యదైవంగా విశ్వసిస్తే ఉమయ్య బిన్ ఖలఫ్ ఆ బానిసను భరించగలడా? ఇక బిలాల్ (రజి) ప్రాణాలకు ముప్పు వచ్చింది. దేవుడే ఆయన్ను సంరక్షించుగాక! అప్పటి నుండి హజరత్ బిలాల్ (రజి)కు ఎన్నో కష్టాలు కలిగాయి. విపరీత శిక్షలు పడ్డాయి. వాటిని తలుస్తే చాలు, దేహం కంపించిపోతుంది. ఇస్లాం శత్రువులు మండుటెండల్లో కాలే ఇసుక తిన్నెలపై చురకలు పెట్టే రాళ్ళపై, ఇంకా కాలే నిప్పులపై హజరత్ బిలాల్ (రజి)ని పడేసేవారు. మెడలో తాడుకట్టి అల్లరిమూకలకిచ్చేవారు. వారు హజరత్ బిలాల్ (రజి)ని మెడలో వేసిన తాడు గొంతుకు ఉరిలా ఊపిరాడకుండా వేసి ఈడ్చుకొని పోయేవారు. ఇంకా ఉమయ్య బిన్ ఖలఫ్ ఏం చేసేవాడో తెలుసా? పైబడిన బాధలన్నిటిని సహిస్తూ హజరత్ బిలాల్ (రజి), **"అహద్, అహద్"** (దేవుడు ఒక్కడే, దేవుడు ఒక్కడే) అని పలికేవారు. రెచ్చిపోయిన యజమాని అగ్ని గుండంలా తపించే గులకరాళ్ళపై, పాషాణాలపై పరుండ బెట్టి ఎదపై బరువైన రాళ్ళు పెట్టేవాడు. ఇంకా మండిపోయే ఇసుక మైదానంలో పడేసేవాడు. మిట్ట మధ్యాహ్నం హజరత్ బిలాల్ (రజి) బాధల వల్ల దాదాపు నిర్జీవమైపోయేవారు. ఆ సమయంలో దౌర్జన్యం చలాయిస్తూ "ఓ బిలాల్! ఇప్పుడయినా ముహమ్మద్ (సఅసం) చెప్పే దేవుణ్ణి మానుకో" అని మందలించేవాడు. కాని ఎవరి హృదయంలో ఏకేశ్వరోపాసన గూడుకట్టుకుందో అతని మనోస్థయిర్యం గురించి ఎవరు ఊహించగలరు. పెట్టిన బాధలు ఏవైనాసరే హజరత్ బిలాల్ (రజి) నోట వెలువడేది ఒకే మాట, **"అహద్, అహద్"** (దేవుడొక్కడే, దేవుడొక్కడే). ఉమయ్య బిన్ ఖలఫ్ బాగా రెచ్చిపోయేవాడు. మరో విపరీత శిక్ష కోసం అన్వేషణ ప్రారంభించేవాడు. ఒకప్పుడు పశువు చర్మంలో

చుట్టి పడేసేవాడు. మరొకప్పుడు ఇనుప అంగరక్షను తొడిగించి భగ్గుభగ్గుమని మండే ఎండల్లో పడేసేవాడు. ఇంకా పగ తీరకపోగా కొరడాతో కొట్టేవాడు. "నీ దైవం లాత్, ఉజ్జా" (ముష్రికుల విగ్రహాలు) అనేవాడు. కాని దైవ ఏకత్వ సిద్ధాంతాన్ని అనుసరించిన ఆ సర్దారు 'అహద్' అనే పదం తప్ప మరే పదాన్నీ పలికేవారుకారు.

హజరత్ బిలాల్ (రజి) పై పడుతున్న బాధల్ని చూసి పాషాణాలు కూడ కరిగిపోతాయి. మక్కాలోని ముష్రికులు (బహు దైవారాధకులు) కూడా వచ్చి హజరత్ బిలాల్ (రజి) పట్ల కనికరం చూపుతూ, "ఓ బిలాల్! నీవు కేవలం మా మాటలను వల్లె వేయి. నీ కోసం సిఫారసు చేస్తాం" అని అన్నారు. కాని బిలాల్ (రజి) ఇలా జవాబిచ్చారు, "నా నాలుక ఆ మాటలను పలుకదు." చివరకు నచ్చజెప్పడానికి వచ్చినవారు అలసి వెళ్ళిపోయేవారు. ఉమయ్యా బిన్ ఖలఫ్ శిక్షలు వేయడంలో అలసిపోవడం లేదు. వాటిని అనుభవిస్తూ హజరత్ బిలాల్ (రజి) సమసిపోవడం లేదు. దౌర్జన్యం చేస్తున్న యజమాని తత్వం మారడం లేదు. బాధలు పడుతున్న విశ్వాసి నిశ్చయం లేశమంతయినా తగ్గుముఖం చూపడం లేదు.

ఉమయ్యా బిన్ ఖలఫ్ పెట్టే భట్టీలో హజరత్ బిలాల్ (రజి) కాగిన ఇనుములా రాటుదేలారు. చూసేవారికి ఆయన స్వచ్ఛమైన బంగారంలా కనబడ్డారు. ఇక అల్లాహ్ పెట్టే పరీక్షా సమయం పూర్తయింది. హజరత్ అబూబకర్ (రజి) మక్కా పట్టణంలోని పౌరులలోకెల్లా దయార్ద్రహృదయులు. ఐశ్వర్యవంతులు కూడ. కాని మనస్తత్వం పెట్టుబడిదారులది కాదు. అప్పటికే ఆయన ముస్లిం అయ్యారు. తన దారిన వెళ్తూ వెళ్తూ, **"అహద్, అహద్"** అనే పదాలు విన్నారు. వెళ్ళి చూశారు. ఏముంది, హజరత్ బిలాల్ (రజి) ఉమయ్యా బిన్ ఖలఫ్ ఇచ్చే బాధలతో మూలుగుతున్నారు. ఒక పెద్ద మొత్తం చెల్లించారు, హజరత్ బిలాల్ (రజి) ను బానిస బంధనాల నుండి విముక్తిపరిచారు. ఈ విషయం హజరత్ ముహమ్మద్ రసూలుల్లాహ్‌కు తెలియపరిచాక ఇలా అన్నారు: 'ఓ అబూబకర్

(రజి)! నన్ను కూడా ఈ శుభకార్యంలో చేర్చుకో." హజరత్ అబూబకర్ (రజి) ఇలా సమర్పించుకొన్నారు. "ఓ ప్రవక్త (సఅసం)! నేను హజరత్ బిలాల్ (రజి) కు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ప్రసాదించాను" అన్నారు.

బానిసత్వం నుండి స్వేచ్ఛ పొందారంటే ఇక హజరత్ బిలాల్ (రజి) ఏ బాధ పడనవసరం లేదు. ఒక బానిసగ ఉంటూ ఉమయ్యా బిన్ ఖలఫ్ ఇచ్చే దౌర్జన్యాల నుంచి బయటపడ్డారేకాని మక్కా ముష్రికులు ముకుమ్మడిగా ముస్లింలపై చేసే దౌర్జన్యాలు ఉండనే ఉన్నాయి. ముష్రిక్ సమాజం హజరత్ బిలాల్ (రజి)పై దౌర్జన్యం సాగించ ప్రారంభించింది. ఇక ముస్లింలను మదీన వలన పోవలసిందిగా ఆదేశించినప్పుడు ముస్లింల బాధలకు అంతం కనబడింది. వలస ఆజ్ఞ ఇవ్వబడింది. ఇస్లామి ఉద్యమ సిపాయిలు స్వంత ఇంటిని, స్వస్థలాన్ని, ధనధాన్యాదులను వదలి కేవలం అల్లాహ్ ప్రీతి కోసం మదీన చేరుకున్నారు.

మదీన చేరిన తరువాత ప్రియప్రవక్త ముహమ్మద్ (సఅసం) హజరత్ బిలాల్ (రజి)కు సోదర సంబంధం అబూ రవేహ్ అబ్దుల్లా బిన్ అబ్దుర్ రహమాన్ అన్సారి (రజి)తో కల్పించారు. వీరిరువురు స్వంత సోదరులకంటే ఆత్మీయంగ ప్రేమ సౌభ్రాతృత్వంతో కలసిమెలసి ఉండనారంభించారు. హజరత్ ఉమర్ ఫారూఖ్ (రజి) ఖలీఫాగా ఉన్న సమయంలో సిరియా దేశ దండయాత్రలో పాల్గొనడానికి వెళ్తున్నప్పుడు "మీ పెన్షన్ ఎవరికివ్వాలి" అని అడిగారు ఖలీఫా. వెంటనే హజరత్ బిలాల్ (రజి) జవాబిచ్చారు: "అబూ రవేహ్‌కు ఇవ్వండి. ఎందుచేతనంటే ప్రియప్రవక్త (సఅసం) మా ఇద్దరి మధ్య కల్గించిన సోదర బంధం ఎన్నటికీ ఎడతెగని అనుబంధం."

మదీన పట్టణంలో ప్రియప్రవక్త (సఅసం) ఒక మసీదు నిర్మించారు. ఆ మసీదులో ప్రతి దినం వేళకు సరిగా ఐదు పూటల నమాజు చేయడం ప్రారంభించారు. **"అజాన్"** (నమాజు పిలుపు) ఇవ్వడానికి ఏ వ్యక్తి మక్కా ముష్రికుల చేతుల్లో హింసించబడుతూ, "బహుదైవారాధకుల వచనం పలుక నోరాడడం లేదని" జవాబిచ్చారో ఆయనే ఎన్నుకోబడ్డారు. ప్రియప్రవక్త (సఅసం)

హజరత్ బిలాల్ (రజి)ను అజాన్ ఇచ్చే ప్రత్యేక **"ముఅజ్జిన్"**గా నియమించారు. ఆ ముఅజ్జిన్ కంఠం మధురభరితం. వీనులకు విందు కల్పించే స్వరంతో అజాన్ ఇచ్చే మహాభాగ్యం అల్లాహ్ ఆయనకు ప్రసాదించాడు. హజరత్ బిలాల్ (రజి) ఇచ్చే అజాన్ విన్నతోడనే అల్లాహ్ ఆరాధన కోసం విశ్వాసులు తండోప తండాలుగా మసీదు వైపు వచ్చేవారు. ఆరాధనకు అజాన్ ఉత్సుకత కల్పించేది. ఆరాధకులు నమాజు చేయడానికి ఆసక్తితో మసీదు చేరేవారు. శ్రామికులు, వ్యాపారస్థులు పనులు ఆపేసేవారు, మహిళలు నమాజుకు సిద్ధపడేవారు. ఆట పాటలు ఆపి బాలబాలికలు నమాజు కోసం ఏకోన్ముఖులయ్యేవారు. అందరూ బారులు తీర్చి నిలబడేవారు. నమాజు సామూహికంగా చేసేవారు.

హజరత్ బిలాల్ (రజి) కేవలం ప్రియప్రవక్త (సఅసం) నియమించిన ముఅజ్జిన్ మాత్రమే కాదు. ఆయన ప్రియప్రవక్త(సఅసం)కు రహస్యాధికారిగా పని చేసేవారు. ఎప్పుడూ ఆయన (సఅసం) వెంటనే ఉండేవారు. ఆయన (సఅసం) ఎక్కడికయినా పర్యటనకు వెళ్ళినప్పుడు కూడా ఆయన (సఅసం)తోపాటు వెళ్ళేవారు. చేత బల్లెం పూని ప్రియప్రవక్త(సఅసం)కు ముందు నడిచేవారు. మక్కా విజయానంతరం మహాప్రవక్త (సఅసం) కాబాలో ప్రవేశించగా ఆయన (సఅసం) వెంట పవిత్ర కాబా గృహంలో వచ్చే అదృష్టం హజరత్ బిలాల్ (రజి)ను వరించింది. మహాప్రవక్త (సఅసం) గృహపనుల నిర్వహణ హజరత్ బిలాల్ (రజి) భుజస్కంధాలపై ఉండేది. అన్ని మహా యుద్ధాలలో ఆయన పాల్గొన్నారు. బదరు మహా సంగ్రామంలో ఇస్లాంకు బద్ధ విరోధి అయిన ఉమయ్యా బిన్ ఖలఫ్‌ను అంతమొందించే అవకాశం హజరత్ బిలాల్ (రజి)కే చేజిక్కింది. హజరత్ బిలాల్ (రజి) జీవితాంతం వరకు ప్రియప్రవక్త (సఅసం) అడుగు జాడల్లోనే జీవితం గడిపేవారు. ఇస్లామి సామాజిక వ్యవస్థ రూపకల్పన చేయడంలో అరబ్బు సర్దారులకు దొరకని భాగ్యం హజరత్ బిలాల్ (రజి)కే లభించింది. కుల వంశగౌరవ ప్రతిష్టలుగల అరబ్బులు అనేకులు హజరత్ బిలాల్ (రజి)తో సంబంధం కలిగి ఉండాలన్న కోరిక కలిగి ఉండేవారు. బనీ

జహర్ వంశంలోని హజరత్ అబూదర్దా (రజి) కుటుంబంతో ఆయన సంబంధం ఏర్పడింది. ఈయన వివాహం హజరత్ అబూ బకర్ (రజి) గారి పుత్రికతో ప్రియప్రవక్త (సఅసం) చేయించారు. ఆ వంశీయులందరూ హజరత్ బిలాల్ (రజి)గారితో వైవాహిక సంబంధం కలిగి ఉండడం పట్ల గర్వపడేవారు కూడా. హజరత్ బిలాల్ (రజి) వంశం, వర్ణం వల్ల నీగ్రో జాతికి చెందిన వారు. సామాజిక స్థాయి విషయానికొస్తే ఆయనొక బానిసగ లేమిననుభవించేవారు.

హజరత్ బిలాల్ (రజి) దైవారాధన విషయంలో మహాతపస్వి. ఆ ఆధ్యాత్మిక ఆనందం మరొకరికి అబ్బింది కాదు. ప్రియప్రవక్త (సఅసం)కు విధేయత కలిగి ఉండడంలో ఆయనకు ఎనలేని ప్రీతి కలిగేది. ప్రియప్రవక్త (సఅసం) కూడ ఆయన పట్ల అమూల్యమైన ప్రేమ కలిగి ఉండేవారు. ప్రియప్రవక్త (సఅసం) అంటే ప్రాణాలర్పించేవారు. ఆయన (సఅసం) ఇచ్చిన ఏ ఆజ్ఞనూ జవదాటే వారుకారు. ఒకసారి ప్రియప్రవక్త (సఅసం) మరికొందరితోపాటు ప్రయాణంలో ఉన్నారు. రాత్రి సమయం అయింది. హజరత్ బిలాల్ (రజి)కు ఆ స్థలం నచ్చింది. "ఇక్కడే బస చేసినట్లయితే బాగుంటుందని" విన్నవించు కొన్నారు. "రాత్రి సమయం నిద్ర మాకెక్కడైనా మరుపు కల్గిస్తుందేమో" అని సెలవిచ్చారు మహాప్రవక్త(సఅసం). హజరత్ బిలాల్ (రజి) రాత్రంతా మెలకువతో ఉంటాననే ధీమా ప్రకటించారు. వెంటవున్న వారందరిని సమయానికి సరిగ్గా నిద్రలేపుతానని అన్నారు. ఆ మాటపై అందరూ అక్కడే బస చేశారు. హజరత్ బిలాల్ (రజి) రాత్రంత మెలకువతోనే ఉండాలని నిశ్చయించుకొన్నారు. అల్లాహ్ స్తుతిలో నిమగ్నులయ్యారు. కాని నిద్ర వచ్చింది. పడుకొన్నారు. ప్రియప్రవక్త (సఅసం) కేక వేయగా లేచారు. "ఓ బిలాల్! మీరు తీసికొన్న బాధ్యత ఏమైంది?" "ఓ ప్రియప్రవక్త (సఅసం)! ఇలాంటి నిర్లక్ష్యం నేనెప్పుడూ చేయలేదు" అని అన్నారు హజరత్ బిలాల్ (రజి). నిశ్చయంగా అల్లాహ్ తలచినప్పుడు మన ఆత్మలను వశపరచుకొంటాడు. తాను తలచినప్పుడు మరలిస్తాడు. "ఇక లెండి, అజాన్ ఇవ్వండి. అందరినీ నమాజు కోసం సమీకరించండి" అన్నారు ప్రవక్త (సఅసం).

ఇలా ప్రియప్రవక్త (సఅసం) వెంట ఉంటూ హజరత్ బిలాల్ (రజి) జీవితం గడిపారు. ఎంతో ఆప్యాయతతో ఆయన్ను పలుకరించేవారు ప్రియప్రవక్త (సఅసం). అలాగే మొదటి ఖలీఫా హజరత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) కూడ హజరత్ బిలాల్ (రజి)ను వదలి ఉండేవారుకారు. ఒక దినం మాట్లాడుతూ హజరత్ బిలాల్ (రజి) ఖలీఫాతో, "దైవమార్గంలో జిహాద్ చెయ్యడం, ఒక విశ్వాసి ఉత్తమోత్తమ పని" అని చెప్పడం నేను ప్రియప్రవక్త (సఅసం) నుండి విన్నాను. అందుచేత మరణించేంత వరకు ఈ పని నిర్వహణలో నిమగ్నమై ఉండాలని ఉంది" (అంటే ఏదైనా ఉద్యమంపై నన్ను వెళ్ళనివ్వు) అన్నారు. హజరత్ అబూ బకర్ (రజి) ప్రత్యుత్తరమిస్తూ, "ఓ బిలాల్ (రజి)! నా సాక్షిగా, దైవ సాక్షిగా పలుకుతున్నా, నా వృద్ధాప్యంలో మిమ్మల్ని ఎడబాసే బాధ కల్పించకు." నిండు ప్రేమతో కూడిన ఈ మాటలు విని, హజరత్ బిలాల్ (రజి) యుద్ధ ఉద్యమాల నుండి ఆగిపోయారు.

హజరత్ ఉమర్ (రజి) ఖిలాఫత్ హయాంలో కూడ జిహాద్‌లో పాల్గొన దలచారు. ఆయన కూడా హజరత్ బిలాల్ (రజి)ను ఆపుకోదలిచారు. కాని హజరత్ బిలాల్ (రజి)ను ఆపేంత ధైర్యం ఎక్కడుంది? సిరియాపై యుద్ధానికి పంపబడ్డారు హజరత్ బిలాల్ (రజి).

హజరత్ ఉమర్ (రజి) ఇలా చెప్పేవారు, "హజరత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) మాకు సర్దారు. ఆయన మన సర్దారు హజరత్ బిలాల్ (రజి)కు బానిసత్వం నుండి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ప్రసాదించారు." ఒకప్పుడు రెండవ ఖలీఫా హజరత్ ఉమర్ ఫారూఖ్ (రజి) కొంత మందితో కలసి కూర్చున్నారు. ప్రతి ఒక్కరూ తమకు అత్యంత ప్రియతమమైన కోరికేమిటో తెలియపరచవలసిందిగా కోరారు. ఒకాయన అన్నారు: "దైవం నాకు ఒహద్ కొండంత బంగారం ఇస్తే, ఆ బంగారాన్ని నేను దైవమార్గంలో వినియోగించి దైవ ప్రీతి పొందేవాణ్ణి." మరొక వ్యక్తి అన్నారు: "ఓ ప్రభూ! నాకు లెక్కించలేనంత మంది మహిళా బానిసలను ప్రసాదిస్తే నేను దైవప్రీతి కోసం వారందరికి స్వేచ్ఛ ప్రసాదించేవాణ్ణి." మరో వ్యక్తి, "దైవ మార్గంలో

ప్రాణాలర్పించి ఏ లెక్క చూపకుండా స్వర్గ ప్రవేశం చేయాలనే తలంపు కలిగి ఉన్నాను" అని అన్నారు. ఒకరు జిహాద్‌ను కోరుకుంటే మరొకరు దైవం అంగీకరించే హజ్ చేయాలని ఉందన్నారు. ఇక ఉమర్ (రజి) గారి వంతు వచ్చింది. ఆయన ఇలా అన్నారు, "ఓ ప్రభూ! ఈ ఇంటిని బిలాల్ (రజి), సల్మాన్ (రజి), ఖబ్బాబ్ (రజి), సుహేబ్ (రజి) లాంటి వ్యక్తులతో నింపు, నన్ను వారి మధ్యలో కూర్చుండబెట్టు."

హజరత్ ఉమర్ (రజి) కోరికను బట్టి చూస్తే హజరత్ బిలాల్ (రజి) ఎంతో ఉన్నతోన్నత స్థానం అలంకరించారన్నది మనకు తెలుస్తుంది.

హజరత్ బిలాల్ (రజి) చేసిన సిఫారసును ప్రియప్రవక్త (సఅసం) మొదటి ఖలీఫా, రెండవ ఖలీఫాలు తప్పకుండా అంగీకరించేవారు. సిరియా దేశంపై యుద్ధభేరి మ్రోగింది. అప్పుడు హజరత్ బిలాల్ (రజి) ఒక సిఫారసు చేశారు. యుద్ధంలో పాల్గొనే అధికారి కానీవండి, మామూలు సైనికుడు కానీవండి అందరికీ ఒకే రకపు భోజన వసతి ఏర్పాటు చేయాలన్నారు. ఒక బీద విశ్వాసి వివాహ సంబంధం కోసం ఒక ఐశ్వర్యవంతుని ఇంట సిఫారసు చేయగా, ఆ వివాహ సంబంధం వెంటనే అంగీకరించబడింది. విశ్వాసం వల్ల చేకూరే లాభాలు విశదీకరిస్తే, నిరవధికంగా చెప్పేవారు. ఎప్పుడూ ఇలా అనేవారు: "నేను నిన్నటి వరకు ఒక మామూలు నిగ్రో బానిసను. ప్రజలారా! అల్లాహ్, ఆయన ప్రవక్త ముహమ్మద్ (సఅసం)పై విశ్వాసం కలిగి ఉండండి. జిహాద్ చేయండి. అల్లాహ్ అంగీకరించేలా హజ్ చేయండి."

ప్రపంచం వీడక ముందు ఆత్మీయ ప్రియప్రవక్త (సఅసం)ను కలలో చూశారు. ఆయన (సఅసం) కలలో ఇలా అన్నారు: "ఈ మెట్ట జీవితం ఎంత వరకు? నన్ను సందర్శించడానికి నీకింకా సమయం రాలేదా?" స్వప్నం చూసి చీకాకు పడ్డారు హజరత్ బిలాల్ (రజి). సిరియా దేశంలో ఖిస్తా-యె-ఖౌలాల్ అనే స్థలంలో స్థిర నివాసమేర్పరచుకొన్నారు. అక్కడి నుండి మదీన వచ్చారు. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) కుటుంబీకులతో, సహబాలతో కలిసారు.

తిరిగి వాపసు వెళ్ళారు. వాపసు వెళ్తూ డెమాస్కస్‌లో స్వర్గీయులయ్యారు. అక్కడే ఆయన భౌతిక దేహం ఖననం చేయబడింది. అల్లాహ్ కృపానుగ్రహం ఆయనపై కలుగుగాక! ఆయన ఆదర్శ జీవితం విశ్వాసవంతులకు ప్రేరణగా ఉండుగాక!

హజరత్ జైదు ఇబ్నె హారిస్ (రజిఅల్లాహు అన్‌హు)

ప్రారంభం బానిస జీవితం. ఇస్లాం స్వీకరించారు. పెద్దలకు పెద్ద అయ్యారు. ఆయన జీవితం మనకు ఆదర్శం.

హజరత్ జైదు (రజి) యమన్‌లో జన్మించారు. తండ్రి పేరు హారిస్. ఆయన కూడా యమన్ దేశస్థుడే. జైదు ఒక పసిపిల్లవాడుగా ఉన్నప్పుడు అతని తల్లి బిడ్డతో పాటు పుట్టింటికి వెళ్ళారు. దారి మధ్యన దొంగలు వారిపై పడ్డారు. పసికందుని దోచుకొన్నారు. నడి బజారు తీసికెళ్ళి బాలుని విక్రయించారు. ఆ బాలుడు క్రయమొందిన వారివద్ద బానిస అయ్యాడు.

ఉమ్ముల్ మోమినీన్, హజరత్ ఖదీజతుల్ కుబ్రా (రజి)గారి అన్న కుమారుడు హకీం ఇబ్నె హజాం ఆ బాలుని కొన్నారు. కొన్న తరువాత తండ్రిగారి సోదరి అయిన హజరత్ ఖదీజ (రజి) గారికి కానుకగ ఇచ్చారు. ఆమె (రజి)గారు జైదు (రజి)ను ప్రియప్రవక్త (సఅసం) సేవ కోసం నియమించారు.

పసి బాలుడు పెరిగి పెద్దవాడయ్యాడు. ప్రియప్రవక్త (సఅసం) కనుసన్నుల మధ్య పెంచబడ్డాడు. ఆయన (సఅసం)కు ఆప్తుడయ్యాడు. ఇదంతా దైవకృప.

మానవుడు తొందరపడుతాడు. దైవ సంకల్పం తెలుసుకోలేడు. అబ్బాయి పుట్టింది యమన్‌లో, దారిలో దొంగల వశమయ్యాడు, విక్రయించబడ్డాడు, బానిస అయ్యాడు కాని చివరకు చేరింది ప్రియప్రవక్త (సఅసం) సాన్నిధ్యంలో. అంతకంటె మించిన అదృష్టం ప్రపంచంలో ఎవరికి దక్కుతుందని? జైదు జీవితం

మారింది. పెద్ద పెద్దవారు ఆయన్ను చూస్తూ సమాజంలో తమకున్న స్థానం ఆయనకంటే అల్పమని అంగీకరించకతప్పింది కాదు.

కాని తనయుని పట్ల తల్లిదండ్రులకుండే ప్రేమను ఎవరు లెక్కించగలరు. కొడుకును ఎడబాసిన మాతా పితలకు ఒక్క క్షణం మనశ్శాంతి కలుగడం లేదు. దైవ మర్మం వారికి తెలియలేదు. రేయింబవళ్ళు సంతాప హృదయులై ఎడబాసిన తనయునికై అన్వేషించేవారు. వెదుకుతూ ఏండ్లు గడిచాయి. కాని బాలుని జాడ తెలియరాలేదు.

ఒకానొక సంవత్సరం యమన్ దేశస్థులు హజ్ కోసం మక్కా వచ్చారు. అక్కడ జైదును చూశారు, గుర్తుపట్టారు. స్వదేశం వెళ్ళారు, తల్లిదండ్రులకు జైదు విషయం తెలిపారు. వార్త వింటూనే హారిస్ తన సోదరుని, కొంత సామగ్రిని వెంట తీసికొని మక్కాకు ప్రయాణమయ్యారు. మక్కా చేరి ప్రియప్రవక్త(సఅసం) సమక్షంలో హాజరయ్యారు. సవినయంతో ఇలా ప్రాధేయపడ్డారు. "ఓ అబ్దుల్లా ప్రియపుత్రుడా! మీ వంశంలో శ్రేష్ట రత్నమా! మీరు (సఅసం) కాబాకు చెందినవారు. కాబా గృహ యాజమాన్యం మీ వంశానికే దక్కింది. ఆపదలలో చిక్కుకొన్నవారికి మీరు సహాయపడుతారు. ఖైదీలకు భోజన సదుపాయాలు కలుగజేస్తారు. మీ వద్దకు ఒక మనవి తీసుకొని వచ్చాం. మీ వద్ద నా తనయుడు బానిసగా ఉన్నాడు. అతణ్ణి వదలెయ్యండి. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ప్రసాదించండి. దానికి బదులు మీరు ఏదైనా కోరండి. సమర్పించుకొంటాం."

హారిస్ (రజి) చేసిన విజ్ఞప్తిని విన్నారు ప్రియప్రవక్త (సఅసం). "మీరు ఎవరి విషయంలో ఈ ప్రస్తావన చేశారు" అని అడిగారు. 'జైదు విషయం' అని బదులు పలికారు యమన్ దేశస్థులు. జైదు పేరు వినగానే ఆలోచనలో పడిపోయారు ప్రియప్రవక్త (సఅసం). జైదును తన సొంత కుమారుని వలె పెంచుతున్నారాయన (సఅసం). గారాబంతో, ఏలాంటి ఇబ్బంది పెట్టకుండా, కన్నుల పండువుగ చూసుకొంటున్నారు. "ఆయన మినహా మీకింకేమీ అవసరం లేదా?" అని అడిగారు ప్రియప్రవక్త (సఅసం). "లేదు" అని అన్నారు యమన్

దేశస్థులు. "అయితే వినండి, జైదును పిలవండి, అతనికే ఈ సమస్య వదిలేయండి. అతడు మీ వెంట వస్తానంటే సరే, దైవసాక్షిగా చెబుతున్నాను వినండి. ఎవరైతే నేనంటే ఇష్టపడతారో వారిని నేను ఇష్టపడకపోవడం అసాధ్యం" అని అన్నారు ప్రవక్త (సఅసం).

హారిస్ ఈ షరతును అంగీకరించాడు. వారు జైదు జీవితం ఒక బానిస జీవితమని భావించారు. బానిసలను ఆ కాలంలో యజమానులు ఎలా చూసేవారో అందరికీ తెలిసిందే. బానిసత్వం నుండి విముక్తి పొందడానికి అనేక ప్రయత్నాలు జరిగేవి. హారిస్ కూడ జైదు ఒక బానిస బ్రతుకు గడుపుతున్నాడని, నానా యాతనల సంకలితం ఆయన జీవితం అని భ్రమించారు. వారికేం తెలుసు? జైదు ఎవరి దగ్గర బానిసగా ఉన్నాడో, ఆ వ్యక్తి బానిసలను భాగ్యజీవులుగా చేసేవారని, వారిని యజమానులుగా మార్చే మానవత్వపు శిక్షణ ఇచ్చేవారని, ఒక్కొక్క మనిషిని మహా మనీషిగ మలచేవారని హారిస్‌కు తెలియదు. జైదు (రజి) పిలువబడ్డారు. ప్రియప్రవక్త (సఅసం) ఆయన్ను ఇలా అడిగారు: "మీరు వీరిరువురిని గుర్తించగలరా?" జైదు అన్నారు: "అవునండి. ఈయనేమో నా తండ్రి. మరి ఆయనేమో నా పిన తండ్రిగారు." ప్రియప్రవక్త (సఅసం) వారి రాకను గురించి తెలియపరుస్తూ ఇలా అన్నారు: "నేనెవరైంది కూడా మీరు గుర్తించారు కదా! నా పట్ల మీరెట్లు ప్రవర్తిస్తూ వచ్చారో అది కూడా మీకు తెలుసు. ఇక మీకు స్వేచ్ఛ ఉంది. మీరు నన్ను అయినా కోరుకోండి, మీ నాన్న, పినతండ్రులనైనా కోరుకోండి."

ప్రియప్రవక్త (సఅసం) గారితో ఉంటూ తాను పొందిన మహాభాగ్యం జైదు (రజి)కు బాగా తెలుసు. ప్రియప్రవక్త (సఅసం) రక్షణలో ఉంటూ, ఆయనిచ్చే శిక్షణ వల్ల తనలో పెంపొందుతున్న మూర్తిత్వం కూడా గమనిస్తున్నారు జైదు (రజి). అందువలన నిష్కర్షగా ఇలా అన్నారు, 'మీరే నా పాలిటి తల్లీ తండ్రి." జైదునోట వెలువడిన ఈ మాటలు విన్న జైదు (రజి) తండ్రికి, పినతండ్రికి ఆశ్చర్యం కలిగింది. వారన్నారు, "నాయనా! ఎంత దురదృష్టం! నీకు స్వేచ్ఛా

స్వాతంత్ర్యాల కన్నా, తండ్రి, పినతండ్రుల కన్నా, కన్న కుటుంబీకులకన్నా బానిసగా ఉండడం కోరుకొంటున్నావా!" ఆయన అన్నారు, "అవును. ఈ మహానుభావునిలో నాకగుపించిన సుగుణ సముదాయం, ఔదార్యం నాకు నచ్చాయి. అంతకుమించి నాకేమీ అవసరం లేదు."

హజరత్ జైదు (రజి) మనస్ఫూర్తిగా ప్రవక్త (సఅసం) పట్ల తనకున్న ప్రగాఢ ప్రేమను ప్రస్ఫుటపరచడంతో ప్రభావితులైన ముహమ్మద్ (సఅసం) జైదు (రజి)ను కాబాకు తీసికెళ్ళారు. బహిరంగంగా ఇలా ప్రకటించారు, "జైదు ఈనాటి నుండి నా కుమారుడు. నేను ఆయనకు వారసుణ్ణి. ఆయన నాకు (సఅసం) వారసుడు." ప్రకటన విన్న జైదు తండ్రి, పినతండ్రి ఆశ్చర్య చకితులయ్యారు. ఆనందభాష్పాలు కార్చారు. వారు తమ కోరికను వదలి, తనయుని వదలి, యమన్ దేశానికి వెళ్ళారు. వారు వెళ్ళిన కొద్ది రోజుల తరువాత ముహమ్మద్ (సఅసం)కు ప్రవక్త బాధ్యతలు అప్పగించబడ్డాయి. ఆయన (సఅసం) ప్రజల ఎదుట ఇస్లాం మూలసూత్రాల్ని విశదీకరించారు. ప్రప్రథమంగా ఇస్లాం అంగీకరించి ముస్లిం అయినవారిలో హజరత్ ఖదీజ (రజి), హజరత్ అబూబకర్ (రజి), హజరత్ అలీ (రజి) ఉన్నారు. వారితో బాటు జైదు (రజి) కూడా ఇస్లాం మధుర విశ్వాసాన్ని గ్రోలి ముస్లిం అయ్యారు. ఆ పిమ్మట మహాప్రవక్త (సఅసం)గారి పినతండ్రి హజరత్ హమ్‌జా (రజి) ముస్లిం అయ్యారు. ప్రియప్రవక్త (సఅసం), జైదు (రజి)కు హజరత్ హమ్‌జా (రజి)గారితో సోదర సంబంధం ఏర్పాటు చేశారు. వారిరువురి మధ్య ఎడతెగని సోదర సంబంధం ఏర్పరచింది ఇస్లాం. హజరత్ హమ్‌జా ఎక్కడికైనా వెళ్ళదలిస్తే తాను లేనప్పుడు తన బాధ్యతల్ని హజరత్ జైదు (రజి)కు అప్పజెప్పివెళ్ళేవారు. అంతేకాదు, హజరత్ జైదు (రజి) ఇంకా ఉన్నత స్థానాన్ని అలంకరించాల్సి ఉంది. జైదు (రజి) వివాహం కూడా ప్రియప్రవక్త (సఅసం) దాయ ఉమ్మె యమీన్ (రజి)తో చేయించారు. హజరత్ ఉమ్మె యమీన్ (రజి) విషయంలో ప్రియప్రవక్త (సఅసం) ప్రవచనం కూడా ఉంది. ఎవరైనా స్వర్గారోహణ పొందే మహిళను వివాహమాడదలిస్తే

వారు ఉమ్మె యమీన్ (రజి)తో వివాహం చేసుకోగలరని అన్నారు. హజరత్ జైదు (రజి) ఇలాంటి శుభతరుణానికై వేచి ఉండేవారు. వెంటనే లేచారు, ఆ మహిళను వివాహ మాడారు. ఉమ్మె యమీన్ (రజి) హజరత్ జైదు (రజి) కంటే వయస్సులో చాలా పెద్ద.

హజరత్ జైదు (రజి) మదీన పట్టణానికి వలస వెళ్ళే వారిలో ఉన్నారు. అక్కడ ఒక భాగ్యవంతుడైన ఉసైద్ ఇబ్నె జాఫర్ అన్సారి (రజి)తో జైదు (రజి)కు సోదర సంబంధం కుదర్చబడింది. చూశారా! ఒక బానిస, ఇస్లాం మహాభాగ్యం నోచుకొన్న తరువాత శ్రీమంతులతో సమానులయ్యారు. హజరత్ ఆయెషా (రజి) ప్రవచనం ప్రకారం, ప్రియప్రవక్త (సఅసం) ఎప్పుడైనా సైన్యాన్ని ఒక ఉద్యమంపై పంపే సమయంలో, ఆ సైన్యంలో హజరత్ జైదు (రజి) ఉన్నట్లయితే ఆయన్నే సైన్యాధిపతిగా నియమించేవారు. ఇలా తొమ్మిది పర్యాయాలు ఆయన సైన్యాధిపతిగా నియమించబడ్డారు. ఆయన అధీనంలో ఉండే సైనికులు కూడా మామూలు మనుషులు కాదు. హజరత్ అబూబకర్ (రజి), హజరత్ ఉమర్ (రజి) లాంటి యోధులు ఉన్నారు. జైదు (రజి) శిఖరాగ్ర శ్రేణికి చెందిన నాయకుడు కావడం కేవలం మహాప్రవక్త (సఅసం) అతనికిచ్చిన సుశిక్షణ ఫలితమే. జైదు (రజి) గారి సమక్షంలో మహాప్రవక్త (సఅసం)కు మరెవ్వరూ దక్షులుగా అగుపించేవారుకారు. బంగారాన్ని కరిగించి, మైల తొలగించి స్వచ్ఛమైన పసిడిని వేరుపరచినట్లే హజరత్ జైదు (రజి) మహా వ్యక్తిగా మలచబడ్డారు. విలు విద్యలో కూడా హజరత్ జైదు (రజి)ను మించిన నిపుణుడు మరొకరుండేవారుకారు. ధైర్యసాహసాలలో కూడా ఆయన్ను మించిన మరో సైనికుడు లేడు. రణరంగంలో వెనుకంజ అనేది ఎరుగని మహా ప్రతిభాశాలి హజరత్ జైదు (రజి). ప్రియప్రవక్త (సఅసం) మదీన నుండి బయటికి వెళ్ళవలసి వస్తే హజరత్ జైదు (రజి)ను తన వారసునిగా చేసి వెళ్ళేవారు. అప్పజెప్పిన బాధ్యతలను కూడా హజరత్ జైదు (రజి) ఎంతో చాకచక్యంతో నెరవేర్చేవారు. మహాప్రవక్త (సఅసం) కూడా ఆయన నేర్పరితనం వల్ల సంతసించేవారు.

ప్రియప్రవక్త (సఅసం) జీవితంలో జరిగిన **"ముఅత్త"** మహాయుద్ధం ఒక ప్రముఖ యుద్ధం. ఆ యుద్ధ సైన్యంలో యోధానుయోధులు అయిన హజరత్ అబూబకర్ (రజి), హజరత్ ఉమర్ (రజి), హజరత్ జాఫర్ తయ్యార్(రజి) లాంటి వారెందరో ఉన్నారు. అయినప్పటికీ ఆ యుద్ధ సేనాధిపత్యం హజరత్ జైదు (రజి)కే ఇవ్వబడింది. కాని జీవితం దైవాధీనం. ఆ సమరంలో జైదు (రజి) అసువులు కోల్పోయారు. ఆయన మరణం పట్ల ప్రియప్రవక్త (సఅసం) కంట తడిపెట్టు కొన్నారు. కాని సైన్యాన్ని సమీకరించి మరో సేనాధిపతిని నియమించడంలో హజరత్ జైదు (రజి) కుమారుడయిన హజరత్ ఉసామ బిన్ జైదు (రజి)నే సైన్యాధిపతిగా ఎన్నుకొన్నారు.

హజరత్ జైదు (రజి) జీవిత వాస్తవం ఏమిటంటే, ఆయన తన జీవితాన్ని అల్లాహ్ సంతోషం పొందడానికి, ప్రియప్రవక్త ప్రసన్నత కోసం అంకితం చేశారు. అదే విధంగా దైవప్రీతిని, మహాప్రవక్త (సఅసం) ఆప్యాయతను కూడా ఆయన నోచుకొన్నారు. ఉన్నత శ్రేణికి చెందిన ముస్లిం అయ్యారు. ప్రియప్రవక్త (సఅసం) ప్రపంచం వీడాక, హజరత్ జైదు (రజి) విషయంలో హజరత్ ఆయిషా (రజి) ఇలా తెలిపారు. "జైదు (రజి) సజీవంగా ఉన్నట్లయితే ప్రియప్రవక్త (సఅసం) ఆయన్నే తన వారసునిగా చేసేవారు." దైవానుగ్రహం ఈ మహనీయునకు కలుగుగాక! వారి అడుగుజాడల్లో నడచుకొనే భాగ్యం మనకు లభించుగాక! మహాప్రవక్త (సఅసం) మహా ఆదర్శం తరువాత ఈ మహానుభావుల జీవితాలే మనకు శిరోధార్యం.

హజరత్ సల్మాన్ ఫారసీ
(రజిఅల్లాహు అన్హు)

ప్రియప్రవక్త (సఅసం) నబవీ మసీదులో ఆసీనులై ఉన్నారు. ఒక వ్యక్తి వచ్చాడు. ఆయన (సఅసం) సమక్షంలో హాజరయ్యాడు. "మీరు దైవం ఎన్నుకొన్న మహనీయులని, స్వదేశం వదలి వచ్చినవారు, అవసరాలు తీర్చుకోవడానికి వచ్చినవారు మీ వెంట ఉన్నారని తెలిసింది. నా వద్ద ఈ వస్తువులు బీదసాదలకు ఇచ్చేందుకు ఉన్నాయి. వీటిని అంగీకరించండి" అని అన్నాడు.

ప్రియప్రవక్త (సఅసం) ఒక్క మారు ఆయనను చూశారు. ఆ వస్తువులను ఇతరులకిచ్చి వాటిని తినండని చెప్పారు. కాని ఆయన (సఅసం) వాటిని తినలేదు. ఇది చూసి క్షుద్బాధ తొలగించడానికి పదార్థాలు తెచ్చిన వ్యక్తి నిష్క్రమించాడు. రెండవ దినం మళ్ళీ వచ్చాడాయన. తినుబండరాలను తన వెంట తెచ్చాడు. వాటిని ప్రియప్రవక్త (సఅసం)కు సమర్పిస్తూ ఇలా అన్నాడు: "నిన్న మీరు దానంగా తెచ్చిన వస్తువులను తినలేదు. ఈ దినం తెచ్చిన ఈ కానుకను అంగీకరించండి."

ఇహపరాలలో సర్దారు అయిన మహాప్రవక్త (సఅసం) ఆ కానుకను తీసికొన్నారు. స్వయంగ తిన్నారు, ఇతరులకు ఇచ్చారు. ఇక ఆ వ్యక్తి ప్రియప్రవక్త (సఅసం) భుజస్కంధాలపై మారు మారు వీక్షింపసాగారు. అనుకోని విధంగా భుజం మీద ఉన్న దుప్పటి కాస్త జరిగింది. రెండు భుజాల మధ్య భాగంలో ఒక్క రూపాయ సైజులో ఉబ్బెత్తిన కండరమగుపించింది. ఆ కండరాన్ని చుంబించబోయాడు వచ్చిన వ్యక్తి. ప్రియప్రవక్త (సఅసం) అన్నారు: "ముందుకు రండి." అతను ముందుకు వచ్చాడు. ప్రియప్రవక్త (సఅసం) తన సహచరుల్ని పిలిచారు. అందరు వింటుండగా ప్రియప్రవక్త (సఅసం) ఇలా అన్నారు: "మీరు మీ పరిచయం చేసుకొండి." సెలవిచ్చినతోడనే ఆ వ్యక్తి తన గాథను ఇలా వివరించాడు:

"దైవానికి ప్రియమైన సత్పురుషులారా! నా పేరు 'మాఅబ.' ఈరాను దేశంలో ఒక సుప్రసిద్ధ పట్టణం అప్ఫహాన్ ఉంది. ఆ పట్టణానికి సమీపంలో 'జీ' పేరిట ఒక గ్రామం ఉంది. నేను ఆ గ్రామస్థుడను. నా తండ్రి ఆ గ్రామంలోని ఒక జమిందారు. ఆయనకు వ్యవసాయం అంటే ప్రీతి. పెద్ద ఎత్తున సేద్యపు పనులు స్వయంగ చేసేవారు, చేయించేవారు కూడ. నేనంటే నాన్నకు ఎంతో ప్రేమ. జాగ్రత్తగా చూసుకొనేవారు. ఇంటి నుండి బయటకు పోనిచ్చేవారుకాదు. నన్ను కంటికి రెప్పలా పెంచేవారు. అందంగా బట్టలు కుట్టించేవారు. అంతః పురంలాంటి ఇంటిలోనే ఉండనిచ్చేవారు. ఆయన జురాష్ట్రియన్ మతాన్ని పాటించేవారు. అగ్నిని పూజించేవారు. ఆ పూజాపురస్కార పద్ధతి నాకు నేర్పించారు. ఆ మతం పాటించే వారి విశ్వాసాలు, నీతి నియమాలు ప్రబోధించారు. తండ్రి పట్ల వినయవిధేయతలు చూపే వినమ్రుణ్ణి నేను. తండ్రిగారి మాటలు శ్రద్ధతో వినేవాణ్ణి. అగ్ని పూజ నియమానుసారం చేసేవాణ్ణి. బాల్యంలోనే నేను పెద్ద పెద్ద పూజారులలో లెక్కించబడేవాణ్ణి. అగ్నిని ఆర్పకుండా రేయింబవళ్ళు ఆరాధన చేసేవాణ్ణి.

ఒక దినం తండ్రిగారు ఇంటి మరమ్మతు పనులలో నిమగ్నులై ఉన్నారు. అటు పొలాలలో పంటలు కోతకు వచ్చాయి. వాటి రక్షణ కోసం నా తండ్రిగారు వెళ్ళలేక పోయారు. నేను కొద్దిగా పెద్దవాణ్ణి. ఇంటి నుండి బయటకు అప్పుడప్పుడు వెళ్ళడం మొదలుపెట్టాను. అందుచేత నాన్నగారు నన్ను పిలిచారు. పొలం పనులు చూసుకొని రమ్మన్నారు. నేను సరే అని వెళ్ళాను. దారిలో ఒక చర్చి అగుపించింది. అప్పుడా చర్చిలో చాలా మంది క్రైస్తవులు గుమిగూడి ఉన్నారు. వారు దైవారాధన చేస్తుండడం నేను చూశాను. అక్కడే నిలబడిపోయాను. వారి ఆరాధన పద్ధతి నాకు నచ్చింది. మనసులోనే ఆలోచించుకొన్నాను. క్రైస్తవుల ఆరాధన జొరాష్ట్రియన్ అగ్ని పూజకంటే మిన్నగా ఉంది అని భావించాను. అక్కడున్న క్రైస్తవులతో అడిగాను. "మీ మతస్తుల కేంద్రం ఎక్కడుంది?" వారన్నారు: 'సిరియా' దేశంలో. వారితో సంభాషణలో సాయంత్రం అయింది. వారి మత

కేంద్రం వివరాలు సమీకరించుకొని ఇంటికి వచ్చాను. ఇంటిలో తండ్రిగారు నా రాకకు నిరీక్షిస్తూ "నాయనా ! చాలా ఆలసించావు. ఇంతవరకెక్కడున్నావు" అని అడిగారు. "కొంత మంది చర్చిలో ప్రార్థనలు చేస్తున్నారు. వారి ఆరాధన విషయాలు గమనిస్తుండగా సాయంత్రం అయిపోయింది" అని జవాబిచ్చాను. తండ్రిగారు వెంటనే స్పందిస్తూ అన్నారు: "నాయనా! ఆ మతం మన జొరాష్ట్రియన్ మతానికంటే మంచిదికాదు" అన్నారు. నేను ముందు వెనుక ఆలోచించకుండా, "దైవసాక్షిగ చెబుతున్నా! వారి మతం మన జొరాష్ట్రియన్ మతం కంటే ఎన్నో రెట్లు మేలయింది" అని అన్నాను.

నా జవాబు తండ్రిగారిని ఎన్నో అనుమానాలలో ముంచేసింది. నేనెక్కడ మతాన్ని మార్చుకొంటానో అని ఊహిస్తూ నన్ను ఆయన ఇంటిలోనే పడేశారు. బయటికెక్కడికీ వెళ్ళనిచ్చేవారుకాదు. కాని మనసులో గూడుకట్టుకొన్న మంచి నుండి దూరం చెయ్యడానికి నాలుగు గోడలు అడ్డుపడుతాయా! ఎవరికీ తెలియకుండా నేను చర్చికి వెళ్ళేవాణ్ణి. తండ్రిగారికి ఈ విషయం కూడా తెలియ గానే, ఆయన నన్ను ఇంటిలో ఖైదు చేశారు. ఖైదీగా నేను విపరీత బాధలకు గురయ్యాను. చివరకు ఆ క్రైస్తవులకు కబురంపాను. సిరియా వెళ్ళడానికి ఏదైనా బృందం వచ్చిందంటే నాకు తెలుపండి అని అన్నాను.

దైవవశాత్తు కొన్ని దినములలోనే ఒక వర్తక బిడారం వచ్చింది. సిరియా దేశానికి వెళ్తుంది. ఈ విషయం నాకు తెలియగానే నేను ఏదో విధంగా బందీ ఖానా నుండి విముక్తుడనయ్యాను. సిరియా దేశానికి వెళ్ళే వర్తక బిడారంలో చేరాను. సిరియా దేశం చేరాను. అక్కడి ప్రజలతో అడిగాను: "ఇక్కడ మతపరంగా అందరికన్నా గొప్ప వ్యక్తి ఎవరు?" పెద్ద ఫాదర్ అడ్రసు ఇచ్చారు వారు. నేను వెళ్ళి ఆయన్ను కలిశాను. నేను అన్వేషిస్తున్న సత్యధర్మ తృష్ణ తీర్చుమన్నాను. మతాన్ని మార్చుకొని క్రైస్తవుణ్ణయ్యాను. ఇక ఆ ఫాదర్ సేవలో నిమగ్నమయ్యాను. వెంట ఉండడం వల్ల ఆ ఫాదర్ గుప్తగుణాలు బయటపడ్డాయి. అతనొక చెడు వ్యక్తి అని తెలుసుకొన్నాను. ఇతరులకు మంచి పనులు చెయ్యమని ఆజ్ఞాపిస్తాడు.

స్వయంగా వాటిని చెయ్యడు. ప్రజల నుండి బీదసాదలకు సహాయార్థం దానధర్మాలు తీసికొంటాడు. కాని స్వయంగా వాటిని వాడుకొంటాడు. మిగిలింది జాగ్రత్తపరచుకొంటాడు. ఈ విధంగా ఆయన దగ్గర ఏడు బానల నిండా వెండి బంగారం నిలువ అయింది. అతని లాలూచీతనం చూస్తుంటే నాకు అసహ్యం కలిగింది. అతని లోభత్వం బయటపెట్టాలని ఎన్నోమార్లు తలంచాను. కాని ఫాదర్ మహాకోపి. అట్టహాసంతో అందరినీ అణచివేసేవాడు. అందుచేత ధైర్యం చాలకపోయింది. అతడు మరణించాడు. అప్పుడాయన తత్వం బట్టబయలు చేస్తూ అతడు దాచిన సొమ్మును గురించి, ఆడిన నాటకాల గురించి అందరికీ తెలియజేశాను. ప్రజలు అతని ఇంటిని సోదా చేశారు. దాచబడిన బానల్లోని వెండిబంగారాలు వెలికి తీశారు.

అతని తరువాత మరో ఫాదర్ క్రైస్తవులకు నాయకుడయ్యాడు. ఈయన వాస్తవంగా ధర్మజ్ఞుడు. సుగుణశీలుడు కూడా. రేయింబవళ్ళు ఆరాధనలో ఉండేవాడు. నాకు అతనంటే ఎంతో అభిమానం కలిగింది. నేనతనికి నా విషయం తెలిపాను. ఆయన సేవలో జీవితం గడుపుతున్నా. అతను నేనంటే ఎంతో ప్రేమ చూపేవాడు.

చనువెక్కువైన కొలది, ఆంతరంగిక మర్మం ఆయన తెలియపరుస్తూ వచ్చాడు. ఇక ఆయన మరణ సమయం దాపురించగా నేనతణ్ణి అడిగాను: "ఎంతో కాలం నుండి నేను మీ వద్ద ఉంటూ వచ్చాను. నా పట్ల మీరెంతో దయ చూపారు. ఇక మీ చివరి సమయం వచ్చింది. ఇక నేనెక్కడికి పోవాలి?" ఆయన ఇలా అన్నారు: "నా దృష్టిలో హజరత్ ఈసా (అలై) పట్ల విధేయత చూపుతూ జీవితం గడిపే వ్యక్తి ఎవరూ కనబడటం లేదు. క్రైస్తవులు హజరత్ ఈసా (అలై) ప్రబోధనలలో మార్పులు చేర్పులు చేశారు. ఏ నియమాలు కష్టతరంగా కనబడ్డాయో వాటిని వదిలేశారు. తమ వంతు మార్పులు తెచ్చిపెట్టుకొన్నారు. మౌసూల్ పట్టణంలో ఒక వ్యక్తి ఉన్నాడు. అతని వద్ద దైవధర్మం మార్పులు చేర్పులు లేకుండా ఉంది. మీరు వెళ్ళి ఆయన్ను కలవండి."

దయాదాక్షిణ్యాలు గల ఆ ఫాదర్ మరణించాక నేను మౌసూల్ పట్టణం చేరాను. ఆ క్రైస్తవ మత గురువును వెదుక్కుంటూ వెళ్ళి ఆయనను కలిశాను. నా జీవిత దృక్పథం ఆయనకు వినిపించాను. అతని దగ్గరనే ఉన్నాను. అతడు నన్ను అక్కడే ఉండమన్నాడు. ఈ మత గురువు కూడా సత్యవంతుడు, మంచి గుణశీలుడు. అతని దగ్గర కూడా అనేక విషయాలు నేర్చుకొన్నా. కాని కొద్ది దినములలోనే ఆయనకు మరణం ఆసన్నమయింది. అతణ్ణి కూడా అడిగాను: "ఇక నేనెక్కడికి వెళ్ళాలి?" 'నసీబయిన్' పట్టణంలో ఉండే క్రైస్తవ మత గురువు వద్దకు వెళ్ళమని ఆయన చెప్పాడు. చిరునామా కూడా ఇచ్చాడు. ఇక నేను నసీబయిన్ క్రైస్తవ మత గురువు వద్దకు వెళ్ళాను. ఆ మతగురువు నడవడిక అత్యుత్తమంగా ఉంది. కాని మరణం ఆయన్ను వదిలిందికాదు. ఆ పిమ్మట అతడిచ్చిన సలహా మేరకు అమూరియాలో ఉన్న అతిపెద్ద క్రైస్తవ మత గురువు వద్దకు వెళ్ళాను. అతనికీ మరణకాలం ఆసన్నమవుతునే ఇలా అన్నాను:

"దారి చూపించేవాడని ప్రతి మార్గదర్శి వెనుక నడిచాను.
కాని నా గమ్యం మొదటి నుంచి చివరి వరకు నిర్ణయించలేకపోయాను.
ఇంకా నడుస్తున్నా ప్రతి మార్గదర్శి వెనుక పోతున్నా
నా నిజ మార్గదర్శి ఎవరయింది గుర్తుపట్టలేకపోతున్నా."

నా మొరనాలకించి చివరి క్రైస్తవ మత గురువు ఇలా అన్నాడు: "నేనేమని చెప్పాలి, నాయనా! సత్యధర్మం ప్రకారం నడచుకొనే వ్యక్తి ఇక ఈ ప్రపంచంలో లేడు. సత్యధర్మం తెలిసినవారు ఎక్కడ నుండి రాగలరు? ఇంజీలు, తౌరాతు గ్రంథాలలోని ఉపదేశాలు తారుమారయ్యాయి. కాని ఒక దైవప్రవక్త రానున్న సమయం దాపురించింది. ఆయనను గురించి పరిశుద్ధ గ్రంథంలో మీరు చదివారు కూడ. ఆ ప్రవక్త అరబ్బు ఎడారి ప్రదేశంలో ప్రభవించబోతున్నారు. ఇబ్రాహీం (అలై) ప్రబోధించిన దైవధర్మాన్ని పునరావృతం చేయబోతున్నారు. ఆయన ఖర్జూరపు తోటలుండే భూమి వైపు వలస వెళ్తారు. అతన్ని గుర్తుపట్టే చిహ్నాలు, కానుకలైతే తీసికొంటారు, దానధర్మాల వస్తువులంటే తీసికోరు. అతని

రెండు భుజాల మధ్య ఒక రూపాయి మందం ఎత్తయిన కండరం చిహ్నంగ ఉంటుంది. మీరు ఆయన్ను కలువవలసిందని ఆదేశిస్తున్నాను. అక్కడ మీకు సంతృప్తి కల్గుతుంది."

ఈ పెద్ద క్రైస్తవ మత గురువు మరణించేంత వరకు నేనక్కడే ఉన్నా. కాని ఏదైనా ప్రయాణీకుల జట్టు వస్తే 'మీరెక్కడికి వెళ్తున్నార'ని అడిగేవాణ్ణి. నా అదృష్టవశాత్తు అరబ్బు దేశానికి వెళ్ళే ఒక బిడారం అక్కడ అగుపడింది. ఆ అరబ్బులతో కలసి ప్రయాణం సాగిస్తున్నా. దురదృష్టవశాత్తు అరబ్బులు నన్ను మోసగించారు. నన్ను బానిస చేశారు. బజారులో ఒక యూదునకు అమ్మేశారు. ఆ యూదుడు మళ్ళీ తన పిన తండ్రి కుమారునికి నన్ను విక్రయించాడు. అతడు నన్ను మదీన తీసికొని వచ్చాడు. ఇక్కడ నేను ఖర్జూరపు చెట్లు చూశాను. నా మనస్సు ఆనందపరవళ్ళు తొక్కింది. ఇక ఎదురు చూస్తున్న వ్యక్తిని గురించి దర్యాప్తు ప్రారంభించాను. ఎవరూ నాకు తృప్తికరంగా జవాబివ్వలేదు. ఈ విషయం స్వయంగా వారికి తెలిసింది కాదు.

ఒక దినం నేను నా యజమాని తోటలో పని చేస్తున్నా. ఖర్జూరపు చెట్టు ఎక్కాను. చెట్టును సరిగ్గా మలుస్తున్నా. ఆ చెట్టు క్రింద యజమాని కూర్చున్నాడు. ఇంతలో ఒక వ్యక్తి వచ్చాడు. ఒక జాతి వారి పేరు తీసికొంటూ, "దైవం ఆ జాతివారందరిని వినాశపరచుగాక! వారందరూ మక్కా నుంచి వచ్చిన ఒక వ్యక్తి చుట్టూ గుమిగూడారు. వారు ఈ వ్యక్తిని "ప్రవక్త" అని అంటున్నారు" అని అన్నాడు.

ఈ విషయం వింటుంటే నా ఒళ్ళు గగుర్పొడిచింది. కాళ్ళు తడబడ్డాయి. ఖర్జూరపు చెట్టు నుండి వెంటనే దిగకపోయివుంటే అక్కడ నుండి కుప్పకూలి పడేవాణ్ణి. మతిస్థిమితం కాస్త కోల్పోయాను. ముందు వెనుకా ఆలోచించకుండా "మీరేమంటున్నారని" అడగడం మొదలుపెట్టాను. నా యజమాని నేనడిగిన దానిపై మండిపడుతూ ఒక్క దెబ్బ గుద్దాడు. గద్దించి ఇలా అన్నాడు: "వారితో నీకేం పని? నీ పని చూసుకో. వెళ్ళు." నేను మౌనం వహించాను. కాని ఇక

ఓర్చుకోవడం సాధ్యం కావడం లేదు. కొద్ది తిను పదార్థాలు నా వద్ద ఉన్నాయి. నిన్న వాటిని తీసికొని మీ సమక్షంలో వచ్చాను. అది దానధర్మాల వస్తువులని చెప్పాను. ఆ దానధర్మ పదార్థాలు మీరు ఇతరులకిచ్చేశారు. స్వయంగా తినలేదు. ఉమారియా క్రైస్తవ మతాధికారి చెప్పిన ఒక భవిష్యవాణి నిజమయింది. నిన్న నేను వాపసు వెళ్ళాను. కాని రాత్రి నిద్ర పట్టలేదు. ఈ దినం మళ్ళీ సమయం చూసుకొని వచ్చాను. ఈ దినం కొన్ని పదార్థాలు కానుకగా సమర్పించుకొన్నా. మీరు వాటిని స్వీకరించారు. వాటిని మీరు తిన్నారు. ఇతరులకు పెట్టారు. ఈ విధంగా రెండవ భవిష్యవాణి కూడా నిజమయింది. ఇక రెండు భుజాల మధ్య ఉబ్బెత్తిన ఒక కండరం–చూడవలసి ఉంది. అది కూడా దుప్పటి జారిపోగా చూశాను. మీరు నిజంగా దైవప్రవక్త (సఅసం) అనే నమ్మకం నాకు కలిగింది. దైవానికి నా కృతజ్ఞతలు. నా మనస్సులో ఉన్న కోరిక ఈడేరింది. కష్టపడి వెదకడం వల్ల దక్కింది ఫలితం.

ఈ సుదీర్ఘ జీవిత సంఘటన ఒక వినూత్న గాధగా అగుపించింది. విన్నవారు అందరూ సంతోషించారు. ప్రియప్రవక్త (సఅసం) కూడా ఆనందభరితు లయ్యారు. సత్యధర్మ సంపాదనకు చేసిన కృషి ఇతరుల సంకల్పాన్ని దృఢ పరిచింది. మహాప్రవక్త (సఅసం) సత్యాన్వేషణలో ఉత్తమ కృషి చేసిన ఈ పరిశోధకునికి 'సల్మాన్' అనే పేరు పెట్టారు. ఇక నుండి 'మాఅబ' హజరత్ సల్మాన్ ఫారసీ (రజి) గా మారారు.

సత్యధర్మం కోసం త్యాగనిరతితో అన్వేషణ చేసిన వ్యక్తి విశ్వాసిగా మారాడు. కాని ఆయన బానిస జీవితం గడుపుతుంటే ప్రియప్రవక్త (సఅసం)కు బాధ కలిగేది. అందుచేత సల్మాన్ (రజి)ను పిలిపించారు. మారు ఫలం చెల్లించి బానిస జీవితం నుండి విముక్తి పొందండి అని సలహానిచ్చారు. ఆ మారు ఫలం విలువ ఎంతో యజమానిని అడిగి తెలుసుకోండని చెప్పారు. సల్మాన్ (రజి) యూద యజమానిని అడగ్గా. 300 ఖర్జూరపు చెట్లు, 40 బంగారు అవుఖియా అని జవాబు చెప్పాడు. ఒక బానిస జీవితం గడిపే వ్యక్తి వద్ద ఇంత ధనం

ఎక్కడుంటుంది. ఆ బానిస జీవితం కూడా ఎటువంటిది? బానిస ఒక పరదేశి. దేశదేశాలు తిరిగారు. ఒక్కచోట కూడా స్థిర నివాసం లేదు. ప్రియప్రవక్త (సఅసం) యావత్ప్రపంచానికి కారుణ్యమూర్తిగా వచ్చారు. 'మీ సోదరునికి సహాయం చెయ్యండి' అని అన్నారు. ఇస్లామి ఉద్యమంలో పాలుపంచుకొంటున్న సోదరులందరూ పరస్పరం దయాదాక్షిణ్యాలు కలవారు. కనికరం చూపే ఆదర్శమూర్తులు. అందరూ కలిసారు, ఒక్కొక్కరు ఒకటి, రెండు, నాలుగు ఖర్జూరపు మొక్కలు తెచ్చిచ్చారు. చూస్తుండగానే మూడు వందల చెట్లు నాటేశారు. ఒక షరతు పూర్తి అయింది. ఇక బంగారు అవుఖియా షరతు మిగిలి ఉంది. దైవేచ్ఛ అద్భుతమైంది. ఆయన తన దాసుని రక్షించదలిస్తే మార్గం సుగమం చేస్తాడు. అదే దినం విజయం సాధించుకొని ఒక సైన్యం కోడి గ్రుడ్డంత బంగారం యుద్ధ ధనంగా తెచ్చి మహాప్రవక్త (సఅసం)కు సమర్పించింది. ప్రియప్రవక్త (సఅసం) ఆ బంగారాన్ని బానిస బంధనాల నుండి విముక్తి పొందడానికి సల్మాన్ ఫారసీ (రజి)కు ఇచ్చారు. ఇచ్చిన బంగారం సరిగ్గా నలుబది 'అవుఖియా' ఉంది. ఆ బంగారం కేవలం సల్మాన్ ఫారసీ (రజి) కోసమే వచ్చినట్లయింది.

సల్మాన్ ఫారసీ (రజి) బానిసత్వం నుండి విముక్తి పొందారు. ప్రియప్రవక్త (సఅసం) సమక్షంలో వచ్చారు. ఇక ఆయన వద్దనే ఉండిపోయారు. కాని సల్మాన్ ఫారసీ (రజి) విషయంలో ప్రియప్రవక్త (సఅసం) అనుచరుల్లో ఒక ఆసక్తికరమైన చర్చ జరిగింది. సల్మాన్ (రజి) ముహాజిర్లలో లెక్కించబడాలా లేక అన్సారీలలో లెక్కించబడాలా అనేది సమస్య. ప్రతి వర్గం వారు సల్మాన్ (రజి) తమవారని వాదించారు. ముహాజిర్లు ఇలా అన్నారు, "సత్యధర్మం కోసం సల్మాన్ (రజి) ఇల్లు వాకిలి, బంధుమిత్రులు, స్వదేశం వదలి వచ్చారు. దేశదేశాలు తిరిగి మదీన చేరారు. ఇక్కడే ఆయన ఇస్లాం శ్వాస పీల్చగలిగారు. అందువలన సల్మాన్ (రజి) ఒక మేలైన ముహాజిర్." అన్సారీల వాదన: "సల్మాన్ (రజి) ముస్లిం కాక మునుపే మదీన పట్టణం చేరారు. ఇక్కడున్నప్పుడే ఆయన ముస్లిం అయ్యారు. అందువలన ఆయన అన్సారి అవుతాడు." ప్రియప్రవక్త (సఅసం) ఇరువర్గాల

వాదనను విన్నారు. ముస్లింలలో సోదరభావం సుదృఢం కావడం చూసి సంతోషించారు. చివరకు తీర్పునిస్తూ, "సల్మాన్ (రజి) నా కుటుంబానికి (అహ్లెబయిత్)కి చెందినవారవుతారని అన్నారు. అబూదర్దాహ్ (రజి)గారితో సల్మాన్ ఫారసీ (రజి)కి సోదర సంబంధం కల్గించారు.

హజరత్ సల్మాన్ ఫారసీ(రజి) ముస్లిం అయిన సమయంలో బదర్, ఒహద్ మహాసంగ్రామాలు ముగిశాయి. అందువలన వాటిలో పాలుపంచుకొనే అవకాశం సల్మాన్ ఫారసీ (రజి)కు దొరకలేదు. ఆ తరువాత జరిగిన సంగ్రామాలన్నిటిలో హజరత్ సల్మాన్ ఫారసీ (రజి) పాల్గొన్నారు. ధైర్య సాహసాలతో పోరాడారు. దాదాపు ఆ యుద్ధాలన్నిటిలో సల్మాన్ (రజి) ఇచ్చిన సలహాలు పాటించబడ్డాయి. దైవం వారికి విజయం ప్రసాదించాడు కూడ.

హజరత్ సల్మాన్ ఫారసీ (రజి) ముస్లిం అయిన తరువాత జరిగిన యుద్ధం 'ఖందఖ్' సంగ్రామం. ఈ సమరంలో ఆయన (రజి) ఎంతో ఆసక్తితో పాల్గొన్నారు. ఈ యుద్ధంలో అరబ్బులందరూ మిడతల దండులాగా ముస్లింలపై బడ్డారు. మదీన పట్టణాన్ని చుట్టుముట్టారు. ఇస్లామి ఉద్యమం వికసిస్తుంది. దీనిని అంతం చేయడానికి అరబ్బులు దృఢసంకల్పులయ్యారు. మదీన పట్టణంలో కోటలు లేవు. అక్కడ శత్రు బాణాలను అడ్డుకోవడానికి ప్రహరి గోడ కూడా లేదు. ప్రియప్రవక్త (సఅసం) ముస్లింలను సమీకరించారు. వారి సలహాను కోరారు. హజరత్ సల్మాన్ ఫారసీ (రజి) ఈరానీయుల యుద్ధాలు చూశారు. యుద్ధ వ్యూహాలు తెలిసినవారు. ముందుకొచ్చి ఇలా అభ్యర్థించారు. మిడతల దండులా ఉన్న ప్రత్యర్థుల సైన్యాన్ని మైదానంలో ఎదిరించడం తగదని, మదీన చుట్టూ కందకాలు త్రవ్వి, పట్టణాన్ని కాపాడుకోవాలని చెప్పారు. ఈ సలహా అందరికీ నచ్చింది. ఈ యుద్ధ వ్యూహం అరబ్బులకు తెలియదు. కందకాలు త్రవ్వబడి ఉండడం చూశారు విరోధులు. వారి బుర్రకేమి అర్థంకాలేదు. కొద్ది దినాలు కందకాల చుట్టూ వేచి చూశారు. చేసేదిలేక వెనుదిరిగి వెళ్ళారు. ముస్లింలు విజయోన్ముఖులయ్యారు. అల్లాహ్ కృప వల్ల హజరత్ సల్మాన్ (రజి)

ఇచ్చిన సలహా పనిచేసింది. ఆయన (రజి) అందరి దృష్టిలో ఉన్నత స్థానం పొందారు.

ఇలాగే ప్రతి యుద్ధ సమయంలో హజరత్ సల్మాన్ (రజి) వ్యూహ రచన, ఆయనిచ్చిన సలహాలు అమోఘంగా పనిచేశాయి. ఇలాగే హజరత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి), హజరత్ ఉమర్ (రజి) ఖలీఫాలుగ ఉన్న సమయంలో హజరత్ సల్మాన్ (రజి) అమూల్యమైన యుద్ధ సలహాలు ఇచ్చారు.

ఈరాన్‌తో యుద్ధం జరిగిన సమయంలో కూడ ఖలీఫాలు హజరత్ సల్మాన్ (రజి)తో సంప్రదించారు. ఆయన వారికి సలహాలు ఇచ్చారు. ఆ సలహాల వల్ల ఖలీఫాలు లాభపడ్డారు కూడ. హజరత్ సల్మాన్ (రజి) కేవలం మౌఖికంగా సలహాలనివ్వడమే కాకుండా, భౌతికంగా రణరంగ ప్రవేశం చేస్తూ యుద్ధ వీరులకు మార్గదర్శకంగా నిలిచేవారు. యుద్ధ ప్రారంభానికి ముందు ఇస్లాం మౌలిక విషయాలు, నియమాలు పూసగుచ్చినట్లు, సవివరంగా తెలియజేసేవారు. ఇస్లాం ఆదేశిత సూత్రాలు అవగాహనమయ్యేట్లు వివరించాక, ఒర నుండి కత్తి లాగేవారు. యుద్ధం ప్రారంభించేవారు. ఈరాన్ దేశ రాజ అంతఃపురాన్ని చుట్టుముట్టి నప్పుడు ఆయన చెప్పిన మాటలు ఆలకించండి: ఈరానీయులకు సత్యధర్మముల విషయాలు ప్రబోధించి, వాటి నియమాలు తెలియపరచి ఇలా అన్నారు:

"నేను మీ దేశస్థుణ్ణే! దైవానుగ్రహం వల్ల ఇస్లాం స్వీకరించాను. గౌరవోన్నతులు పొందాను. సోదరులారా! ముస్లింలకు విధేయులు కావడం మీకు తప్పనిసరి అవుతుంది. దాని నుండి మీరు తప్పించుకోలేరు. నేను మీకు చేసే విన్నపం ఒక్కటే ఇస్లాం స్వీకరించండి. మా సోదరులుగా మారండి. మా దగ్గరకు వచ్చేయండి. ముస్లింలకు ఇవ్వబడే హక్కులు మీకివ్వబడుతాయి. వారికి వర్తించే శాసన చట్టాలు మీకూ వర్తిస్తాయి..."

ఇదొక సుదీర్ఘ ఉపన్యాసం. మూడు దినముల వరకు ఇలాంటి సుదీర్ఘ హితోపదేశాలు ఇవ్వబడ్డాయి. ఈరానీయులు ప్రబోధనలకు లొంగకపోవడం

వల్ల ఖడ్గధారులైన ముస్లింలు వారిపై దండెత్తి వారి కోటను ముట్టడించి వశపరచుకోవడమయింది.

యుద్ధ నైపుణ్యంతోబాటు హజరత్ సల్మాన్ ఫారసీ (రజి) విద్యారంగంలో, శిక్షణ మైదానంలో, దైవభయం విషయంలో అత్యుత్తమ స్థానాన్ని ఆక్రమించారు. ప్రారంభం నుండే ఈ సుగుణాలు ఆయనలో ఉన్నాయి. జొరాష్ట్రియన్, క్రైస్తవ మతాలను బాగా అవగాహన చేసికొన్నారు. ఆ మతాలను అవలంబించి వాటి ప్రకారం తన ప్రవర్తనావళిని కూడా మలచుకొన్నారు. ఎవరయితే మత నియమాలను పాటించలేదో వారికి వ్యతిరేకంగా తన అభిప్రాయాన్ని ప్రకటించారు కూడ. అలాంటి వారిని గౌరవించనూ లేదు. ఇస్లాం స్వీకరించాక, ముస్లింగా తన జీవితాన్ని పరిపూర్ణం చేసుకొన్నారు. ఇస్లామి ధర్మప్రబోధనల అవగాహన కోసం ఎప్పుడూ ప్రియప్రవక్త (సఅసం) సమక్షంలో ఉండేవారు. నిద్ర వచ్చేంతవరకు ఆయన (సఅసం) హితవుల కోసం వేచి చూసేవారు.

విశ్వాసుల తల్లి హజరత్ ఆయిషా (రజి) ఇలా అన్నారు: "సల్మాన్ (రజి) రాత్రి వేళల్లో చాలాసేపటి వరకు ప్రియప్రవక్త (సఅసం) దగ్గర ఉండేవారు. ప్రియప్రవక్త (సఅసం) సతీమణులకు మహాప్రవక్త (సఅసం) దగ్గర గడిపే రాత్రి సమయం కూడ ఎక్కడ పోతుందో అన్న భయం వారికి ఉండేది."

హజరత్ సల్మాన్ (రజి) వినయ వినమ్రతలతో మహాప్రవక్త (సఅసం) వద్ద ధార్మిక శిక్షణ పొందారు. ఆయన ధార్మిక విజ్ఞానం ఇంతని ఎవరు లెక్కించగలరు? ఆయన ధర్మజ్ఞానం పట్ల మహాప్రవక్త (సఅసం) సహచరులకు విశ్వాసం ఉండేది. వివేకవంతులైన హజరత్ లుఖ్మాన్ (అలై)తో ఆయనను సరిపోల్చేవారు. ఆయనకు జొరాష్ట్రియిజం, బైబిల్, తౌరాతు గ్రంథాల అవగాహనతో పాటు దివ్యఖుర్ఆన్ విజ్ఞానం కూడా మహోన్నతంగ ఉండేది. పూర్వ మత గ్రంథాల ప్రజ్ఞతోపాటు, దివ్యఖుర్ఆన్ హితబోధల ప్రకారం జీవితం గడిపారు. ప్రియప్రవక్త (సఅసం) అనేవారు, "సల్మాన్ (రజి) విద్యాధికులు. విద్యతోపాటు సల్మాన్ ఫారసీ (రజి) ఆచరణలో కూడ గొప్ప గొప్ప సహాబ

(రిజ్వానుల్లాహి అలైహిమ్ అజ్మయిన్)లలో లెక్కించబడేవారు. ప్రియప్రవక్త (సఅసం) చెప్పిన ప్రతి ఒక్క మాట తు.చ. తప్పకుండా వినిపించేవారు. ప్రియప్రవక్త (సఅసం) ప్రపంచం వీడివెళ్ళే సమయంలో ఆయన (సఅసం) దగ్గర ఉన్న నాలుగు దీనార్లను ఉండనివ్వలేదు. వాటిని బీదసాదలలో పంచిపెట్టేంత వరకు విరామం పొందలేదు. అలాగే ధనధాన్యాల విషయంలో కూడ హజరత్ సల్మాన్ (రజి) ప్రియప్రవక్త (సఅసం)ను అనుసరించారు. సల్మాన్ (రజి)కు ఇల్లయితే లేదు. ప్రియప్రవక్త (సఅసం) జీవితకాలంలో సల్మాన్ (రజి) ఆయన (సఅసం) వెంటనే ఉన్నారు. ఆ తరువాత కూడ ఎక్కడా ఇల్లు కట్టుకోలేదు. ఒకానొక వ్యక్తి ఆయన కోసం ఇల్లు కట్టిస్తానని అన్నాడు. "నాకు ఇల్లు అవసరం లేదండి" అని అన్నారు హజరత్ సల్మాన్ (రజి). కాని ఆ వ్యక్తి ఇల్లు కట్టిస్తానని బలవంతం చేశాడు. ఆయన ఇష్టప్రకారం ఆ ఇల్లు ఉంటుందని అన్నారు. అంటే ఎలా ఉంటుందని అడుగ్గా "చాలా చిన్న ఇల్లు, నిలబడితే కప్పు తలకు తగులుతుంది. పడుకొంటే కాళ్ళు గోడలకు తగులుతాయి. అలాగైతే మంచిదని ఒప్పుకొన్నారు హజరత్ సల్మాన్ (రజి). ప్రియప్రవక్త (సఅసం) ఇలా ప్రవచించారు: "ఒక వ్యక్తి జీవిత సామగ్రి ఒక బాటసారి వెంట తెచ్చుకొనే వస్తువులకు మించి ఉండరాదు." ఈ ప్రవచనానికి దీటుగ ఉంది హజరత్ సల్మాన్ (రజి) జీవితం. హజరత్ సాఅద్ ఇబ్నె అబీ వఖ్ఖాస్ (రజి) ఈయన విషయంలో ఇలా అన్నారు:

"హజరత్ సల్మాన్ (రజి) ఒకప్పుడు వ్యాధిగ్రస్తులయ్యారు. ఆయన్ను పరామర్శించడానికి నేను వెళ్ళాను. ఆయన కంట నీరు కారుస్తూ ఏడ్వడం మొదలుపెట్టారు. ఏడ్వడం ఎందుకండి, మీరంటే మహాప్రవక్త (సఅసం)కు ఎంతో ప్రేమ. కౌసర్ కోనేటి వద్ద ఆయన (సఅసం)తో మీరు మళ్ళీ కలుస్తారు. (ప్రపంచంలో) విడిపోయిన సన్నిహితులతో అక్కడ మీరు కలుస్తారు కదా!"

ఇది విన్న హజరత్ సల్మాన్ (రజి) ఇలా అన్నారు: "దైవం సాక్షి ఉండుగాక! మరణం గురించి నాకు భయం లేదు. ప్రాపంచిక తాపత్రయం కూడ నాకు లేదు. ప్రియప్రవక్త (సఅసం)కు నేను మాటిచ్చాను. ప్రపంచంలో మా సామానులు

ఒక ప్రయాణీకుని సామానుకు మించి ఉండరాదు. కాని ఇప్పుడు నా చుట్టూ పాములా సామాను చుట్టుకొని ఉంది."

ఆ తరువాత హజరత్ సాఅద్ ఇబ్నె అబీ వఖ్ఖాస్ (రజి) ఇలా అన్నారు: "పాములా చుట్టుకొని ఉందన్న సామాను ఒక పెద్ద గిన్నె, వండుకొనే లగాను, నీరు త్రాగే పాత్ర."

ఈ సంఘటన ఆయన మరణకాలం నాటిది. అప్పటి ఖలీఫా ఆయన్ను మదాయిను గవర్నరుగా చేసి పంపారు. ఆయనది నిరాడంబర జీవితం. మామూలు మనిషిగా ఉండేవారు. చూసేవారు ఆయన్ను ఒక శ్రామికునిగా భావించేవారు. ఒకనాడు ఒక వ్యక్తి ఆయన్ను ఒక కూలి మనిషి అని తలంచి ఒక బరువైన సామాను మోసుకొని వెళ్ళమన్నారు. దారిలో పరిచయితులు కలిసారు. గవర్నరుకు సలాం చేశారు. "ఓ అమీరు! బరువు మాకివ్వండి. మేము దానిని గమ్యస్థానం చేరుస్తాం" అని అన్నారు. బరువు తెమ్మని ఆజ్ఞాపించిన వ్యక్తికి సిగ్గేసింది. వెంటనే క్షమాపణ కోరాడు. కాని ఆ బరువైన సామాను ఇంటికి చేర్చకుండా నేను వదలనని, అందులో నాకు సంకల్ప పుణ్యం ఉందని చెప్పారు హజరత్ సల్మాన్ ఫారసీ (రజి).

ఆయన గవర్నరుగా పరిపాలించే సమయంలో ఒక స్నేహితుడు కలువడానికి వచ్చాడు. గవర్నరును చూశాడు, ఆయన (రజి) రొట్టె కోసం పిండి కలుపుతున్నారు. "నౌకరు ఎక్కడండి?" అని అడిగాడు. "పని మీద వెళ్ళాడండి" అని జవాబిచ్చారు గవర్నరుగారు. "ఒకే సమయంలో రెండు పనులు నౌకరుతో చేయించడం తనకు నచ్చదని" అన్నారు.

హజరత్ సల్మాన్ (రజి) ఒక గవర్నరుగ ఐదు వేలు జీతం పొందేవారు. ముప్పదివేల మందికి పరిపాలకుడుగా ఉన్నారు. కాని వారి వద్ద కేవలం ఒక అబా ఉండేది. సగభాగంలో వంట చెరుకు పెట్టుకొనేవారు. మిగిలిన దానిలో సగభాగంతో కప్పుకొనేవారు. ఆ తరువాత మిగిలిన సగభాగం పరచుకొనేవారు.

జీతమంతా బీదసాదలలో పంచిపెట్టేవారు. చాపలు అల్లుకొనేవారు. అది విక్రయించి వచ్చిన క్రయధనంలో మూడవ వంతు దానం చేసేవారు. మరో మూడవ వంతు ఆలుబిడ్డలకు ఇచ్చేవారు. ఇక మిగిలిన మూడవ వంతు ప్రియప్రవక్త (సఅసం) ప్రవచన విద్య నేర్చుకోవడంలో ఆసక్తి చూపే వారికి ఇచ్చేవారు.

సాధారణ జీవితం గడిపేవారు కాని, దైవం కోసం సన్యాసం చేసేవారంటే మహా కోపం వచ్చేది. ఆయన సోదరుడు హజరత్ అబూ దర్దా (రజి) దైవ ధర్మజ్ఞతలో, దైవ భీతిలో ఉన్నత స్థానాన్ని అలంకరించారు. హజరత్ సల్మాన్ (రజి) ఆయనతో కలిసి ముచ్చటించేవారు. ఒక దినం హజరత్ అబూ దర్దా (రజి) గారి సతీమణి అతి సాధారణ బట్టలలో అలంకరణ లేకుండా ఉండడం చూసి "ఏమిటి ఇలా తయారయ్యావు?" అని అడిగారు.

"అలంకరణలు ఎవరి కోసం? మీ సోదరునికి ప్రపంచం అంటే గిట్టనే గిట్టదు. ఆయన రాత్రి నమాజులు చేస్తారు, పగలంతా ఉపవాసం ఉంటారు" అని జవాబిచ్చారు.

ఇంతలో హజరత్ అబూదర్దా (రజి) రానే వచ్చారు. క్షేమ సమాచారం అడిగి తెలుసుకొన్నారు. అన్నం తెప్పించారు. బిస్మిల్లా! తినండి అని అంటూ స్వయంగా ఏమీ తినకుండా కూర్చున్నారు. ఉపవాసం ఉంటున్నారు కాబట్టి. "మీరు తిననంత వరకు నేను తినను అని చెప్పారు హజరత్ సల్మాన్ (రజి). చివరకు ఆయన పాటిస్తున్న నఫీల్ రోజా వదలారు, సల్మాన్ (రజి)తో పాటు భోజనం చేశారు. ఇక రాత్రి అక్కడే బస చేశారు. నమాజు కోసం రాత్రి మేల్కొనగ సల్మాన్ (రజి) ఇలా అన్నారు. "మీపై మన ప్రభువు హక్కు ఉంది, మీ కంటికి హక్కు ఉంది, ఉపవాసం భోజనంతో విరమించారు. రాత్రి నమాజు ముగిశాక నిద్ర అవసరం" అని అన్నారు.

హజరత్ అబూ దర్దా (రజి), సల్మాన్ (రజి)కు ఏమీ జవాబివ్వలేదు. కాని ఉదయాన్నే ప్రియప్రవక్త (సఅసం)కు ఫిర్యాదు చేశారు. అబూ దర్దా (రజి)ను

ప్రియప్రవక్త (సఅసం) సంబోధిస్తూ, "ఓ అబూ దర్దా (రజి), మీకంటే హజరత్ సల్మాన్ (రజి) ఎక్కువ ధార్మిక విషయాలు తెలిసినవారని" అన్నారు.

హజరత్ సల్మాన్ (రజి)లో ఉన్న గుణగణాల వల్ల, ఆయన ప్రవర్తన ఆచరణల వల్ల ప్రియప్రవక్త (సఅసం) మరియు ఆయన సహచరుల దృష్టిలో గౌరవోన్నతులు కలవారై ఉన్నారు. హజరత్ ఉమర్ (రజి) ఆయన్ను తనకంటే ఎక్కువగా చూసుకొనేవారు. ఎక్కడైనా ఆసీనులై ఉంటే, హజరత్ సల్మాన్ (రజి) అక్కడికి వచ్చిన వెంటనే తన వెనుకనున్న దిండును ఆయనకిచ్చి కూర్చోబెట్టేవారు. హజరత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) ఆయన్ను అసంతృప్తిపరచి కోపపడేట్టు చేయడం తన ముక్తిమార్గం మూసుకొన్నట్లుగా భావించేవారు. ఒకప్పటి విషయం. అబూ సుఫియాన్ అగ్రశ్రేణి 'సహబ'ల వైపు నుండి వెళ్తున్నాడు. హజరత్ సుహైబ్ (రజి), హజరత్ బిలాల్ (రజి), హజరత్ సల్మాన్ (రజి) అక్కడ నిలబడి ఉన్నారు. "దైవకరవాలం, దైవశత్రువు అయిన అబూ సుఫియాన్ మెడ మీద పడలేదని" వారన్నారు. హజరత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) వెంటనే స్పందిస్తూ ఇలా అన్నారు, "ఖురైష్ సర్దారు విషయంలో ఆలాంటి మాట మీ నోట వెలువడుతుందా?" అని వాపోయారు. ఆ తరువాత ప్రియప్రవక్త(సఅసం)తో కూడ ఆ విషయం ప్రస్తావించారు హజరత్ అబూబకర్ (రజి). ప్రియప్రవక్త (సఅసం) జవాబిస్తూ ఇలా అన్నారు, "వారిని మీరు అసంతృప్తిపరచడం, దైవానికి ఆగ్రహం కల్గించడమవుతుంది." హజరత్ అబూబకర్ (రజి) వెంటనే పశ్చాత్తాపపడ్డారు. వారి వద్దకు వెళ్ళి క్షమాపణ కోరారు కూడ.

ఇంతటి మహోన్నత స్థానం హజరత్ సల్మాన్ (రజి)కు ఎలా వచ్చింది. ఆయన జీవిత చరిత్ర అందుకు సాక్ష్యం పలుకుతుంది. సత్యాన్వేషణలో ఆయన ఆప్తులను స్వదేశాన్ని వదలి, దేశవిదేశాలు తిరిగారు. సత్యధర్మం కనబడిన వెంటనే, ధార్మిక విద్య పూర్తిగా అభ్యసించారు. ధర్మానుసారం జీవితం మలచు కొన్నారు. అన్ని పనులలో దైవం, దైవప్రవక్త (సఅసం) ప్రసన్నతకే ప్రాముఖ్యం ఇచ్చేవారు. సాధారణ జీవితం వదలలేదు.

గవర్నరుగా నియమించబడ్డ తరువాత కూడ నిరాడంబరంగా జీవితం గడిపారు. యావజ్జీవితాన్ని ఇస్లామి ఉద్యమానికి ఆదర్శప్రాయంగా దారబోసారు. ఇస్లామి ఉద్యమ ప్రారంభంలో కానీయండి, ఇస్లామి సామ్రాజ్యం స్థాపితం అయ్యాక కూడ ఆయన జీవితం మనకు దారి చూపిస్తుంది. ఆయనను అనుసరించి ఇహపరాల మోక్ష సాధనకు దైవం మనకు తోడ్పడుగాక!

హజరత్ సుయేబ్ రూమి
(రజిఅల్లాహు అన్హు)

రోము మొదటి ఫలం హజరత్ సుయెబ్ (రజి) అని అన్నారు ప్రియప్రవక్త (సఅసం). అంటే, ఇస్లాం స్వీకరించిన ప్రథమ రోమను అని అర్థం. ఆయనే హజరత్ సుయేబ్ (రజి).

ఇరాక్ దేశంలో 'దజల' నదీ తీరాన మౌసుల్ అనే పట్టణం ఉంది. ఆ పట్టణానికి సమీపంలో ఒక గ్రామం ఉంది. ఆయన తండ్రిగారు 'ఉబుల్లా'కు గవర్నరు. ఈరాను చక్రవర్తి ఆయన్ను గవర్నరుగ నియమించారు. రోమన్ సైన్యం తరచు ఈరాన్ సైన్యంతో యుద్ధం చేస్తుండేది. ఒకసారి రోమన్ సైన్యం 'ఉబుల్లా'పై అకస్మాత్తుగ విరుచుకుపడింది. ఉబుల్లా వారు, వారిని ప్రతి ఘటించారు. కాని లాభం లేకపోయింది. ఆ ముట్టడిలో యుద్ధ సామగ్రితోపాటు హజరత్ సుయేబ్ (రజి)ను రోమన్లు పట్టుకెళ్ళారు. హజరత్ సుయేబ్ (రజి) ఇంకా పసిబాలుడు. రోము దేశానికి తీసికొనిపోబడ్డాడు. తండ్రిగారు ఎడబాసిన బాలుని కోసం వెదకనారంభించారు. కాని ఎక్కడా జాడ కానరాలేదు. వ్యాకులతతో దుఃఖపడుతూ ఉండిపోయారు.

హజరత్ సుయేబ్ (రజి) రోమన్ల వద్ద ఉంటూ పెరిగి పెద్దవారయ్యారు. చివరకు వారు అతణ్ణి ఒక వ్యక్తికి అమ్మివేసారు. ఆ వ్యక్తి సుయేబ్ (రజి)ను

బానిసగా మక్కా చేర్చాడు. కాని ఏదో కారణం వల్ల సుయేబ్ (రజి) యజమాని ఆయన వల్ల సంతోషపడ్డాడు. బానిసత్వం నుండి స్వేచ్ఛ ప్రసాదించాడు. హజరత్ సుయేబ్ (రజి) మక్కా నగరంలో ఒక విదేశీయునిగా జీవితం గడుపుతున్నారు. మరో వ్యక్తితో కలసి వ్యాపారం ప్రారంభించారు. మంచి లాభాలు సంపాదించి ఐశ్వర్యవంతునిగా జీవితం గడుపుతున్నారు. భాగస్వామితో మంచి స్నేహ సంబంధాలు పెంచుకున్నారు. హజరత్ సుయేబ్ (రజి)తో పరిచయం కలిగిన ప్రతి వ్యక్తి సంతోషించేవాడు. ప్రియప్రవక్త (సఅసం)తో కూడ పాత పరిచయం ఉంది. తరచూ ఆయన (సఅసం) వద్దకు వచ్చిపోయేవారు. అప్పటికి ముహమ్మద్ (సఅసం) ఇంకా ప్రవక్త కాలేదు. అప్పటి నుండి సుయేబ్ (రజి) ఆయన (సఅసం) వల్ల ప్రభావితులయ్యారు. ప్రియప్రవక్త (సఅసం)ను చూస్తూ ఆయనలోని ఎన్నో సుగుణాలను ఆయన (రజి) అలవరుచుకొన్నారు కూడ. ఆ పిమ్మట మక్కా నగరంలో దైవ ఏకత్వం, ప్రవక్త ప్రాతినిధ్యం, మరణానంతర జీవిత సందేశం మారుమ్రోగుతుంటే సుయేబ్ (రజి) లాంటి మహనీయులు మౌనంగా ఉంటారా? సంతోషంగా ఇస్లాం స్వీకరించారు, మనస్ఫూర్తిగా ముస్లిం అయ్యారు. కాని ఆయన పరిస్థితి ఎలా ఉంది? మక్కాలో బంధువులు ఎవరూ లేరు, ఆయనను సమర్థించేవారులేరు. మక్కాలోని అవిశ్వాసులు ముస్లింలయిన తమ వారినే బ్రతకనివ్వడం లేదు. ఇక ఏకాకిగా ఉన్న సుయేబ్ (రజి)ను వదులుతారా! విదేశీ కావడం వల్ల ఇష్టమొచ్చి నట్లు చిదకబాదారు. కాని దైవమార్గం నుండి ఇసుమంత మరల లేదు సుయేబ్ (రజి). ఇస్లాంను పాటిస్తూ దానికి కట్టుబడ్డారు సుయేబ్ (రజి). చివరికి ముస్లింలకు మదీన వలస పోవలసిందిగా ఆజ్ఞ ఇవ్వబడింది.

హజరత్ సుయేబ్ (రజి) మదీన వలస వెళ్ళారు. ఇందులో కూడా మనకు స్ఫూర్తిదాయకమైన ఉదాహరణ ఉంది. సుయేబ్ (రజి) తన సంపదను ప్రోగు చేసికొని మదీన వెళ్ళడానికి సంకల్పించారు. మక్కా వారికి సమాచారం తెలిసింది. అందరూ వచ్చారు, సుయేబ్ (రజి)ను ఆపారు, "నీవు చేతిలో చిల్లిగవ్వలేని బీదవాడిగా మా పట్టణానికి వచ్చావు. నీటికి, తిండికి అలమటిస్తూ

బ్రతుకు ప్రారంభించావు. ఇక్కడుండి రెండు చేతులతో సంపాదించావు. మరి వలస పేరిట ప్రోగు చేసికొన్న సిరిసంపదను మోసుకొని పోతావా! ఇది చెల్లదు" అని బెదిరించారు.

హజరత్ సుయేబ్ (రజి) తన అంబులపొది చూపిస్తూ, "నేను మీ అందరిలో ఉత్తమ విలువిద్య కలవాణ్ణి, గురితప్పక బాణాలు ప్రయోగించగలను, దైవసాక్షిగా చెబుతున్నా, వినండి. నా వద్ద ఒక్క బాణం ఉన్నా మీరు నా సమీపం కూడా రాలేరు. బాణాలు అయిపోతే, కరవాలంతో మిమ్ములను ఎదిరిస్తా. ఇక మీకు నా సిరిసంపద కావాలంటే దానిని తీసికొని నా మార్గాన నన్ను పోనిస్తారా?" అని అన్నారు. ఖురైషులకు ధనవ్యామోహం ఉంది. సుయేబ్(రజి) సంపద తీసికొన్నారు, ఆయన్ను వదిలేశారు. సుయేబ్ (రజి) కూడా డబ్బుకు ప్రాధాన్యమివ్వక, అది వారి ముఖాన పారేసి, దైవం, ఆయన ప్రవక్త (సఅసం) ఇచ్చిన హిజరత్ ఆజ్ఞకు కట్టుబడి మదీన వెళ్ళిపోయారు.

హజరత్ సుయేబ్ (రజి) తన సంపాదన వైరులకు పడేసి చేతిలో మరో సారి చిల్లిగవ్వ కూడా లేకుండా మదీన వచ్చారు. సుదీర్ఘ ప్రయాణంతో అలసిపోయారు. ఆకలితో మలమల మాడుతున్నారు. ఒక కన్ను నొప్పివేస్తుంది. మదీనలో ప్రియప్రవక్త (సఅసం) సహచరులతో కలసి ఖర్జూరపు పండ్లు తింటున్నారు. సుయేబ్ (రజి)కు ఓపిక లేకపోయింది. ఖర్జూరపు పండ్లపైబడి కబళించడం మొదలెట్టారు. హజరత్ ఉమర్(రజి) ఇలా అన్నారు: "ఓ ప్రియప్రవక్తా(సఅసం)! మీరు సుయేబ్ (రజి)ను చూడడం లేదా? ఆయనకు కండ్లకలక ఉంది. పైపెచ్చు ఖర్జూరపు పండ్లు తింటున్నారు." హజరత్ సుయేబ్ (రజి) చమత్కారంగా జవాబిచ్చారు: "ఏ వైపు కన్ను సురక్షితంగా ఉందో ఆ వైపు నుండి తింటున్నాను" అని అన్నారు. సమయస్ఫూర్తితో ఇచ్చిన సమాధానాన్ని విన్న ప్రియప్రవక్త (సఅసం) మందహాసంతో ఆయన్ను చూశారు. కొన్ని ఖర్జూరపు పండ్లు తిన్న తరువాత మక్కాలో తనపై జరిగిన దౌర్జన్యాన్ని వినిపించారు సుయేబ్ (రజి). తన సంపాదన అంతా మక్కా విరోధులకు ధారబోసివచ్చాను అన్నారు.

"మన ఈ వ్యాపారం మహా లాభం చేకూర్చేదని" సెలవిచ్చారు మహాప్రవక్త (సఅసం). ఆ పిమ్మట దివ్యఖుర్ఆన్‌లోని ఈ వాక్యం అవతరించింది.

"ప్రజలలో కొంతమంది దైవప్రీతి పొందడానికి తమ ప్రాణాలను విక్రయిస్తారు. ఇలాంటి దాసులపై దైవం కనికరం చూపిస్తాడు."

(సూరయె బఖర)

హజరత్ సుయేబ్ (రజి) పెట్టుబడి కేవలం దైవప్రీతి పొందడం, ప్రియప్రవక్త(సఅసం) పట్ల విధేయత చూపడం. ఈ రెండింటి కోసం ఆయన రెండవ ఆత్మీయ పట్టణం వదిలేశారు. జీవితమంతా ఆర్జించిన సంపాదన ఈ రెండింటి కోసం త్యాగం చేశారు. భీకర సమరాలలో, భయంకర యుద్ధాలలో ఆయన పాల్గొన్నారు, తన ప్రాణాలను పణంగా పెట్టి యుద్ధం చేశారు. ప్రియప్రవక్త (సఅసం) పాల్గొన్న రణ రంగాలన్నిటిలో సుయేబ్ (రజి) వీరోచితంగ పోరాడారు, ప్రియప్రవక్త (సఅసం) వెంట ఉన్నారు. బాణ ప్రయోగంలో సవ్యసాచి. వృద్ధాప్యంలో ప్రజలను ప్రోగు చేసి కొనేవారు, రణరంగ అనుభవాలను గుచ్చిగుచ్చి చెప్పేవారు. ప్రవర్తన, నడవడికల్లో ప్రియప్రవక్త (సఅసం)ను పూర్తిగ అనుసరించి చూపేవారు. అతిథులను సత్కరించేవారు, బీదలకు సహాయపడేవారు. దానధర్మాలలో ఎవరికీ తీసిపోయేవారుకారు. చేతి నిండా దానం చేసేవారు, చూచేవారికి ఆయన (రజి) వృధా వ్యయం చేస్తున్నాడు అనిపించేది.

ఒకసారి హజరత్ ఉమర్ (రజి) ఆయన ఖర్చు పట్ల అభ్యంతరం తెలుపగా హజరత్ సుయేబ్ (రజి), మహాప్రవక్త (సఅసం) సూక్తిని ఉటంకించారు:

"మీలో అందరికంటే శ్రేష్టులు ప్రజలకు అన్నం తినిపిస్తారు, సలాం చేసినవారికి సలాం చేస్తారు."

ప్రియప్రవక్త (సఅసం) సహచరులు, ప్రత్యేకంగా రెండవ ఖలీఫా హజరత్ ఉమర్-యె- ఫారూఖ్ (రజి), సుయేబ్ (రజి) పట్ల అధిక గౌరవం చూపేవారు. వారి సఖ్యతకు నిదర్శనం, హజరత్ ఉమర్ (రజి) దివంగతులయ్యాక వారి

నమాజ్-యె-జనాజ (మృతదేహం కోసం చేసే నమాజు) హజరత్ సుయేబ్ (రజి) చదివించాలని వీలునామా చేశారు. ఇంకా మరో ఖలీఫాను ఎన్నుకొనేంత వరకు ఆయనే ఖలీఫా బాధ్యతలు నెరవేర్చవలసిందిగ కోరారు. మూడు దినములు ఈ బాధ్యతను ఆయన ఎంతో చాకచక్యంతో నెరవేర్చారు కూడ. అల్లాహ్ కరుణ ఆయనకు కలుగుగాక! మనకందరికి ఆయన ఆదర్శాన్ని పాటించి జీవితం గడిపే భాగ్యం కలుగుగాక!

హజరత్ అబ్దుర్రహ్మాన్ బిన్ అవుఫ్
(రజిఅల్లాహు అన్హు)

మహాప్రవక్త (సఅసం) సహచరులలో అగ్రశ్రేణికి చెందినవారిలో హజరత్ అబ్దుర్రహ్మాన్ బిన్ అవుఫ్ (రజి) ఒకరు. సిరిసంపదలతో తులతూగేవారు, భాగ్యవంతులు. వ్యాపారం, సేద్యం కూడ చేసేవారు. వ్యవసాయం, జాగీర్ల నుండి లెక్కించనలవికాని లాభాలు వచ్చేవి. అబ్దుర్రహ్మాన్ (రజి) స్వయంగా అనేవారు, నేను ఒక రాయి నెత్తానంటే దానిక్రింద బంగారం దొరికేది.

హజరత్ అబ్దుర్రహ్మాన్ బిన్ అవుఫ్ (రజి) ధనవంతుడనడానికి ఒక ఉదాహరణ వినండి. ఆయన వ్యాపార సొమ్ము ఒకసారి మదీన పట్టణం చేరింది. ఏడు వందల ఒంటెల మీద గోధుమలు, పిండి, ఇంకా ఇతర తినుబండారాలు వచ్చాయి. కేవలం ఐశ్వర్యం వల్ల ఆయనకు ఇస్లామి సమాజంలో గౌరవ మర్యాదలు కలిగాయి అని ఊహించరాదు. ఇస్లామి వ్యవస్థలో ధనం వల్ల ఒక వ్యక్తికి ఆధిక్యత ఉండదు. వ్యక్తికి గౌరవం దివ్యగ్రంథ ప్రబోధనం ప్రకారం **"ఇన్న అక్రమకుమ్ ఇందల్లాహి అత్ఖాకుమ్."** "దైవసమక్షంలో గౌరవోన్నతి కలవాడు, అల్లాహ్ పట్ల భయభక్తి కలవాడే." అబ్దుర్రహ్మాన్ బిన్ అవుఫ్ (రజి) అత్యధిక ధనవంతుడు. ధనధాన్యాదులు, ఆస్తిపాస్తుల వల్ల ఆయన మనస్తత్వం

పెట్టుబడి విధానానికి దారి తీయలేదు. ఆయన జీవితం ఇందుకు సాక్ష్యమిస్తుంది. మదీన వచ్చిన వ్యాపార సామగ్రి చూశారు. హజరత్ అబ్దుర్రహ్మాన్ (రజి) వర్తక బిడారం గురించి ప్రజలు గొప్పలు చెప్పుకోవడం హజరత్ ఆయిషా సిద్దీఖి (రజి) విన్నారు. ఆమె (రజి) ఒక హదీసును ఉల్లేఖిస్తూ అన్నారు: ఐశ్వర్యం తరచూ వ్యక్తిని తన ఉన్నత స్థానం నుండి కూలద్రోస్తుంది. ఈ అభిప్రాయం వెలువడగా హజరత్ అబ్దుర్రహ్మాన్ బిన్ అవుఫ్ (రజి) వెంటనే విశ్వాసులకు తల్లి అయిన హజరత్ ఆయిషా (రజి) వద్దకు వెళ్ళారు. ఆమె (రజి)కు ఇలా చెప్పారు: "మీ సాక్షిగా చెబుతున్నా! వ్యాపార సామగ్రితో వచ్చిన బిడారును ఒంటెలతో సహా దైవమార్గంలో సమర్పిస్తున్నాను."

ఆయన జీవితంలో ఈ ఒక్క సంఘటనే కాదు, యావజ్జీవితం దైవ మార్గంలో ధనధాన్యాదులు ఖర్చు చేసేవారు. దైవమార్గంలో ధనవ్యయం ఆయనకు చాలా ఇష్టం. ఓసారి దివ్యగ్రంథంలోని **సూరయె బరాత్** అవతరణ అయింది. ప్రియప్రవక్త (సఅసం) సహచరులకు దైవమార్గంలో దానధర్మాలు చెయ్యమని నొక్కిచెప్పడమయింది. హజరత్ అబ్దుర్రహ్మాన్ బిన్ అవుఫ్ (రజి) తన సిరిసంపదల్లో సగభాగం దైవమార్గంలో సమర్పించారు. కాని అంతటితో ఆయనకు తృప్తి కలుగలేదు. మళ్ళీ నలుబది వేల దీనార్లు దైవమార్గంలో ఇచ్చారు. జిహాద్ సమయం వస్తూనే ఐదువందల అశ్వబలం, ఐదువందల ఒంటెలను యుద్ధం చేయడానికి పంపారు.

తన సంపదను బానిసలకు స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు ప్రసాదించడానికి వినియోగపరిచేవారు. ఒక్కోదినం ముప్పది, ముప్పది బానిసలను విడిపించి వారికి స్వేచ్ఛాబిక్ష పెట్టేవారు. ఒకసారి నలుబది వేల దీనార్ల భూమిని విక్రయించారు, పూర్తి మొత్తం దైవమార్గంలో ధారబోసారు. అంతులేని దానధర్మాలు చేస్తూ కూడ, ప్రళయానంతరం తన ధనం తనకు నష్టం కల్గిస్తుందేమో అని భయపడేవారు. ఈ భయంతో ఆయన ఒక పర్యాయం హజరత్ ఉమ్మె సల్మా (రజి) వద్దకు వెళ్ళారు. ఇలా అన్నారు: "అమ్మా! నిండు

ఐశ్వర్యంతో తులతూగుతున్నాను. ఈ ధనం నా జీవితాన్ని మోసగించి వధిస్తుందేమో." ఆమె సావధానంగ అన్నారు, "దైవమార్గంలో వ్యయపరచండి" అని.

హజరత్ అబ్దుర్రహ్మాన్ బిన్ అవుఫ్ (రజి) నిత్యం మరణానంతర జీవితం గురించి ఆలోచించేవారు. మంచి భోజనం వడ్డించబడినప్పుడు లేమిననుభవించిన తన జీవితాన్ని స్మరించుకొనేవారు. ఇస్లామి ఉద్యమ ప్రారంభ దశలో తినడానికి తిండిలేక పస్తులు గడిపేవారు. అప్పుడప్పుడు ఇలా అనేవారు: ముసేబ్ ఇబ్నె ఉమైర్ (రజి) నాకంటే మించిన ఐశ్వర్యవంతులు. కాని యుద్ధంలో అమరగతి పొందాక అతని మృతదేహాన్ని కప్పడానికి కేవలం ఒక దుప్పటి ఉండేది. ఆ దుప్పటిని తలపై కప్పితే కాళ్ళగుపించేవి, పాదాలు కనబడకుండా దుప్పటి వేస్తే అది తలపై నుండి తొలగిపోయేది. హజరత్ హమ్‌జా (రజి) కూడ దైవమార్గంలో ప్రాణాలు వీడారు. ఆయన కూడ హజరత్ అబ్దుర్రహ్మాన్ (రజి) కంటే మిన్నయిన జీవితం గడిపారు. ఇప్పుడు ఈ ప్రపంచం మా కోసం సువిశాలమైంది. ఈడేరని కోరికలంటూ లేవు. మేము చేసిన పుణ్యపనుల ప్రతిఫలం ఈ ప్రపంచంలోనే ఇవ్వబడ్డాయన్న భయం మాకు కలుగుతోంది. (ఇక పరలోకంలో ప్రతిఫలం ఉంటుందా!) ఈ ఆలోచనలు ఆయన్ను బాధించాయి. ఏకధారగా కన్నీరు కారుస్తూ వడ్డించబడిన భోజనం నుండి లేచిపోయారు.

దైవభయం, పరలోక ధ్యానం ఆయనలో ఎన్నో సుగుణాలు చిగురింప జేశాయి. ఈ ఆలోచనా వైఖరి వల్ల దైవమార్గంలో ధనవ్యయం గురించి ఎప్పుడూ ఆలోచించేవారు. హజరత్ అబ్దుర్రహ్మాన్ బిన్ అవుఫ్ (రజి) తన వంశ పేరు ప్రతిష్టలకు, కులంతో వచ్చిన ఇంటి పేరుకు ప్రాధాన్యత ఇచ్చేవారుకారు. ముప్పదవ ఏట ఆయన ఇస్లాం స్వీకరించారు. అసలు పేరు అబ్దె ఉమరూ. ఇస్లాంలో వ్యక్తి నామకరణంలో ఒక సూత్రం ఉంది. పెట్టుకున్న పేరులో మరో వ్యక్తికి దాసుడను అనే అర్థం రాకూడదు. ప్రతి వ్యక్తి కేవలం దైవానికే దాసుడు. అందువలన ఆయన పేరును అబ్దుర్రహ్మాన్ (రజి) అని మార్చేశారు ప్రియప్రవక్త

(సఅసం). దైవానికి దాసుడు కావడం వల్లనే ఇంటి పేరును కాలరాచారు. మక్కా నుండి మదీన వలస వెళ్ళవలసిందిగా ఆజ్ఞాపించబడినప్పుడు ఇల్లు వాకిలిని, ఇంటి వారిని, ఆప్యాయమైన స్వంత పట్టణాన్ని లెక్కచేయకుండా మదీన వెళ్ళిపోయారు.

మదీన వెళ్ళి దైవధర్మ ప్రబోధనకు సంకల్పం చేసికొని ఆ పని చేయడం ప్రారంభించారు. ప్రజలకు దైవధర్మం వైపు పిలుపునిచ్చారు. ఆయన ప్రచార ప్రబోధనలను విన్నవారు మూడు రోజులలో విశ్వాసులయ్యారు. అక్కడే ఒక ఉన్నత తెగ సర్దారు కుమార్తెను వివాహమాడారు. అబ్దుర్రహ్మాన్ బిన్ అవుఫ్ (రజి) గారికి అల్లాహ్ ఎన్నో సుగుణాలనిచ్చాడు. సంపద అపారం, ధైర్య సాహసాలు మెండు, విద్యావిజ్ఞానంలో ఆరితేరిన ప్రతిభ కలవారు హజరత్ అబ్దుర్రహ్మాన్ (రజి), ఇస్లాం సేవార్థం ఎవరికి ఏ సలహా ఇచ్చినా అది అనన్య సామాన్యంగా ఉండేది, విజయవంతంగా పనిచేసేది. ప్రియప్రవక్త (సఅసం) పరలోక గతులయ్యాక ఖిలాఫత్ సమస్యను పరిష్కరించేందుకు తన వంతు బాధ్యతను నిర్వహించారు. మొదటి ఖలీఫా హజరత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) ఆయన్ను ఒక నిస్వార్థ సలహాదారుడని తలచేవారు. అవసరమైనప్పుడు ఆయన సలహాను తీసికొనేవారు. రెండవ ఖలీఫాను ఎన్నుకొనే సందర్భంలో కూడ హజరత్ అబ్దుర్రహ్మాన్ బిన్ అవుఫ్ (రజి) గారిచ్చిన సలహాతో అగ్రశ్రేణి 'సహబా'లు ఏకీభవించారు. రెండవ ఖలీఫా హజరత్ ఉమర్-యె-ఫారూఖ్ (రజి) కాలంలో రాజ్యపరిపాలన కోసం ఒక సలహా మండలిని ఏర్పాటు చేయగా, హజరత్ అబ్దుర్రహ్మాన్ బిన్ అవుఫ్ (రజి)ను సలహామండలి సభ్యునిగా చేశారు. రెండవ ఖలీఫా హయాంలో కూడా హజరత్ అబ్దుర్రహ్మాన్ బిన్ అవుఫ్ (రజి) మంచి మనస్సుతో సలహాలనిచ్చేవారు. తరచూ ఆయన విజ్ఞత దక్షతలతో కూడిన సలహాలతోనే పెద్ద పెద్ద కార్యక్రమాలు జరిగేవి.

ఇరాక్‌పై దాడి జరిపినప్పుడు, నిహావంద్ సంగ్రామ సమయంలో ఇరాక్‌పై విజయం సాధించినప్పుడు, హజరత్ అబ్దుర్రహ్మాన్ (రజి) ఎన్నో సలహాలనిచ్చారు.

మూడవ ఖలీఫా కోసం హజరత్ ఉమర్ (రజి) ఈయన పేరును ప్రతిపాదించగా, ఈయన తన పేరును ఉపసంహరించుకొన్నారు. మూడవ ఖలీఫా కోసం ఈయన హజరత్ ఉస్మాన్ (రజి) పేరు ప్రస్తావించగ, అందరూ ఆయన్నే ఖలీఫాగా ఎన్నుకొన్నారు. జీవితాంతం వరకు నిస్వార్థతతో, త్యాగనిరతితో ఇస్లాం సేవ చేస్తూ వచ్చారు.

డెబ్బది ఐదవ సంవత్సరం కాలధర్మం చెందారు. మృతదేహం దగ్గర నిలబడి హజరత్ అలీ (రజి) ఈయనను గురించి ఇలా అన్నారు: "ఓ ఇబ్నె అవుఫ్ (రజి)! మీరు ప్రపంచంలో ఉన్నంత కాలం మంచినీటిని సేవించారు, మలినపు నీటిని వదిలేశారు." హజరత్ సాఅద్ ఇబ్నె అబీ వఖ్ఖాస్ (రజి) ఈయన ఘనతను ఇలా శ్లాఘించారు: "ఓహ్! ఈ పర్వతం కూడ వెళ్ళిపోయింది!" ప్రియప్రవక్త (సఅసం) కూడా హజరత్ అబ్దుర్రహ్మాన్ బిన్ అవుఫ్ (రజి) అంటే ఎంతో ప్రాధాన్యతనిచ్చేవారు. ఒకప్పుడు సైన్యాధికారిగా ఉన్న ఖాలిద్ బిన్ వలీద్ (రజి) గారు, అబ్దుర్రహ్మాన్ (రజి)గారితో పోటీపడ్డారు. ప్రియప్రవక్త (సఅసం) ఖాలిద్ (రజి)ను మందలించి ఇలా అన్నారు: "ఖాలిద్ (రజి)! మీరు నా సహచరులతో వ్యతిరేకించకండి, వారిని వదలెయ్యండి, మీరు దైవమార్గంలో ఒహద్ పర్వతమంత బంగారం ఖర్చుపెట్టినప్పటికీ మీరు వారితో సమానులు కాలేరు."

విద్యవినయాలలో, దానధర్మాలలో, దైవ భయంలో ఇస్లామి శాస్త్ర విషయాలలో ఇస్లాం సామ్రాజ్య ఖలీఫాకు బహిరంగంగా సలహాలనిచ్చేవారు సలహాలు ఇస్లాం పరిధిలోనే ఉండేవి. ఆస్తి వారసత్వాల విషయంలో ముస్లిమేతరులతో సంబంధాలు కలిగి ఉండే విషయంలో, అబ్దుర్రహ్మాన్ (రజి గారిచ్చిన అభిప్రాయాలను అందరూ అంగీకరించేవారు. హజరత్ ఉస్మాన్ (రజి)గారు ఖలీఫాగా ఉన్నారు. హజరత్ జుబేర్ (రజి) ఏదో విషయంలో హజరత్ అబ్దుర్రహ్మాన్ (రజి)పై ఫిర్యాదు చేశారు. హజరత్ ఉస్మాన్ (రజి) ఆ కేసు తీర్పునకు హజరత్ అబ్దుర్రహ్మాన్ (రజి)కు అధికారమిచ్చారు. అంటే న్యాయం చేయడంలో

ఆయనకు ఆయనే సాటి. ప్రియప్రవక్త (సఅసం) ప్రపంచం వీడాక ఆయన (సఅసం) గృహిణులను చూసుకొనే బాధ్యత హజరత్ అబ్దుర్రహ్మాన్ (రజి)కే అప్పగించబడింది. ఈ బాధ్యత అప్పజెప్పడంలో ప్రియప్రవక్త (సఅసం) సహచరులందరిలో ఆయనపట్ల ఎంత గౌరవం ఉండిందో తెలుస్తుంది. ప్రియప్రవక్త (సఅసం) హజరత్ అబ్దుర్రహ్మాన్ బిన్ అవుఫ్(రజి)కు జీవితంలోనే స్వర్గీయులవుతారని భవిష్యవాణి పలికారు. అబ్దుర్రహ్మాన్ (రజి)కు ప్రపంచంలో దేవుడిచ్చిన విశిష్ట బహుమానాలనన్నిటిని దైవమార్గంలోనే వినియోగించారు. దైవమిచ్చిన విద్యాబుద్ధులు, వివేక విచక్షణలు అన్నీ ధర్మ వ్యాప్తి కోసం, దాని ఉన్నతి కోసం వినియోగించారు. దేవుడిచ్చిన ఆత్మాభిమానం, స్వయం కృషిని కూడ దైవమార్గంలోనే ఉపయోగించారు. భాగ్యవంతుడయినప్పటికీ మామూలు అన్నపానీయాలు తప్ప మరెలాంటి భోగభాగ్యాలను అనుభవించలేదు.

హజరత్ సయీద్ ఇబ్నె ఆమిర్ (రజిఅల్లాహు అన్హు) ఖిలాఫత్ కాలంలో ఒక గవర్నర్

హజరత్ సయీద్ ఇబ్నె ఆమిర్ (రజి) ఇస్లామి ఉద్యమ ప్రారంభ దశలో ఇస్లాం స్వీకరించిన వారు కానప్పటికీ ఆయన జీవితం ధర్మనిరతికి ఆదర్శం, దైవభయం కలిగి ఉన్న వారంటే ఆయన తప్పక జ్ఞాపకం వస్తారు. జీవితం గడపడంలో అనేక ఇబ్బందులుంటాయి, దైవ ధర్మపరాయణులై బ్రతకాలంటే అవరోధాలు వస్తూనే ఉంటాయి. అలాంటి క్లిష్ట సమయాల్లో మనకు దారి చూపుతుంది హజరత్ సయీద్ ఇబ్నె ఆమిర్ (రజి) జీవితం. ముఖ్యంగా ఇస్లామి సామ్రాజ్యంలో ఉంటూ బాధ్యతా భారం తలమోసిన వారికి హజరత్ సయీద్ ఇబ్నె ఆమిర్ (రజి) జీవితం స్ఫూర్తినిచ్చే జీవితం. ఇస్లామేతర సామ్రాజ్యంలో

కూడ, ప్రజాస్వామ్యం, సమానత్వపు ఢంకా మ్రోగించేవారికి హజరత్ సయీద్ ఇబ్నె ఆమిర్ (రజి) జీవితం ఒక ఉదాహరణ.

హజరత్ సయీద్ ఇబ్నె ఆమిర్ (రజి) ఖైబరు యుద్ధానికి ముందు ముస్లిం అయ్యారు. ఇస్లాం స్వీకరించాక మదీన వలస వెళ్ళవలసి వచ్చింది. ఇంటిని, కుటుంబాన్ని, స్వదేశాన్ని వదలి వెళ్ళారు. మహాప్రవక్త (సఅసం) పాల్గొన్న మహా యుద్ధాలన్నింటిలో హజరత్ సయీద్ ఇబ్నె ఆమిర్ (రజి) అశేష ధైర్య సాహసాలతో పాల్గొని తన ప్రజ్ఞ, పాటవాన్ని ప్రదర్శించారు.

హజరత్ ఉమర్ ఫారూఖ్ (రజి) ఖిలాఫత్ కాలం. యర్మూక్ యుద్ధానికి హజరత్ అబూ ఉబేద (రజి) సారథ్యం వహించి పోరాడుతున్నారు. తనకు సహాయార్థం ఒక సైనిక జట్టును పంపవలసిందని ఖలీఫాను కోరగా హజరత్ ఉమర్ ఫారూఖ్ (రజి) ఒక యుద్ధ వీరుల బృందాన్ని హజరత్ సయీద్ ఇబ్నె ఆమిర్ (రజి) ఆధ్వర్యంలో పంపారు. ఈ యుద్ధంలో హజరత్ అబూ ఉబేద పెద్ద పెద్ద పనులు సాధించారు. మరో సందర్భంలో హజరత్ అయూస్ ఇబ్నె గనమ్ (రజి) స్వర్గీయులయ్యాక హమస్ పట్టణపు గవర్నరు పదవి ఖాళీ అయింది. హజరత్ ఉమర్ (రజి) ఆ ఖాళీ పదవిలో హజరత్ సయీద్ ఇబ్నె ఆమిర్ (రజి)ను నియమించడమయింది. హజరత్ ఆమిర్ (రజి) గవర్నరు పదవి కాలంలో ఒకరు ఆయనకు వ్యతిరేకంగా కేంద్ర కార్యాలయానికి రిపోర్టు చేశారు. గవర్నరుగారు మతిస్థిమితం లేకుండా ఉంటారని తెలుపబడింది. హజరత్ ఉమర్-యె-ఫారూఖ్ (రజి) వెంటనే విచారణ కోసం గవర్నరును మదీన పిలిపించారు. రమ్మని పిలిచినతోడనే గంభీరంగా ఆయన మదీన వచ్చారు. ఆయన రావడం చరిత్ర పుటలలో ఇలా వర్ణించబడింది: హమస్ గవర్నరు హజరత్ ఆమిర్ (రజి) చేతిలో ఒక కర్ర వుంది, అన్నం తినడానికి ఒక గిన్నె ఉంది. హజరత్ ఉమర్ (రజి) ఆయనను చూసి, "ఏమిటి, జీవితం గడిపేందుకు మీ వద్ద ఉన్నదంతా ఇంతేనా?" అని అడిగారు. జవాబుగా గవర్నరు గారు, "వీటికంటే జీవితంలో కావలసిందింకేముంది?" అని పలికారు. " నా వద్ద ఒక

గిన్నె ఉంది. ఆ గిన్నెలో భోజనం చేస్తున్నాను, ప్రయాణపు ఖర్చులను చేతి కర్రకు కట్టి నడుస్తున్నా." ఉమర్ (రజి)అడిగారు, "మీకు మతిస్థిమితం లేదని విన్నాను." అందుకు హజరత్ ఆమిర్ (రజి) "నిజం కాదు" అని బదులు పలికారు.

"అయితే మీకు మతిభ్రమ కలుగుతుందని, మూర్ఛపోతారని నాకెలా తెలిసింది?" అని అన్నారు.

ప్రశ్న అడగ్గానే హజరత్ ఆమిర్ (రజి) ఇలా జవాబిచ్చారు. "అవునండి నిజమే,అది మతిభ్రమ కాదు. దీనికి కారణం ఉంది. హజరత్ హబీబ్ ఇబ్నె అది (రజి) దైవమార్గంలో ప్రాణాలర్పించారు. ఆ సంఘటన నేను కన్నులార చూశాను. ఖురైషుల చేతుల్లో ఆయన చిత్రహింస చేయబడ్డారు. అప్పుడు నేను ఖురైషులతో ఉన్నాను. హబీబ్ ఇబ్నె అది (రజి) ఖురైషులను తీవ్రంగా శపించారు. నేను ఖురైషుల్లో ఉన్నాను. ఆయన శపించిన మాటలు నా వీనుల్లో మారుమ్రోగుతున్నాయి. వాటివల్ల భయభ్రాంతుడనై మూర్ఛ పోతున్నాను" అని అన్నారు సయీద్ ఇబ్నె ఆమిర్ (రజి). సయీద్ ఇబ్నె ఆమిర్ (రజి) ఇచ్చిన సంజాయిషీ తరువాత ఆయనపై వచ్చిన ఆరోపణలో ఏలాంటి పస లేదని తెలుసుకొని ఖలీఫా ఆయన (రజి)ను గవర్నరుగా కొనసాగనిచ్చారు.

దైవభీతి ప్రగాఢంగా ఉంది ఆమిర్ (రజి)కు. ధార్మిక గ్రంథాలలో ఆమిర్ (రజి) గారి దైవభీతి విషయం అమితంగా చర్చించబడింది. ఇక్కడ రెండు సంఘటనలు వివరిస్తున్నాం.

1. హజరత్ సయీద్ ఇబ్నె ఆమిర్ (రజి) హమస్ గవర్నరుగా ఉన్నప్పుడు హజరత్ ఉమర్ (రజి) అక్కడ చాలా మంది బీదవారున్నారని, లేమిననుభవించే వారి ఆర్థిక పరిస్థితి మెరుగుదిద్దాలని వెళ్ళారు. వెళ్ళడానికి ముందు హమస్ ప్రాంతంలో ఉన్న బీదవారి పట్టికనొకదానిని తయారు చేయించారు. ఆ పట్టికలో హజరత్ సయీద్ ఇబ్నె ఆమిర్ (రజి) పేరు కూడా ఉంది. "ఈ సయీద్ ఇబ్నె ఆమిర్ (రజి) ఎవరు?" అని అడిగారు ఖలీఫా.

"అమీర్, హమస్ గవర్నరండి" అని జవాబివ్వబడింది.

"మీ గవర్నరు బీదవారు, వచ్చే జీతం ఏం చేస్తున్నారు?"

ప్రజలన్నారు, "జీతం ఆయన ముట్టుకోనేముట్టుకోరు, బీదలకు దానం చేస్తారు."

హజరత్ ఉమర్ (రజి), హజరత్ ఆమిర్ (రజి) నిస్వార్థత, దాతృత్వం చూచి కంట తడిపెట్టారు. వెంటనే ఒక వెయ్యి దీనార్ల సంచి ఆయన కోసం పంపారు ఖలీఫా. తన అవసరాలు తీర్చుకోవలసిందిగా కోరారు. హజరత్ ఆమిర్ (రజి) ఆ సంచిని చూస్తూనే గొప్ప ఆపద పైబడినట్లు **"ఇన్నాలిల్లాహి వ ఇన్నాఇలైహిరాజివూన్"** అని చదివారు. ఆయన ఇల్లాలు అది విని విభ్రాంతి చెంది "ఏమండీ! ఖలీఫాకు, ఇస్లాంకు ఏదైనా ఆపద వచ్చిందా" అని అడిగారు. "దానికంటే తీవ్రమైన విపత్తు వచ్చిపడింది" అని చెప్పారు ఆమిర్ (రజి). "ఏమండీ ప్రళయం సంభవించిందా?" "ప్రళయానికంటే భయానకమైందని" అన్నారు. ఆయన సతీమణి అడిగారు, "చివరకు అయిందేమిటండీ?" "ప్రాపంచిక తాపత్రయం సంక్షోభ వ్యవహారం తీసికొని మన ఇంటికి వచ్చింది" అని అన్నారు ఆమిర్ (రజి). "అయితే రానివ్వండి" అన్నారావిడ. వెంటనే వచ్చిన డబ్బును ఒక గంపలో వేసి రాత్రంతా నమాజులో గడిపారు. ఉదయం ఒక ఇస్లామి సైన్యం ఆ దారిన వచ్చింది. ఆ పూర్తి మొత్తాన్ని ఆ సైనిక బృందం అవసరం కోసం ఇచ్చేశారు ఆమిర్ (రజి).

రెండవ సంఘటన వినండి: సయీద్ ఇబ్నె ఆమిర్ (రజి) లాంటి వారు ప్రజాపాలకులుగా ఉంటే అక్కడి ప్రజలు ఆయనపట్ల ఎంత ప్రేమ కలిగి ఉంటారో ఆలోచించుకోండి. ప్రజా సౌఖ్యం ఆయన ధ్యేయం. ప్రజలు కూడా పాలకుని పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండేవారు. ప్రజలు, గవర్నరు మధ్య ఉన్న సన్నిహిత సంబంధం గురించి విన్నారు ఖలీఫా. దర్యాప్తు చేశారు. "ఓ ఆమిర్ (రజి), మీరంటే ప్రజలకింత వ్యామోహం ఎందుకు?" జవాబుగా ఆయన అన్నారు,

“నేను వారిని కంటికి రెప్పలా చూస్తాను. వారంటే దయాదాక్షిణ్యాలు కలిగి ఉంటాను.” ఈ జవాబు హజరత్ ఉమర్ (రజి)ను సంతుష్టపరచింది. పదివేల దీనార్లు బహుమానంగా ఇచ్చారు. హజరత్ సయీద్ ఇబ్నె ఆమిర్ (రజి) ఆ ధనం తీసికొనేందుకు నిరాకరించారు. “నా గుర్రాలు, పని మనుషుల నుండి వచ్చే ఆదాయం నాకు చాలు” అని అన్నారు. హజరత్ ఉమర్ (రజి), ఇచ్చిన డబ్బును తీసికోండి. వాపసు చేయకండి. ఒకప్పుడు ప్రియప్రవక్త (సఅసం) నాకు కొద్ది ధనం ఇచ్చారు. నేను మీలాగే ఇచ్చిన ధనాన్ని వాపసు చేయదలిచాను. ప్రియప్రవక్త (సఅసం) అన్నారు, “అడుగకుండా, అల్లాహ్ ఇచ్చినదాన్ని స్వీకరించాలి. అది అల్లాహ్ ప్రసాదించిన అనుగ్రహం.”

ఇట్టి విషయాలు విన్న తరువాత ఒక ఆలోచన కలుగుతుంది. వృద్ధాప్యంలో మనిషి ఇలాగే ప్రవర్తిస్తాడని అనుకొంటాం. కాని ఒక వాస్తవం తెలుసుకోండి. హజరత్ సయీద్ ఇబ్నె ఆమిర్ (రజి) తన మరణ సమయంలో కేవలం నలుబది సంవత్సరాల ప్రాయం కలవారే! అల్లాహ్ ఆయనంటే సంతోషపడుగాక!

హజరత్ అమ్మార్ ఇబ్నె యాసిర్ (రజిఅల్లాహు అన్హు)

హజరత్ అమ్మార్ (రజి) తండ్రిగారు యాసిర్ (రజి). యాసిర్ (రజి) యమన్ దేశానికి చెందినవారు. యాసిర్‌కు చాలా మంచి అన్నదమ్ములుండేవారు. ఒకప్పుడు అన్నదమ్ముల్లో ఒకరు ఎక్కడికో వెళ్ళారు. ఆయన సమాచారం ఏమీ తెలియకుండా ఉంది. యాసిర్ (రజి) మరో ఇద్దరు సోదరులతోపాటు తప్పిపోయిన సోదరుని కోసం గాలింపసాగారు. వెదుకుతూ వారు మక్కా చేరారు. మక్కా నుండి యాసిర్ (రజి)తో బాటు వచ్చిన సోదరులు వాపసు వచ్చేశారు. కాని యాసిర్ (రజి) అక్కడే ఆగారు. మక్కాలోని ఒక ఐశ్వర్యవంతుడు అబూ

హుజైఫ (రజి) ఈయనకు స్నేహితుడయ్యారు. యాసిర్ (రజి) ఒంటరిగా జీవితం గడపడం చూసి హుజైఫ (రజి) తన దాసి జనం నుండి ఒక బుద్ధిమంతురాలైన సుమయ్యాను ఇచ్చి ఈయనకు వివాహం చేయించారు. ఈ దంపతుల వల్ల కలిగిన సంతానమే హజరత్ అమ్మార్ (రజి).

హజరత్ అమ్మార్ (రజి) ఇస్లామి ఉద్యమ ప్రారంభ దశలోనే విశ్వాస భాగ్యం నోచుకొన్నారు. కాని ఆ సమయంలో ముస్లిములు కావడం ఆపదలకు పిలుపునివ్వడమే. మక్కాలోని ముష్రికులు (బహుదైవారాధకులు) ముస్లింలపై భరింపనలవికాని శిక్షలు వేసేవారు. వేధింపులు అమితంగా పెరిగిపోగా రక్షణ కోసం మహాప్రవక్త (సఅసం), హజరత్ అర్ఖమ్ అబీ అర్ఖమ్ (రజి) ఇంటిలో ముప్పది మంది సహచరులతో ఉన్నారు. ఇలాంటి గడ్డుకాలంలో హజరత్ అమ్మార్ (రజి), ఆయన తండ్రి యాసిర్ (రజి), తల్లి సుమయ్యా (రజి), సోదరుడు అబ్దుల్లాహ్ (రజి) ఇంటి పరివారం అంతా ముస్లింలయ్యారు.

హజరత్ అమ్మార్ (రజి) ఒక పరదేశీ సంతానం. ఆయన కుటుంబం మక్కా వారితో ఏలాంటి బంధుత్వ సంబంధం లేనిది. ఇక ఆర్థికంగా కూడ ఐశ్వర్యవంతులుకారు. బంధుత్వం, సిరిసంపదలులేని కారణంగా వారిని ఆదుకోనేవారు మక్కాలో ఎవరూ లేరు. ఒక్క అబూ హుజైఫా (రజి) కుటుంబీకులు యాసిర్ (రజి) కుటుంబీకులపై దయాదాక్షిణ్యాలు కలిగి ఉన్నారు. కాని ఇస్లామి ఉద్యమ ప్రారంభానికి ముందే హుజైఫా (రజి) మరణించడం ఒక దురదృష్టం. హజరత్ అమ్మార్(రజి)ను ఒక దిక్కులేనివారుగా ఉండడం చూశారు మక్కా ముష్రికులు. ఇస్లాం అంగీకరించిన నేరానికి ఆయన్ను చితక బాదారు. ఎడారిలో మిట్ట మధ్యాహ్నం నిప్పులా మండిపోయే ఇసుకపై అమ్మార్ (రజి)ను పడేసి ఈడ్చేవారు. నివురుకప్పిన నిప్పుపై నగ్నంగా పడేసేవారు. చర్మం కాలి ఆయన దేహం మండుతుంటే అల్లరి మూకలు ఆనందపడేవి. నీటి మడుగులో దింపి నిరవధికంగా మునకలు వేయించేవారు. ఊపిరాడక కేకలువేస్తే అవిశ్వాసులకది సంతోషం కల్గించేది. ఏది ఏమైనా విశ్వాస బీజం ఎవరి హృదయంలో నాటుకొని

పోతుందో వారి ధైర్యస్థయిర్యాలు నిలకడగా ఉంటాయి. ఎవరూ వారిని ఆ దారి నుండి మళ్ళించలేరు.

హజరత్ అమ్మార్ (రజి) తల్లి హజరత్ సుమయ్యా (రజి) ఒక మహిళ మాత్రమే కాదు. ఇస్లామి ఉద్యమంలో శిఖరాగ్ర శ్రేణికి చేరిన కార్యకర్త. ఉరకలు వేసే ఉత్తేజం ఆమె మనస్తత్వం. అబూ జహల్ అలాంటి వారిని సహించగలడా! ఒక దినం కోపావేశాలతో వచ్చాడు, బల్లెంతో ఆమె పొత్తికడుపు మీద బలంగా పొడిచాడు. ఆమె నేల వాలారు, ప్రాణాలు విడిచారు. హజరత్ అమ్మార్ (రజి) తండ్రిగారిని కూడా నానా బాధలు పెట్టి ఆయన ప్రాణాలు పొట్టనబెట్టుకొన్నాడు. హజరత్ యాసిర్ (రజి) సోదరుడయిన హజరత్ అబ్దుల్లాహ్ (రజి)ను కూడా ముష్రికులు చంపారు. హజరత్ అమ్మార్ (రజి) కుటుంబం మొత్తం ఈ విధంగా దౌర్జన్యానికి ఆహుతి కావడం చూస్తూ ప్రియప్రవక్త (సఅసం)కు జాలివేసేది. వారిపై కొండలు మీదపడేట్లు బాధలు విపరీతమవుతున్నప్పటికీ గుండెబలంతో స్థిరంగా ఇస్లాంపై నిలబడడం చూసి మహాప్రవక్త (సఅసం) ఇలా అన్నారు:

"ఓ అమ్మార్ (రజి) కుటుంబీకులారా! మీ అందరికీ శుభవార్త వినిపిస్తున్నాను వినండి. స్వర్గం మీ రాక కోసం నిరీక్షిస్తుంది."

మక్కా ముష్రికులు సాగిస్తున్న దౌర్జన్యాన్ని ప్రియప్రవక్త (సఅసం) చూశారు. ఎర్రని నిప్పులు కక్కే అగ్నిలో హజరత్ అమ్మార్(రజి)ను పరుండబెట్టారు. హజరత్ అమ్మార్ (రజి) దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రియప్రవక్త (సఅసం) ఈ దృశ్యం చూసి ఇలా అన్నారు:

"ఓ అగ్నీ! ఇబ్రాహీం (అలై) కోసం నీవు చల్లబడినట్లే హజరత్ అమ్మార్ (రజి) కోసం చల్లబడు!"

హజరత్ అమ్మార్ (రజి) తన నిస్సహాయతను ప్రియప్రవక్త(సఅసం)కు తెలియపరుస్తూ చేయవలసిందేమని విన్నవించగా, "ఓర్పు వహించండి" అన్నారు. అల్లాహ్‌తో అర్థిస్తూ ఇలా ప్రార్థించారు: "ఓ ప్రభూ! యాసిర్ వంశాన్ని మన్నించు."

పరీక్షా సమయంలో హజరత్ అమ్మార్ (రజి) బాధలు పడుతూ వచ్చారు. ఒక సుదీర్ఘకాలం ఈ ఆపదలననుభవించారు. చివరకు అల్లాహ్ వారిని కరుణించాడు. పడుతున్న బాధల నుండి విముక్తినిచ్చాడు. ముస్లింలకు హిజరత్ చేయమని అల్లాహ్ ఆజ్ఞ ఇచ్చాడు. మొదట అబిసీనియా, ఆ తరువాత మదీనకు వలస వెళ్ళారు హజరత్ అమ్మార్(రజి). దైవమార్గంలో అమ్మార్ (రజి) చూపిన ధైర్యం, వెనుదిరగని ఆత్మబలం, సత్యధర్మం పట్ల ఉన్న అభిలాషను చూస్తూ ప్రియప్రవక్త (సఅసం) షైతాను విషవలయం నుండి ఆయనను సురక్షితంగా పెట్టాలని ప్రార్థించారు. హజరత్ అమ్మార్ (రజి) మంచి చెడులకు గీటురాయిగా నిలిచారు. ప్రియప్రవక్త (సఅసం) ఆయన్ను చూచి, "అమ్మార్ (రజి) రక్తనాళాలలో విశ్వాసం సుస్థిరపడిందని" అన్నారు. ఎన్నోమార్లు ఆయనను చూసి ప్రియప్రవక్త (సఅసం) భవిష్యవాణి పలుకుతూ, "ఓ అమ్మార్! నీ ప్రాణాలను ఒక విద్రోహ ముఠా పొట్టనపెట్టుకొంటుందని" అన్నారు.

హజరత్ అమ్మార్ (రజి) విషయంలో ఆయన న్యాయశీలరత కలవారని తెలుపడం వల్ల, **'సహాబా'** పరస్పరం తమ తగాదాలను హజరత్ అమ్మార్ (రజి)తో పరిష్కరించుకొనేవారు. ఆయన ఇచ్చిన సూచన అమూల్యంగా ఉండేది. హజరత్ అలీ (రజి)గారి ఖిలాఫత్ కాలంలో ముస్లిం సమాజం చీలిపోగా, తటస్థంగా ఉన్నవారు హజరత్ అమ్మార్ (రజి)ను అనుసరిస్తూ, హజరత్ అలీ (రజి)ను సమర్థించారు. పరస్పరం వివాదాలలో పడ్డ రెండు వర్గాల మధ్య యుద్ధాలు కూడా జరిగాయి. ఆ యుద్ధాలు గర్హనీయమైనవి కూడా. ఆ యుద్ధాలలో ఇద్దరు వ్యక్తులు హజరత్ అమ్మార్(రజి)ను పట్టుకొన్నారు. ఆయన నిండు ప్రాణాలు తీశారు. తలను దేహం నుండి వేరు చేశారు. వారి స్థావరం వద్దకు ఆ తలను తీసికెళ్ళారు. బహుమానం పొందే యత్నంలో అతణ్ణి నరికింది తానేనని ఇరువురు వాదించ మొదలెట్టారు. అక్కడే హజరత్ అబ్దుల్లా ఇబ్నె ఉమరు ఇబ్నుల్ ఆస్ (రజి) ఉన్నారు. వారిరువురు వాదులాడుకోవడం చూసి "మీరిరువురు ఒకరు మరొకరి మాటను అంగీకరించాలి. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) హజరత్

అమ్మార్ (రజి) విషయంలో భవిష్యవాణి పలుకుతూ హజరత్ అమ్మార్ (రజి)ను విద్రోహశక్తులు వధిస్తారని సెలవిచ్చారు." అక్కడే హజరత్ అబ్దుల్లా (రజి)గారి తండ్రి ఉమర్ ఇబ్నుల్ ఆస్ (రజి) ఉన్నారు. ఆయన ఇలా అన్నారు: "దైవంసాక్షి ఉండుగాక! వీరిద్దరు నరకం చేరడానికి తగవులాడుతున్నారు."

హజరత్ అమ్మార్ (రజి) జీవితాంతం వరకు అల్లాహ్ ప్రేమకు, సంతోషానికి పాత్రుడవ్వాలని కృషి చేశారు. ప్రియప్రవక్త (సఅసం) ఉన్నంత వరకు అనేక యుద్ధాలలో ప్రాణాలొడ్డి పోరాడారు. ఖలీఫాల కాలంలో కూడా ఆయన అనేక మహాయుద్ధాలలో పాల్గొన్నారు. యమామ యుద్ధంలో జరిగిన ఒక సంఘటన ఆలకించండి. ఈ సంఘటన ఆసక్తిదాయకం, గుణపాఠం కూడా నేర్పుతుంది.

యమామ యుద్ధం జరుగుతుంది. హజరత్ అమ్మార్ (రజి) ధైర్యంతో పోరాడుతున్నారు. దెబ్బకు ముందు ఎదురు దెబ్బ వేస్తున్నారు. అకస్మాత్తుగా ఆయన చెవి ఒకటి తెగింది, నేలపై పడి ఎగిరెగిరి కొట్టుకొంటుంది. కాని ఆయన దాని సంగతి అటుంచి జిహాద్‌లో సంపూర్ణంగా నిమగ్నమై ఉన్నారు. జయాపజయాలు యుద్ధాలలో మారుతుంటాయి. ముస్లింల సైన్యం వెనక్కు వెళ్ళుతోంది. ఇది చూసిన అమ్మార్ (రజి) ఒక ఎత్తయిన శిలనెక్కారు, వీర విజృంభణతో అన్నారు: "ముస్లింలారా! స్వర్గ ద్వారాల నుండి మళ్ళుతున్నారా! నేను అమ్మార్ ఇబ్నె యాసిర్‌ను. రండి! నాకు సహాయపడండి!"

ఉరుములా వినిపించింది ఈ గర్జన. అది విని ముస్లింలు పునః సమీకరించు కొన్నారు. యుద్ధంలో విజయం సాధించుకొన్నారు.

హజరత్ ఉమర్ (రజి)గారి ఖిలాఫత్ కాలం. హజరత్ అమ్మార్ (రజి) కూఫా పట్టణపు గవర్నర్ అయ్యారు. అక్కడి ఒక శ్రీమంతుడు తన మాట నిజమని అదే నిర్ధారణ చెయ్యమని ఒక విషయంలో గవర్నరుపై ఒత్తిడి తెచ్చాడు. కాని గవర్నరు అందుకు నిరాకరించారు. పర్యవసానం ఐశ్వర్యవంతునికి కోపం

వచ్చింది. "ఓ చెవి కోయబడ్డవాడా!" అంటూ ఎక్కిరించాడు గవర్నరును. హజరత్ అమ్మార్ (రజి) గవర్నరైనప్పటికి కోపపడకుండా, "నాకు అత్యంత ప్రియకరమైన చెవిని నీవు నిందించడం విచారకరంగా ఉంది" అని మాత్రమే అన్నారు.

ఇస్లాం ఉద్యమంలో ముందుండడవే కాకుండా, వీరోచితంగా యుద్ధాలలో పాల్గొనడమేకాకుండా, వివేక విచక్షణలతో మేలిగేవారు హజరత్ అమ్మార్ (రజి). ఇస్లామి సామ్రాజ్యంలో పెద్ద పెద్ద హోదాలనలంకరించారు. కూఫాలాంటి అత్యంత ప్రామాణిక ప్రదేశానికి గవర్నరుగా ఉంటూ తన బాధ్యతలను సమర్ధతతో నిర్వహించారు. పదవులపై వ్యామోహం లేనివారు. నిరాడంబర జీవి. అట్టహాసాలు లేని జీవితమంటే ఆయనకు ప్రియం. హజరత్ అలీ (రజి) ఒకప్పుడు ఒక నీటి కాలువను పరీక్షించేందుకు అమ్మార్ (రజి)ను వెంటతీసికొని వెళ్ళారు. కాలువ తనఖీ చాలా సమయం తీసికొంది. అలసి పోయారు, నిద్ర ఆవరించింది. ఒక చెట్టు క్రింది వట్టి నేలపై పడుకొన్నారు.

హజరత్ అమ్మార్ (రజి)గారికి నమాజుపై ఆసక్తి ఎక్కువ. శ్రద్ధాసక్తులతో, దైవభయంతో, ఏకాగ్రత వినమ్రతలతో నమాజు చేసేవారు. తరచూ రాత్రంతా నమాజుల్లో, దివ్యగ్రంథ పారాయణంలో, దైవనామ స్మరణలో గడిపేవారు. ఒకసారి హజరత్ అబ్దుల్లా ఇబ్నె అబ్బాస్ (రజి) ఇలా అన్నారు:

"రాత్రి వేళల్లో నిలుచుండి, సజ్దా చేస్తూ ఆరాధించే వ్యక్తి ప్రళయ దినం పట్ల భీతిల్లుతాడు. అల్లాహ్ అనుగ్రహానికి పాత్రుడవుతాడు." దివ్యఖుర్ఆన్‌లోని ఈ వాక్యంలో హజరత్ అమ్మార్ (రజి)ను గురించే చెప్పబడిందన్నారు.

హజరత్ అమ్మార్ (రజి) 91 సంవత్సరాలు బ్రతికారు. కాని వయోవృద్ధ చిహ్నాం అతని పనులలో కనబడేదికాదు. చివరి శ్వాస వరకు ధర్మకార్యాలలో ఇతరులకంటే ముందుండి కృషి చేసేవారు. తరచూ అల్లాహ్‌ను ప్రార్థించేవారు.

"ఓ ప్రభూ! కొండ మీద నుండి దూకి, అగ్నిలో కాలి లేదా నీటిలో మునిగి మరణించడం వల్ల నీ సంతోషం, ప్రీతి పొందగలిగినట్లయితే నేను

నిన్ను సంతృప్తపరిచేవాణ్ణి. నీ ప్రీతిని పొందడానికే నేను రణరంగం వెళ్తున్నా. ఓ ప్రభూ! నీ సంతోషం పొందడం నా ధ్యేయం. నా సంకల్పంలో నన్ను కృతార్థుణ్ణిచేయి. ఇదే నా అభీష్టం ప్రభూ!" అని వేడుకొన్నారు.

నిశ్చయంగా అల్లాహ్ ఆయనకు సాఫల్యం ప్రసాదించాడు. దైవమార్గంలోనే ఆయన తన అసువులుబాశారు. అల్లాహ్ ప్రసన్నత ఆయనకు కలుగుగాక!

హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్ఊద్
(రజిఅల్లాహు అన్హు)

హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్ఊద్ (రజి) అల్లాహ్ ప్రీతి చూరగొన్న మహనీయులలో ఒకరు. ప్రియప్రవక్త ముహమ్మద్ (సఅసం) మక్కా పట్టణంలో ఏకేశ్వరోపాసనం వైపు ఆహ్వానిస్తున్నారు. ఆ పట్టణంలోని శ్రీమంతులు, సాంప్రదాయవాదులు, మహాప్రవక్త (సఅసం) ప్రబోధించే సత్యధర్మం పట్ల వైముఖ్యం వహించారు. ఎవరైనా ఇస్లాం స్వీకరిస్తే వారికి బద్ధ శత్రువులయ్యేవారు. కండ బలం కలవారు ముస్లిములను చితక బాదేసేవారు. ఆలోచింపతరముగాని అగచాట్లకు బలి చేసేవారు. ఆ బాధలు, పైపడే ఆపదలు చూస్తూ ఎవరూ సత్యధర్మ స్వీకారానికి ముందుకు రాకూడదనేదే వారి ధ్యేయం. ఇలాంటి దుర్వ్యవస్థ ఉన్న సమాజంలో హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్ఊద్ (రజి) విశ్వాసి కావడం, మనందరికి గుణపాఠాన్నిస్తుంది. మన విశ్వాసం పటిష్టపరుచుకోవడానికి ఆయన జీవితం దోహదపడుతుంది.

హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్ఊద్ (రజి) బాల్యంలో కష్టపడి జీవితం గడిపేవారు. మేకలను మేపేవారు. వచ్చీరాని కొద్ది ఆదాయంతో జీవితం సాగేది. ఒకప్పటి విషయం. హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్ఊద్ (రజి) మేకల్ని కాస్తున్నారు. ఆయన అదృష్టం ఫలించే సమయం వచ్చింది. ఆ దారిన మహాప్రవక్త (సఅసం) రావడం జరిగింది. వెంట హజరత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) ఉన్నారు. మహాప్రవక్త

(సఅసం)కు దాహమేసింది. హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్ఊద్ (రజి) చెంత చేరి ఇలా అన్నారు: "ఓ అబ్బాయి! దాహమేస్తుంది. కొద్ది పాలుంటే ఇవ్వు, మేము మా దాహాన్ని తీర్చుకొంటాం." హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్ఊద్ (రజి) జవాబిచ్చారు: "నేను కాస్తున్న మేకలలో చాలా మేకలు పాలిచ్చేవే. కాని అవి నావికావు, ఇతరులవి. యజమాని అనుమతి లేనిదే వాటి పాలను ఇతరులకివ్వడం అమానుతులో ద్రోహం చేసినట్టే కదా! నేను వాటి పాలను ఇవ్వలేను."

ఇచ్చిన జవాబు మహాప్రవక్త (సఅసం) మనస్సును ఆకట్టుకొంది. అల్లాహ్ ఈ బాలునకు అమానతు భద్రం చేసే మహాభాగ్యమిచ్చాడు అని తలస్తూ ఇలా అన్నారు: "మంచిది. నీ మందలో ఈనకుండా ఉండి పాలు ఇవ్వని ఏదైనా మేక ఉందా?" "అవునండి ఉంది" అంటూ చెబుతూ ఒక పాలు ఇవ్వని మేకను పట్టుకొచ్చారు హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్ఊద్ (రజి) మహాప్రవక్త (సఅసం) తెచ్చిన మేక చన్నులపై చేయిత్రిప్పి అల్లాహ్‌ను ప్రార్థించారు. నిండా పాలు ఉబ్బుకొని వచ్చాయి. హజరత్ అబూబకర్ (రజి) ఆ మేకను ప్రక్కకు తీసికెళ్ళి పాలు పితుకగా ఆ ముగ్గురు మహనీయులు కడుపు నిండా త్రాగడానికి పాలు వచ్చాయి. ఆ తరువాత మహాప్రవక్త (సఅసం) ఆ మేక చన్నులు యథాప్రకారం వట్టిగా ఉండాలని అల్లాహ్‌ను ప్రార్థించారు. ఆ మేక ముందు మాదిరి పాలివ్వని మేకగా మారింది, మందలో చేరింది.

హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్ఊద్ (రజి) కన్నులారా చూశారు ఈ మహత్యాన్ని. ఎంతో ప్రభావపూరితులయ్యారు. మహాప్రవక్త (సఅసం) ప్రబోధించే ధర్మం తనకు తెలియజేయాలని అర్థించారు హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్ఊద్ (రజి). "నేను మిమ్మల్ని అల్లాహ్ ప్రవక్తగా విశ్వసిస్తున్నానని" అన్నారు. ఈ మాటలు మహాప్రవక్త (సఅసం)కు ఎంతో నచ్చాయి. "నాయనా! నీకు ధార్మిక విద్య తెలుసు" అని చెబుతూ ప్రియప్రవక్త (సఅసం) సహచరులలో ఆ బాలుని చేర్చుకొన్నారు. ఖుర్ఆన్ గ్రంథాన్ని నేర్పారు. హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్ఊద్ (రజి) ఎంతో శ్రద్ధాసక్తులతో కృషి చేస్తూ దివ్యఖుర్ఆన్ పఠనం నేర్చుకొన్నారు.

కంఠస్థం చేసుకొన్నారు. అప్పట్లో ఇంకా ఎవరూ చేయని డెబ్బది సూరాలను దివ్యఖుర్‌ఆన్‌లో నుండి కంఠస్థం చేసుకొన్నారు.

హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్‌ఊద్ (రజి) నిండు యవ్వనంలో ఉన్నారు. ఇస్లాం సందేశ ప్రేరితులు కావడం వల్ల మరింత వన్నెతేలారు. ఒక పర్యాయం జరిగిన విషయం. మహాప్రవక్త (సఅసం) సహచరులతో కూర్చొని ఉన్నారు. పరస్పరం మంతనాలు చేసికొంటున్నారు. మక్కా ఖురైషులు ఇంత వరకు దివ్యఖుర్‌ఆన్‌ను ఉచ్చస్వరంతో పఠించడం వినలేదు. వారికి ఒక్కమారు దివ్యఖుర్‌ఆన్ పఠిస్తూ వినిపింపజేయాలని తలచారు. కాని ఈ పని ఎవరు చేయాలి. ఎవరైతే ఈ పని చేస్తారో వారికి దుర్గతి పడుతు...ని అందరికీ తెలిసిందే. హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్‌ఊద్ (రజి) అన్నారు: "ఈ పని నేను చేస్తాను." ప్రియప్రవక్త (సఅసం) సహచరులు అన్నారు: "వద్దు, వద్దు. నీకెవరూ లేరు. నీవు ఏకాకిగా ఉన్నావు. ఎవరి కుటుంబం పెద్దదో, వారే ఈ పని చేయాలి. ఖురైషులు కొట్టవస్తే అతని కుటుంబ పరివారం ఆయన్ను రక్షించడానికి రాగలరు." హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్‌ఊద్ (రజి) మళ్ళీ అన్నారు: "ఈ పని చెయ్యడానికి నాకు అనుమతివ్వండి. అల్లాహ్ నా పాలిటి రక్షకుడు. నేనీ పని తప్పకుండా చేసి తీరుతా"నని అన్నారు.

రెండవ దినం హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్‌ఊద్ (రజి) ఖురైషుల వద్ద చేరారు. సూరయె రహమాన్ శ్రావ్యంగా మొదలయింది. ఇది విన్న ఇస్లామి శత్రువులు కుపితులై కళ్ళెర్రజేస్తూ ఒక్కమారు హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్‌ఊద్ (రజి)పై విరుచుకుపడ్డారు. ఉత్తేజంతో దివ్యఖుర్‌ఆన్‌ను పఠిస్తున్న యువకుణ్ణి చిత్రహింస చేయనారంభించారు. ఖురైషులు హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్‌ఊద్ (రజి)ను కొట్టుతూ కొట్టుతూ క్రింద పడేశారు. కాని హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్‌ఊద్ (రజి) కూడా తానెంత వరకు ఆ సూరాను వినిపించదలిచారో అంతవరకు వినిపించేంత వరకు వదల్లేదు. పూర్తిగా వినిపించాక మౌనం వహించారు.

చీవాట్లు తిని, చిత్రహింస చేయబడి నిర్బల స్థితిలో ప్రియప్రవక్త (సఅసం) సహచరుల వద్దకు వచ్చారు హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్ఊద్ (రజి). శరీరానికి గాయాలయ్యాయి. ముఖం గుర్తుపట్టనంతగా వాచిపోయింది. ఆత్మీయులు కన్నీరుగార్చారు. ఈ దుర్గతి పడుతుందనే మేము నిన్ను ఆ పనికి పూనుకోవద్దని చెప్పాము అన్నారు. కాని హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్ఊద్ (రజి) సహవాసుల ఆవేదన వింటూ వారికిచ్చిన సమాధానం ఎంత మనోజ్ఞంగా ఉందో చూడండి: "దైవసాక్షిగా చెబుతున్నాను. వినండి. దైవధర్మ విరోధులు గౌరవ మర్యాదలు కలవారు అనుకొన్నాను. వారంటే గొప్పవారని భ్రమపడ్డాను. కాని ఈ దినం వారి ప్రతిభ ఏమిటో నాకు తెలిసింది. వారికి మించిన హీనులు మరెవ్వరూ లేరంటే నమ్మండి. మీరు అనుమతించారంటే రేపు మరోసారి ఈ పని చేసి వస్తాను." హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్ఊద్ (రజి) మిత్ర బృందం ఒక్కమారు అన్నారు: "చాలు. చేసింది చాలు. వారు వినదలచలేదు, మీరు వినిపించి వచ్చారు. మీ బాధ్యత తీరింది."

ఈ సంఘటన మక్కావాసులకు కనువిప్పు అయింది. ఒక నవ యువకుడు ఉత్ప్రేరితుడై ఇస్లాంను మనసార స్వీకరించాడు. అప్పటి నుండి హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్ఊద్ (రజి) మక్కా వీధుల్లో అవిశ్వాసుల కంట పడ్డాడంటే చాలు, ఏకాంతంలో అగుపించాడంటే ఇంకేముంది, అతణ్ణి పట్టుకోవడం, ఇష్టానుసారం కొట్టడం, స్పృహ కోల్పోయే స్థితి వరకు హింసించడం జరిగేది. విపరీత పరిస్థితులు ఏర్పడ్డాక, మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ముస్లింలను మక్కా నుండి అబిసీనియా దేశానికి వలస వెళ్ళమని చెప్పారు. హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్ఊద్ (రజి) ప్రారంభంలో అబిసీనియాకు వలస వెళ్ళిన వారిలో ఒకరు. ఆ పిమ్మట మహాప్రవక్త (సఅసం) మదీన పట్టణానికి వెళ్ళమని ఆదేశమిచ్చినప్పుడు హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్ఊద్ (రజి) అబిసీనియా నుండి మదీన పట్టణానికి వలస వెళ్ళారు. మదీన వచ్చాక హజరత్ మాఅస్ ఇబ్నె జబల్ (రజి) ఇంట అతిథిగా ఉన్నారు. హజరత్ మాఅస్ (రజి) కూడా యువకులు. అందుచేత

వారిరువురి సఖ్యత బాగా రాణించింది. ఆ తరువాత ప్రియప్రవక్త (సఅసం) మదీన వచ్చారు. వారిరువురి మధ్య సోదర సంబంధం ఏర్పరచారు. హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్ఊద్ (రజి) మదీనలో నివాసం ఏర్పరచుకొనేందుకు ప్రియప్రవక్త (సఅసం) మసీదు దగ్గర కొద్ది స్థలం కేటాయించడమయింది.

మక్కా నుండి ముస్లింలు మదీన రావడం మక్కావాసులకు భయం సృష్టించింది. ముస్లింలు మదీన పౌరులతో సఖ్యత ఏర్పరచుకొని బలపడతారని, ఆ తరువాత వారిని అదుపులో పెట్టడం కష్టసాధ్యమని ఊహించారు. ముంచుకొని రానున్న ముప్పును గ్రహించిన మక్కావాసులు మదీనలోని ముస్లింలపై దండెత్త సన్నాహాలు చేయసాగారు. ఎన్నో యుద్ధాలు చేశారు కూడా. హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్ఊద్ (రజి) అన్ని సంగ్రామాలలో పాల్గొన్నారు, వీరోచితంగా యుద్ధం చేశారు. ఇస్లామి ఔన్నత్యం కోసం, శత్రు పరాజయం కోసం యుద్ధాలలో ధన ప్రాణాలొడ్డి కృషి చేశారు. ఎల్లప్పుడు ఇస్లాం ప్రగతి కోసం సర్వం త్యాగం చేయడానికి సంసిద్ధులై నిలిచారు.

హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్ఊద్ (రజి) కేవలం ఉద్రేక ఉత్తేజాలతో అప్రమత్తంగా మెలిగే ధైర్యశాలి మాత్రమేకాక, మంచి ఇంగిత జ్ఞానం గల వివేకవంతుడు కూడ. మహాప్రవక్త (సఅసం) సన్నిధిలో ఎప్పుడూ ఉంటూ దివ్యఖుర్ఆన్ పట్ల మంచి అవగాహన ఏర్పరచుకొన్నారు. విద్య వివేకాలతో ప్రతిభగల వ్యక్తిగా నిలిచారు. ఖిలాఫత్ సమయంలో సుదీర్ఘకాలం ఖాజీగా తన సేవలందించిన న్యాయమూర్తి. ఎల్లప్పుడూ దైవభయం మెండుగా గల ధర్మశాలి. న్యాయపరిశీలన సమయంలో ఫిర్యాది ఎంతటి పెద్ద వ్యక్తి అయినా సరే ఏలాంటి మినహాయింపు లేకుండా తీర్పులనిచ్చేవారు. ఈయన హజరత్ ఉస్మాన్ (రజి) ఖలీఫాగా ఉన్న కాలంలో కాలధర్మమొందారు. ఆయన వయస్సు అప్పుడు 60 సంవత్సరాలు మాత్రమే. ఆయన చివరి రోజుల్లో హజరత్ ఉస్మాన్ (రజి)తో హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్ఊద్ (రజి) చేసిన సంభాషణలో మనకు గుణపాఠంగా ఉంది. ఆ సంభాషణ మేమిక్కడ పొందుపరుస్తున్నాం.

హజరత్ ఉస్మాన్(రజి) : మీరు ఏ వ్యాధితో బాధపడుతున్నారు?

హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్ఊద్ (రజి) : నేను చేసిన పాపములననుభవిస్తున్నాను.

హజరత్ ఉస్మాన్ (రజి) : మీకేం కావాలి?

హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్ఊద్ (రజి) : దైవ కృప కావాలి.

హజరత్ ఉస్మాన్ (రజి) : మీ కోసం ఒక వైద్యుణ్ణి పిలిపించవచ్చా?

హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్ఊద్ (రజి) : నాకు అనారోగ్యమిచ్చింది ఆ (ఆ పరమ) వైద్యుడే కదా!

హజరత్ ఉస్మాన్ (రజి) : మీ కోసం పెన్షన్ మంజూరు చేయనా?

హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్ఊద్ (రజి) : నాకది అవసరం లేదు.

హజరత్ ఉస్మాన్ (రజి) : మీ కుమార్తెలకు అది పనికొస్తుంది కదా?

హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్ఊద్ (రజి) : నా కుమార్తెలు ఇతరులపై ఆధారపడి జీవిస్తారనే తలంపు మీకు కలుగరాదు. వారికి నేను ఒక సూచన ఇచ్చాను. ప్రతి రోజూ రాత్రి సూరయె వాఖియ చదువుకోమని చెప్పాను. మహాప్రవక్త (సఅసం) ఏమని సెలవిచ్చారంటే, ఎవరైతే ప్రతి రోజు రాత్రి సూరయె వాఖియా పఠిస్తారో వారు ఇతరుల ఆధారం కోరరు, ఆకలిదప్పులననుభవించరు.

ఇలాంటి సంపూర్ణ విశ్వాసంగల హజరత్ అబ్దుల్లా ఇబ్నె మస్ఊద్ (రజి) జీవితం అడుగుజాడల్లో నడిచే అదృష్టం అల్లాహ్ మనందరికి ప్రసాదించుగాక.

ఈ భూమిపై మనం ఎలా బ్రతకాలి, ఆయనిచ్చిన వస్తువుల్ని మనం ఎలా వాడాలి, వాటి విధానం కూడ మాకు తెలియజేశాడు ప్రభువు. ఈ విషయ ప్రబోధన కోసం అల్లాహ్ ప్రవక్తల్ని పంపించాడు. ప్రవక్తలు ప్రభువు గ్రంథాల్ని కూడా తెచ్చి ఇచ్చారు. ఈ గ్రంథాలలో దైవాజ్ఞలున్నాయి. జీవితం గడిపే మార్గం ఉంది. ప్రవక్తల వరంపరలో మహాప్రవక్త ముహమ్మద్(స) చివరివారు. వీరిపై దివ్యగ్రంథం ఖుర్ఆన్ను అవత రింపజేశాడు. మానవాళి కోసం పంపబడిన చివరి గ్రంథమిదే. ఈ గ్రంథం పొల్లుపోకుండ భద్రంగ ఉంది. అసలు రూపంలో ఉంది. దీనికంటే ముందు పంపబడిన గ్రంథాలలో ప్రజలు మార్పులు చేర్పులు చేశారు, కొన్నిటిని చిత్తు కాగితాల్లా వేస్టు చేసుకొన్నారు. కాని అల్లాహ్ స్వయంగ తన గ్రంథం ఖుర్ఆన్ను భద్రపరిచే బాధ్యత తీసుకొన్నాడు.

ఇంకా ఇస్లాం మౌలిక విషయాల విస్తృత అధ్యయనానికి, అవగాహనకు చదవండి:

ఇస్లాం ప్రబోధిని

1 నుండి 4 భాగాలు

మూలం: మౌలానా అఫ్జల్ హుసైన్   తెలుగు అనువాదం: అబ్బాదుల్లా

వివరాలకు:

TIP HYDERABAD

తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్
సందేశభవనం, లక్కడ్‌కోట్,
హైదరాబాద్-500 002. ఫోన్: 24564583